

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 300

ఆదివారం 21-1-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




రంగనాథుని సేవలో మోదీ

తమిళనాడు శ్రీరంగంలోని ప్రఖ్యాత రంగనాథ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ప్రధాని. -6లో




సోరెన్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ సీఎంను 7 గంటలపాటు ప్రశ్నించిన అధికారులు. -6లో



శ్రీరాముడికి పలుకుదాం స్వాగతం
అయోధ్యలోని ప్రతీ వీధిని అలంకరిద్దాం
శిరస్సు వంచి నమస్కరిస్తాడు
దేశంలోని ప్రతీ బాహుబలి
దేశ ప్రజలందరికీ హృదయపూర్వక
అభినందనలు మరియు శుభాకాంక్షలు
Bahubali
PAN MASALA
A quality product from
PAN BAHAR
NO TOBACCO NICOTINE
www.panbahar.in
CHEWING OF PAN MASALA IS INJURIOUS TO HEALTH. NOT FOR MINORS



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 300

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

అయోధ్య భక్తజన సంద్రం



బాలరాముడి ప్రాణప్రతిష్ఠ రేపే

అయోధ్య.... ఆ పేరు వింటేనే ఆధ్యాత్మిక పరవశం... భవ్యమైన దివ్య మందిరంలోకి రామచంద్ర ప్రభువు వేంచేయబోతున్నాడు. భక్తకోటి ఆర్తి తీరేలా రేపు బాలరాముడిగా తొలి దర్శనభాగ్యం కలిగించబోతున్నాడు.

'సాక్షి' ప్రత్యేక కథనాలు - 12,13 పేజీల్లో



శోభాయమానం.. రామమయం 6 లో

100 మీటర్ల గొయ్యి తీసి.. బీఆర్‌ఎస్‌ను పాతిపెడతా!

- ఎన్నికల్లో ఓడినా బుద్ధిరాలేదు: రేవంత్
- లోక్‌సభ ఎన్నికల్లో తేల్చుకుందాం
- పులి బయటికి వస్తుందంట.. దాని కోసమే చూస్తున్నాం.. బోను, వల సిద్ధంగా ఉన్నాయి

2 లో

ముందు 100 రోజుల్లో హామీలు అమలు చెయ్యి!

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ కౌంటర్
- రేవంత్‌లా అహంకారంతో మాట్లాడే వారిని వంద మందిని చూశాం
- హామీలపై తప్పించుకోవాలని చూస్తే కాంగ్రెస్‌ను వదలం

2 లో

'బడ్జెట్'లోపే కేబినెట్ విస్తరణ!

ఖాళీగా ఉన్న మంత్రి పదవులు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఒక్కో బెర్త్.. రేసులో బాలూ నాయక్, జి.వివేక్, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకర్... రెడ్డి, వెలమ కోటాలో తీవ్ర పోటీ..
- రెడ్డి సామాజిక వర్గానికి ఒక పదవి దక్కే అవకాశం... సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డిలలో ఎవరికి చాన్స్ అన్న దానిపై ఉత్కంఠ
- వెలమ కోటాలో ప్రేమ్‌సాగర్‌రావు, మదన్‌లలో ఒకరికి పదవీయోగం
- రాహుల్ స్వయంగా చెప్పడంతో ఎన్‌ఎస్‌యూఐ నేతకు కేబినెట్ చాన్స్!
- 15 రోజుల్లోగా కొత్త మంత్రులు కొలువుదీర వచ్చంటున్న గాంధీభవన్ వర్గాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపే కేబినెట్ విస్తరణ ఉండవచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ప్రస్తుతం కేబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉండటంతో.. ఎవరెవరికి అవకాశం వస్తుందన్న దానిపై కాంగ్రెస్ నేతల్లో తీవ్ర ఉత్కంఠ కనిపిస్తోంది. కొత్తగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి, అగ్రవర్ణాలకు చెందిన ఇద్దరు నేతలకు అమాత్యయోగం దక్కుతుందన్న చర్చ జరుగుతోంది. అయితే అందుబాటులో ఉన్న ఆరు పదవులను ఒకేసారి భర్తీ చేస్తారా? పలు సమీకరణాల నేపథ్యంలో

మిగతా 3వ పేజీలో ▶

100 మీటర్ల గొయ్యితీసి..

బీఆర్‌ఎస్‌ను పాతిపెడతా!

అసెంబ్లీ ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డా ఆ పార్టీకి బుద్ధి రాలేదు: సీఎం రేవంత్‌రెడ్డి

- రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మీరో మేమో తేల్చుకుందాం
- పులి బయటికి వస్తుందంట.. బోను, వల సిద్ధంగా ఉన్నాయి
- నా పోటీ ప్రపంచంతో దివాలా తీసిన దద్దమ్మలతో కాదు
- ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం మీద దాడులేంటని మండిపాటు
- లండన్‌లో 'ఇండియా దయాస్పోరా ఆర్గనైజేషన్స్ మీట్' వేదికగా విమర్శలు


ఇండియా దయాస్పోరా ఆర్గనైజేషన్స్ మీట్‌లో మాట్లాడుతున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొక్కబోర్లాపడేసి బొక్కలిరగ్గొట్టినా బుద్ధి రాలేదని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆనవాళ్లు లేకుండా 100 మీటర్ల గొయ్యి తీసి పాతిపెడతామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికల్లో మీరో, మేమో చూసుకుందామని సవాల్ చేశారు. పులి బయటికి వస్తోందంటూ బీఆర్ఎస్ వాళ్లు మాట్లాడుతున్నారని.. దాని కోసమే ఎదురుచూస్తున్నానని, తమ దగ్గర బోను, వల ఉందని వ్యాఖ్యానించారు. బ్రిటన్ పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి శుక్రవారం లండన్‌లో నిర్వహించిన 'ఇండియా డయాస్పోరా ఆర్గనైజేషన్స్ మీట్'కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

''దేశ సరిహద్దు దాటిన తర్వాత రాజకీయాలు మాట్లాడొద్దని, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలనుకుని బయలుదేరాను. కానీ ఈ నాలుగు రోజుల్లో రాష్ట్రంలో జరుగుతున్న చర్చలు.. తండ్రీకొడుకులు, అల్లుడు కలసి ప్రజలెన్నుకున్న ప్రజా ప్రభుత్వం మీద చేస్తున్న దాడులను చూశాక.. లండన్ గడ్డమీద రాజకీయ అంశాలు మాట్లాడదల్చుకున్నా. మంచి పనులకు ఎవరు పునాదిరాయి వేసినా.. వాటిని కొనసాగించడానికి నాకు గానీ, మా ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవు. కానీ కొందరు తమ కుటుంబం కోసం రాష్ట్రాన్ని పణంగా పెట్టి, లక్షల కోట్ల రూపాయలు దోపిడీ చేశారు. పైగా ఈ రోజు అవినీతి గురించి చర్చే జరగొద్దన్నట్టు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించవద్దన్నట్టు మాట్లాడుతున్నారు.

ప్రపంచంతో పోటీ పడతాం..

మేం సుపరిపాలన వైపు రాష్ట్రాన్ని నడిపించాలన్న ఆలోచనతో అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళుతుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. నేను సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, సామాన్య కార్యకర్తగా మొదలుపెట్టి 20 సంవత్సరాల్లో ముఖ్యమంత్రి హోదాకు చేరుకున్నా. ఇది ఆషామాషీగా రాలేదు. అయ్యనో, తాతనో ఇస్తే రాలేదు. నేను అయ్య పేరు చెప్పుకుని మంత్రి అయ్యి, విదేశీ పర్యటనల పేరు మీద విలాస జీవితం గడపడానికి రాలేదు. రాష్ట్ర అభివృద్ధిని మనసులో పెట్టుకుని వచ్చా. పక్క రాష్ట్రాలతో పోటీపడాలన్న ఆలోచన కాదు నాది. ఈ ప్రపంచంతోనే పోటీపడే ఆలోచన. ప్రపంచంతో పోటీపడే యువత, హైదరాబాద్ నగరం, ఐటీ మేధావులు, జీనోమ్ వ్యాలీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ, ఫార్మా కంపెనీలు నా దగ్గరున్నాయి. ప్రపంచంతో పోటీపడతానే తప్ప దివాలా తీసిన దద్దమ్మలతో నాకేం పోటీ? వారికి అధికారం పోయినా అహంకారం, బలుపు తగ్గినట్టు లేదు. మేం బ్రిటన్‌కు వచ్చి ఇంతమంది కుటుంబ సభ్యులను కలిశాం. ప్రతి పర్యాటకుడు హైదరాబాద్ రావాలి. అక్కడి పర్యాటక ప్రాంతాలను ఆస్వాదించాలి. ఫొటోలు దిగాలి. థేమ్స్ నది స్ఫూర్తితో మూసీని అభివృద్ధి చేస్తాం..'' అని రేవంత్ చెప్పారు. తెలంగాణ శక్తి, వారసత్వ సంపదకు మీరే ప్రచారకులని, రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని లండన్‌లోని ఎన్నారైలను కోరారు.

పార్లమెంటు ఎన్నికల్లో చూసుకుందాం

60 ఏళ్లలో 16 మంది సీఎంలు రూ.72 వేల కోట్లు అప్పులు చేస్తే.. గత పదేళ్లలో ఒకే ఒక్క కుటుంబం రూ.ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి ఆ దరిద్రాన్ని మన నెత్తిమీద పెట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసే దిశలో పనిచేస్తామని చెప్పాం. కానీ అసెంబ్లీ మొదలుపెట్టిన రోజునే.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని బిల్లా, రంగాలు అడిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని, నాయకులను బొక్కబోర్లా పడేసి బొక్కలిరగ్గొట్టినా బుద్ధి రాలేదు. ఇంకా మాట్లాడుతున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చూసుకుందాం. బిల్లారంగా, చార్లెస్ శోభారాజ్‌లకు సూటిగా సవాల్ విసురుతున్నా. రెండు రోజుల్లో తెలంగాణ గడ్డమీద కాలుపెడతా. ఈ నెల 26వ తేదీ తర్వాత ఇంద్రవెల్లిలో మొదలుపెట్టి తెలంగాణ నలుమూలలా సుడిగాలి పర్యటన చేస్తా. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మీ నిషాన్ (ఆనవాళ్లు) లేకుండా వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెడతా.

అందరి సలహాలు, సూచనలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళతానని చెప్పారు.

ముందు వంద రోజుల్లో

హామీలు అమలు చెయ్యి!

బీఆర్‌ఎస్‌ను వంద మీటర్ల లోతులో పాతే అంశంపై తర్వాత మాట్లాడొచ్చు.. సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

- రేవంత్‌లా అహంకారంతో మాట్లాడేవారిని వంద మందిని చూశాం
- మీ దొంగ హామీలను ప్రశ్నిస్తున్నందుకు తెలంగాణ జెండాను బొందపెడతారా?
- హామీలపై తప్పించుకోవాలని చూస్తే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోం
- రేవంత్ రక్తమంతా బీజేపీదే.. త్వరలో ఏక్‌నాథ్ షిండేలా మారుతారని వ్యాఖ్య
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్
- జనవరి విద్యుత్ బిల్లులెవరూ కట్టవద్దని ప్రజలకు పిలుపు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ముందు వంద రోజుల్లో హామీల అమలుపై దృష్టిపెట్టాలని, ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడవచ్చని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు పేర్కొన్నారు. మఖలో పెట్టి పుబ్బలో కలసిపోయే పార్టీ అని టీఆర్ఎస్ గురించి చాలా మంది మాట్లాడారని, రెండున్నర దశాబ్దాలుగా పార్టీ నిలబడిందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీని వంద మీటర్ల లోపల బొందపెడతామంటూ సీఎం రేవంత్‌రెడ్డి లండన్‌లో చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ''తెలంగాణ జెండాను ఎందుకు బొంద పెడతావ్.. తెలంగాణ తెచ్చినందుకా? తెలంగాణను అభివృద్ధి చేసినందుకా? మిమ్మల్ని, మీ దొంగ హామీలను ప్రశ్నిస్తునందుకా?'' అని నిలదీశారు. ఇలా అహంకారంతో మాట్లాడే రేవంత్ వంటి నాయకులను టీఆర్ఎస్ తన ప్రస్థానంలో చాలా మందిని చూసిందన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల సమీక్ష సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు ఏక్‌నాథ్ షిండేలా మారుతారని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతాయని పేర్కొన్నారు. రేవంత్ రక్తం అంతా బీజేపీదేనని, చోటా మోదీగా రేవంత్ మారారని విమర్శించారు. అదానీ గురించి గతంలో అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్.. ఇప్పుడు ఆయన వెంటపడుతున్నారని, వారి మధ్య ఒప్పందాల అసలు లోగుట్టు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అన్న రేవంత్.. ఇప్పుడు ట్రిపుల్ ఇంజిన్‌గా మారారని ఆరోపించారు.

ఎవరూ కరెంటు బిల్లులు కట్టొద్దు

ప్రజలెవరూ జనవరి నెల కరెంటు బిల్లులు కట్టవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం గృహజ్యోతిని అమల్లోకి తెచ్చేదాకా బిల్లులు కట్టొద్దన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులను సోనియాగాంధీ కడుతుందని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. అధికారులు కరెంటు బిల్లులు అడిగితే రేవంత్ చెప్పిన మాటలను వినిపించాలన్నారు. కరెంట్ బిల్లుల ప్రతులను సోనియాగాంధీ నివసించే 10 జన్‌పథ్‌కు పంపించాలన్నారు. కిరాయి ఇళ్లలో ఉండే వారికి కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు రూ.2,500 ఆర్థికసాయం వెంటనే అమల్లోకి తేవాలన్నారు. ఇచ్చిన హామీలపై తప్పించుకోవాలని చూస్తే కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

బీజేపీతో పొత్తు మాటే లేదు

బీఆర్ఎస్‌కు బీజేపీతో ఏరోజూ పొత్తు లేదని, భవిష్యత్తులోనూ ఉండబోదని కేటీఆర్ చెప్పారు. ఐదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. సికింద్రాబాద్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడితే.. కిషన్‌రెడ్డి సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో లిఫ్టను జాతికి అంకితం చేశారని, ఇదే ఆయన చేసిన అతిపెద్ద పని అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో 36 ఫ్లైఓవర్లు కడితే.. కేంద్ర ప్రభుత్వం ఏళ్లు గడుస్తున్నా ఉప్పల్, అంబర్‌పేట ఫ్లైఓవర్లు కట్టలేక చేతులెత్తేసిందని విమర్శించారు.

ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమే..

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని.. ఓడినా గెలిచినా బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజాపక్షమేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేవలం 50 రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్లు మొదలుకొని అనేకమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. రైతుబంధు అందడం లేదని, మహిళలకు హామీ ఇచ్చిన రూ.2,500 ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు హామీలు నెరవేర్చకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని.. కాంగ్రెస్‌వి ఆరు గ్యారంటీలు కావు, 420 గ్యారంటీలని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో గులాబీ జెండాకు ఎదురులేదని బలమైన సందేశం ఇచ్చిన పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, మాగంటి గోపీనాథ్, వెంకటేశ్, నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

లండన్ పర్యాటక కేంద్రాలను సందర్శించిన రేవంత్‌రెడ్డి

ఆదాయం, ఉపాధి కల్పన అవకాశాలపై అధ్యయనం

హైదరాబాద్: లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం పలు పర్యాటక కేంద్రాలను సందర్శించారు. లండన్‌లోని ప్రపంచ ప్రసిద్ధ, అత్యంత ప్రతిష్టాత్మక చారిత్రక కట్టడాలు, స్మారక కేంద్రాలను ఆయన సందర్శించారు. బిగ్ బెన్, లండన్ ఐ, టవర్ బ్రిడ్జ్ ఎట్ ఆల్ కట్టడాలను సీఎం రేవంత్‌రెడ్డి తిలకించారు. ఆ దేశ పురోగతి, సాంస్కృతిక, ఆర్థికాభివృద్ధిలో ఈ పర్యాటక కేంద్రాల పాత్రను సీఎం అడిగి తెలుసుకున్నారు. మన రాష్ట్రంలోని పలు పర్యాటక కేంద్రాల అభివృద్ధి, తద్వారా వచ్చే ఆదాయం, ఉపాధి అవకాశాల కల్పన ఎలా సాధించాలనే కోణంలో సీఎం అక్కడి విధానాలను అధ్యయనం చేశారు.

కమిటీ పేరిట దళితులకు బీజేపీ మోసం

వర్గీకరణపై ఉషామెహ్రా నివేదికను అమలు చేయాలి: సంపత్



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకుగాను కేంద్ర ప్రభుత్వం కమిటీ వేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుపట్టింది. పదేళ్లుగా అధికారంలో ఉండి ఈ సమస్యను నిర్లక్ష్యం చేసిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు దళితులను మోసం చేసేందుకు మరో మారు ప్రయత్నిస్తోందని, కపటప్రేమ చూపుతోందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణపై ఉషామెహ్రా కమిటీ నివేదిక సిద్ధంగా ఉందని, బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే దాన్ని అమలు చేయాలని అన్నారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు రానున్న నేపథ్యంలో దళితులను దగా చేసి, వారి ఓట్లను కొల్లగొట్టే ఈ ప్రయత్నాలను మానుకోవాలని సంపత్ హితవు పలికారు.

పెండింగ్ పనులకు నిధులిస్తాం

సీఐఆర్‌ఎఫ్ పనులకూ ఓకే

- ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి
- మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: అవసరమైన రోడ్లను మెరుగుపరచటంతోపాటు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ పనులకు నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సచివాలయంలో రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆ శాఖ బడ్జెట్ సన్నాహక సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పనులు, వాటికి సంబంధించి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, ప్రస్తుత అవసరాల గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో అధికారులు వారికి వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇష్టం వచ్చినట్టు కాకుండా, క్రమ పద్ధతిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు. ఆ ప్రాజెక్టు భూసేకరణతోపాటు కలెక్టరేట్ భవనాల నిర్మాణం, రోడ్లకు సంబంధించిన పనులకు నిధులు కేటాయించాలని అధికారులు కోరారు. సీఐఆర్ఎఫ్ పనులకు భూసేకరణ నిధుల కొరత లేకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేయగా, భట్టి విక్రమార్క అంగీకరించారు. చేప ప్రసాదం పంపిణీ, బోనాల ఉత్సవాలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కూడా కోరారు.

సినీ భూములను కాపాడాలని ఆదేశాలు


సినిమాటోగ్రఫీ అంశంపై జరిగిన చర్చలో, సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం కేటాయించిన భూములను కాపాడాలని ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశించారు. సామాజిక బాధ్యతలో భాగంగా డ్రగ్స్ లాంటి మహమ్మారిలకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమాల్లో సినీ సెలబ్రిటీలు పాల్గొనేలా చూడాలని సూచించారు. నంది అవార్డుల కార్యక్రమం నిర్వహణపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. చిన్న నిర్మాతల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సినిమా హాళ్లలో చిరుతిళ్ల ధరలను నియంత్రించాలని, ఆన్‌లైన్ టికెటింగ్ కోసం వేసిన కమిటీ నివేదిక వచ్చాక వెంటనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

చిత్రపురి కాలనీలో అవకతవకలపై దృష్టి పెట్టాలి: కోమటిరెడ్డి

చిత్రపురి కాలనీలో ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నందున ఆ విషయంలో కూడా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్థికశాఖ జాయింట్ సెక్రెటరి హరిత, ఉప ముఖ్యమంత్రి కార్యదర్శి కృష్ణ భాస్కర్, సమాచార శాఖ కమిషన్ అశోక్‌రెడ్డి, ఈఎన్సీలు రవీందర్ రావు, గణపతిరెడ్డితో పాటు సీఈలు మధుసూధన్ రెడ్డి, సతీష్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను ఏడాదిలోగా భర్తీ చేసి యువత భవితకు బంగారు బాటలేస్తామని రోడ్లు భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రిలోని రాయగిరి మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం, కాంప్లెక్స్ నిర్మాణ పురోగతిపై శనివారం తన కార్యాలయంలో కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన డిజైన్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ...అత్యాధునిక వసతులతో కూడిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి తగిన నిధులను సమీకరించేందుకు రెండు మూడు రోజుల్లో డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్‌తో మాట్లాడి స్టేడియం నిర్మాణానికి ఖేలో ఇండియా పథకంలో భాగంగా నిధులు తీసుకొచ్చేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ఉమ్మడి తొమ్మిది జిల్లా కేంద్రాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. యువత మానసిక శారీరక దారుఢ్యం కోసం స్పోర్ట్స్ స్టేడియాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని...అందులో భాగంగానే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఒప్పించి రాయగిరి మల్టీపర్పస్ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి 10 ఎకరాల భూకేటాయింపుపై తొలి సంతకం చేయించానని గుర్తు చేశారు. సమీక్షలో క్రీడలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, ఆర్ అండ్ బీ ఈఈ శంకరయ్య, స్పోర్ట్స్ అథారిటీ డీఈ అశోక్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గొంతుకోసిన కాంగ్రెస్

- ఆ ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి ఎలా అప్పగిస్తారు?
- రాష్ట్రంలో సాగునీళ్లు, తాగునీళ్లు ప్రశ్నార్థకం చేశారు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్, శ్రీశైలం నీటి ప్రాజెక్టులపై పూర్తి అధికారాన్ని కృష్ణా నదీ యాజమాన్య మండలి(కేఆర్ఎంబీ)కి అప్పగించి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ గొంతు కోసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించిన ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలకు ఈ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టులపై అధికారాన్ని కేఆర్ఎంబీకి అప్పగించడం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు అని వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటా తేలే దాకా ఏ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఒప్పుకోమని నాటి కేసీఆర్ ప్రభుత్వం తేల్చిచెప్పిందని మాజీ మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా అక్కడ మినిట్స్ రాసినట్లయితే వెంటనే ఆ విషయం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కేఆర్ఎంబీ అనుమతి లేకుండా ఆ డ్యాంల మీదికి అడుగు పెట్టే అవకాశం ఉండదన్నారు. తెలంగాణకు సాగునీళ్లు, తాగునీళ్లు ప్రశ్నార్థకం చేశారని ఆరోపించారు. రాష్ట్రం ఇక పూర్తిగా థర్మల్ విద్యుత్ కేంద్రంపైనే ఆధారపడేలా చేశారన్నారు.

అలా అన్న వాళ్లే బొందలో కలిసిపోయారు

తెలంగాణలో తన శిష్యుడు రాజ్యం ఏలుతున్నాడని చంద్రబాబు సంతోషపడుతున్నారని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు శిష్యుడు విదేశాల్లో తిరుగుతూ కేసీఆర్ పార్టీని బొందపెడతానని అంటున్నారని, అలా అన్నవాళ్లు అందరూ బొందలో కలిసిపోయారన్నారు. గోదావరి బేసిన్‌లో రైతులకు సాగునీళ్లు ఇవ్వకుండా కాళేశ్వరం మీద దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుల భారం రూ.58,860 కోట్లు

- పౌరసరఫరాల శాఖను ముంచేసిన బీఆర్ఎస్
- నష్టం రూ.11 వేల కోట్లు, ఏటా వడ్డీలకే రూ.3 వేల కోట్ల చెల్లింపులు
- మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం నిల్వలు ఏమయ్యాయో తెలియదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పేదలకు బియ్యం అందిస్తూ, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే పౌరసరఫరాల సంస్థను గత బీఆర్ఎస్ సర్కారు అప్పుల కుప్పలా మార్చి నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. త్వరలో ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ కసరత్తులో భాగంగా భట్టి విక్రమార్క శనివారం సచివాలయంలో పౌరసరఫరాల శాఖ తీరుపై మంత్రి ఉత్తమ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. అనంతరం భట్టి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో పౌరసరఫరాల సంస్థ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థకు కేవలం రూ.387 కోట్లు మాత్రమే బకాయిలు ఉండగా 2024 నాటికి రూ.14,354 కోట్లకు పెరిగిందన్నారు. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖకు సరైన సమయానికి డబ్బులు చెల్లించకపోవడం వల్ల అన్ని రుణాలు కలిపి రూ.58,860 కోట్ల మేర బకాయి పడిందన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అప్పులు లేవు

గతంలో రాష్ట్ర ప్రభుత్వమే పౌరసరఫరాల సంస్థకు ఆర్థిక సహాయం అందించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సహకరించేదని, 2016 - 17 నుంచి ఆర్థిక సాయం నిలిపివేసి, కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా ఆ సంస్థను అప్పుల పాలు చేసిందని భట్టి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2.82 కోట్ల మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసినప్పుడు కూడా పౌరసరఫరాల సంస్థకు ఇంత అప్పుల భారం లేదన్నారు. ఇంతటి భారం ఉన్నా రేషన్ బియ్యం, విద్యార్థులకు సన్నబియ్యం, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఆలస్యం కాకుండా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో రూ.3వేల కోట్ల అప్పు ఉంటే ఇప్పుడు రూ.58వేల కోట్లు అయిందన్నారు. పౌరసరఫరాల శాఖ నష్టం రూ. 11 వేల కోట్లుగా పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కిందనే ఏటా రూ.3 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందన్నారు. మిల్లర్ల వద్ద రూ.15 వేల కోట్ల విలువైన ధాన్యం ఉందని చెపుతున్నారని, అది ఎంత మేర ఉందో లెక్క తేలాల్సి ఉందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

'కాంగ్రెస్‌ది దశ, దిశ లేని పాలన'



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన విషయంలో దశ, దిశ లేదని.. ఆలోచన, కార్యాచరణ కొరవడిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి పదవుల మోజులో రాజకీయం చేద్దామనే ఆలోచనలో మాత్రమే అధికార పార్టీనేతలు ఉన్నట్లుగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలు, ప్రాజెక్టుల భవితవ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ చేయించి, దోషులెవ్వరో బయటపెట్టేందుకు కాంగ్రెస్‌కు ఉన్న ఇబ్బంది ఏమిటో చెప్పాలన్నారు. కాంట్రాక్టర్లను రక్షించడం కోసమా? లేక కేసీఆర్ కుటుంబాన్ని రక్షించడం కోసమా? అని ప్రశ్నించారు. అలాగే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెపుతున్నపుడు తప్పు చేసిన అధికారుల పేర్లు ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు. ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజడానికేనా అనే అనుమానం కలుగుతోందన్నారు.

ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయాలి

- కేసీఆర్ అండ్ కో పోటీ చేసినా బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదు
- ఆ పార్టీ గుర్తింపు కోల్పోవడం ఖాయం
- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబంలోని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్, ఎంపీ సంతోష్ పోటీ చేయాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు సవాల్ విసిరారు. వీరంతా పోటీచేసినా ఓటమి చెందుతారని, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తింపు కోల్పోవడం ఖాయమన్నారు. శనివారం రఘునందన్‌రావు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ఉందా.. అని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలకు పార్టీ సత్తా ఏంటో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చూపెడతామన్నారు. ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ సీట్లు బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

టికెట్లు అమ్ముకోవడం బీఆర్ఎస్‌కు అలవాటు

పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా రూ.వందల కోట్లు సమర్పించుకున్న వారికే టికెట్లు అమ్ముకోవడం బీఆర్ఎస్ అధినాయకులకు అలవాటని రఘునందన్ ఆరోపించారు. పార్టీనే నమ్ముకున్న ఎర్రోళ్ల శ్రీనివాస్ వంటి వాళ్లకు టికెట్లు ఇవ్వరని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్నప్పుడే తెలంగాణతో ఆ పార్టీ పేగు బంధం తెగిపోయిందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే హుస్సేన్ సాగర్‌లో వేసినట్టేనన్నారు.

ఆ విషయంపై హరీశ్ సమాధానం చెప్పాలి

కేఆర్ఎంబీకి రాష్ట్రంలోని ప్రాజెక్టులు అప్పజెప్పడం వల్ల నష్టం జరుగుతుందంటూ, భవిష్యత్తులో కృష్ణా జలాల్లో తెలంగాణకు నీటివాటా లభ్యం కాదంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడడం సరికాదని రఘునందన్ అన్నారు. 2014-2019 మధ్య నాటి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి సమక్షంలో... కృష్ణానదీ జలాల పంపకాల సమావేశంలో ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, కేసీఆర్ హాజరై 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు చాలని సంతకం పెట్టింది వాస్తవమా.. కాదా..? అని నిలదీశారు. ఈ విషయమై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌కు ఈ విషయాలు తెలియవా అని నిలదీశారు.

ఇదండీ సంగతి



హైకోర్టుకు వర్సిటీ భూములు ఇవ్వొద్దు

జీఓ నంబర్ 55ను వెంటనే రద్దు చేయాలి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఏజీవర్సిటీ: వ్యవసాయ, ఉద్యానవన యూనివర్సిటీలకు చెందిన 100ఎకరాల భూమిని కొత్త హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ జారీచేసిన జీఓ 55ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే, దీనికోసం విద్యార్థులతో కలిసి పోరాడతామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ఎదుట 12 రోజులుగా ధర్నా చేస్తున్న విద్యార్థులకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టే నూతన వంగడాలను సృష్టించిన శాస్త్రవేత్తలను అందించిన వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం చేపడితే జీవవైవిధ్యం దెబ్బతింటుందన్నారు. విమానాశ్రయానికి, ఐటీ కంపెనీలకు దగ్గరగా ఉన్న వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం చేపట్టడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. హైకోర్టు నిర్మాణానికి బీఎస్పీ వ్యతిరేకం కాదని, కానీ వర్సిటీల్లో భూముల్లో కాకుండా కేబీఆర్ పార్కు, ఇందిరాపార్కు, బయోడైవర్సిటీ పార్కుల్లో హైకోర్టు నిర్మాణం చేపట్టాలన్నారు.

క్లుప్తంగా...

రెండువేల బీఎస్సీ నర్సింగ్ సీట్లు భర్తీ చేయాలి

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్–తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: మేనేజ్‌మెంట్ కోటా కింద రెండు వేల బీఎస్సీ నర్సింగ్ సీట్లు భర్తీ చేయాలని, దీనిపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టి సారించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్–తెలంగాణ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కాశీ ప్రసాద రావు, కె.విజయరావు కోరారు. ఎంసెట్ /నీట్ పరీక్ష రాసినవారికి బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశ అర్హత కల్పిస్తూ ఒకే రకమైన నిబంధనలను కన్వీనర్/మేనేజ్‌మెంట్ కేటగిరీవారికీ వర్తింపజేయాలని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాలకు అనుగుణంగా ఈ నిబంధనలు వర్తింపజేయాలని మంత్రి రాజనర్సింహ, కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ యాజమాన్యాన్ని కోరారు.

తెలంగాణ కళాకారులకు కేటీఆర్ అభినందన



సాక్షి, హైదరాబాద్: టీషర్టులపై జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) చేర్యాల్ పెయింటింగ్‌ని వేసిన తెలంగాణ కళాకారులు రాకేశ్, వినయ్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఇలాంటి వినూత్నమైన పద్ధతులతో సాంప్రదాయ కళలకు మరింత డిమాండ్ వస్తుందని ఆయన అన్నారు. వీటికి మరింత ఆన్‌లైన్ మార్కెటింగ్, బ్రాండింగ్ అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. చేర్యాల పెయింటింగ్ వంటి ఉత్పత్తులకు ప్రచారం చేయడం ద్వారా కళాకారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. రాకేశ్, వినయ్ రూపొందించిన టీషర్టులను ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు.

సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్‌దే: మాగంటి



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని బీఆర్‌ఎస్ పార్టీ భారీ ఆధిక్యంతో గెలుచుకోవడం ఖాయమని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. అసెంబ్లీ ఓట్ల ఆధారంగా చూస్తే ఇదే స్పష్టమవుతోందన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజక వర్గాల సన్నాహక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాజధాని ఓటర్లు అభివృద్ధికి పట్టం కట్టారు. ఇదే ఓటింగ్ సరళి పార్లమెంటు ఎన్నికల్లో కూడా కొనసాగుతుంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజల నుంచి ఒత్తిడి తీవ్రమవుతోంది. ఓ పార్టీని బొంద పెట్టడం ఎవరి తరం కాదు. ఇలాంటి వ్యాఖ్యలు సీఎం పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం సరికాదు' అని అన్నారు. కాగా, సికింద్రాబాద్ లోక్‌సభ సీటును ఈసారి కచ్చితంగా బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు.

మద్యం కుంభకోణంలో ఎవర్నీ వదలం

- కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ సింగ్



సాక్షి, యాదాద్రి: ఢిల్లీ లిక్కర్ స్కాంలో భాగస్వాములైన వారెవరినీ వదిలే ప్రసక్తిలేదని కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ సింగ్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ ప్రాంగణంలో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు రూ.100 కోట్లు ఇచ్చారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ తమ పనులు తాము చేసుకుంటున్నాయన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రధాని మోదీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని, ఇప్పటివరకు దేశంలో 3 కోట్ల ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చారని తెలిపారు. ప్రతి ఇంటికీ విద్యుత్, నల్లా నీరు ఇచ్చామని చెప్పారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి పైకి తీసుకువచ్చామని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి రూ.ఐదు లక్షల ఆరోగ్యబీమా కల్పించామని తెలిపారు.

బీసీ డిమాండ్ల సాధనకు ఢిల్లీలో ఆందోళన

- జాజుల శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: జనగణన ప్రక్రియలో భాగంగా బీసీల సమగ్ర కులగణన నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా బీజేపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మోదీ ప్రభుత్వంపై ఛలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా సమరభేరి మోగించడానికి నేతలు, యువత పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ శ్రేణులంతా ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని జాజుల కోరారు.

జెడ్డా పారిశ్రామికవేత్తలతో నేడు శ్రీధర్‌బాబు భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి పెట్టుబడులు సాధించే లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున దాదాపు రూ. 40 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు సౌదీలో సమావేశాల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన నున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. 10 గంటలకు జెడ్డా చాంబర్స్‌తో భేటీ జరుగుతుంది. అనంతరం ఆహార ఉత్పత్తుల దిగ్గజ సంస్థ అయిన సవోలా గ్రూప్ సీఈవో వలీద్ ఫతానాతో చర్చలు జరప నున్నారు. మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి ఒంటిగంట వరకు సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ సీఈవో, బోర్డ్ సభ్యులతో భేటీ అవుతారు. ఆ తర్వాత పట్రోమిన్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి అక్కడ ఆ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు బట్టర్జీ హోల్డింగ్ కంపెనీ చైర్మన్ మాజెన్ బట్టర్జీతో సమావేశమవుతారు. అరాంకో సంస్థ ప్రతినిధులతోను సమావేశమయ్యే అవకాశం ఉంది. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు షెరటన్ హోటల్లో జరిగే ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ రోడ్ షోలో మంత్రి పాల్గొంటారు. ఆయన వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరానికి (2023–24) రెండోవిడత కౌన్సెలింగ్‌లో భాగంగా బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో పాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి వివరించారు. టీఎస్ లేదా ఏపీ ఐసెట్–2023, ఓయూ ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని అభ్యర్థులు వందమంది దరఖాస్తు చేసుకుంటే మరోమారు ప్రవేశపరీక్ష నిర్వహించి అర్హత సాధించినవారికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

'బడ్జెట్'లోపే కేబినెట్ విస్తరణ!

▶ మొదటి పేజీ తరువాయి

ఒకట్రెండు బెర్తులు ఖాళీగా ఉంచుతారా? అన్నదానిపై స్పష్టత లేదు. వచ్చే 15 రోజుల్లోనే కేబినెట్ విస్తరణ జరిగినా ఆశ్చర్యం లేదని టీపీసీసీ నేతలు చెప్తున్నారు.

ఏ కోటాలో ఎవరికి?

రాష్ట్ర కేబినెట్‌లో సీఎం సహా మొత్తం 18 మంది అవకాశం ఉంది. ఇప్పటికే 12 మందితో రేవంత్ ప్రభుత్వం కొలువుదీరింది. ఇందులో ఎస్టీలకు ఒకటి, బీసీలు, ఎస్సీలకు రెండు చొప్పున ఇవ్వగా, ఏడు పదవులను అగ్రవర్ణాలకు కేటాయించారు. ఇందులో రెడ్డి సామాజికవర్గానికి నాలుగు.. వెలమ, కమ్మ, బ్రాహ్మణ వర్గాలకు ఒక్కోటి ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజా విస్తరణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒక్కో మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి, ఎస్టీ కోటాలో దేవరకొండ నుంచి బాలూనాయక్‌లకు.. బీసీ కోటాలో మక్తల్ నుంచి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కుగానీ, ఎంబీసీ కోటాలో ఈర్లపల్లి శంకర్ (షాద్‌నగర్)కుగానీ అవకాశం రావొచ్చని అంటున్నారు. అగ్రవర్ణాలకు సంబంధించి.. రెడ్డి సామాజికవర్గం నుంచి పి.సుదర్శన్‌రెడ్డి (బోధన్), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (మునుగోడు), మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం)ల పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో మల్‌రెడ్డికి అసెంబ్లీలో చీఫ్‌విప్ హోదా ఇవ్వొచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. ఇక వెలమ సామాజికవర్గ కోటాలో కె.ప్రేమ్‌సాగర్‌రావు (మంచిర్యాల), మదన్‌మోహన్‌రావు (ఎల్లారెడ్డి) పేర్లు వినిపిస్తున్నాయి.

మరికొందరు నేతలూ రేసులో..

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక కాబోతున్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పేరు కూడా మంత్రి పదవి రేసులో వినిపిస్తోంది. ఆయనకు శాసన మండలిలో విప్ హోదా ఇస్తారని కూడా అంటున్నారు. అయితే వెంకట్‌కు మంచి హోదా కల్పించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని.. ఈ నేపథ్యంలో ఆయనకు కేబినెట్ అవకాశం దక్కవచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. మొత్తమ్మీద 15 రోజుల్లోనే, లేదా బడ్జెట్ సమావేశాల్లోపు కేబినెట్ విస్తరణ ఉంటుందని అంటున్నాయి. మంత్రి పదవుల కోసం సామాజిక వర్గాల వారీగా మరి కొందరు నేతలు, మహిళా ఎమ్మెల్యేలు కూడా పోటీలో ఉన్నారని పేర్కొంటున్నాయి.

మైనార్టీ కోటాలో ఎవరికి?

కేబినెట్‌లో మైనార్టీ కోటా కింద ఎవరిని, ఎలా ఎంపిక చేస్తారన్న దానిపై స్పష్టత రావడం లేదు. ఈసారి విస్తరణలో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులు భర్తీ చేస్తారా, నాలుగైదు మాత్రమే నింపుతారా అన్నది మైనార్టీ కోటాను బట్టే ఉంటుందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ తరఫున మైనార్టీ నేతలెవరూ ఎమ్మెల్యేలుగా ఎన్నికకాకపోవడంతో.. వారికి ఎమ్మెల్సీలుగా అవకాశమిస్తేనే మంత్రి పదవి లభించనుంది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా బీసీ, ఓసీ వర్గాలకు చెందిన ఇద్దరిని కాంగ్రెస్ ఎంపిక చేసింది. నల్లగొండ గ్రాడ్యుయేట్స్, పాలమూరు స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ మైనార్టీలు పోటీచేసే అవకాశం లేదన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో గవర్నర్ కోటాలో మైనార్టీ నేతను శాసనమండలికి పంపి మంత్రి పదవి కేటాయించాల్సి ఉంటుంది. ఈ విషయంలో అటు అధిష్టానం, ఇటు సీఎం రేవంత్‌ల మదిలో ఏముందనే దానిపై స్పష్టత లేదు. మైనార్టీ కోటాలో మంత్రిపదవి రేసులో.. మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌ల పేర్లు ఉన్నాయి. ఆమేర్ అలీఖాన్, జాఫర్ జావేద్‌ల పేర్లు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల జాబితాలో ఉండటం గమనార్హం.

త్వరలోనే నామినేటెడ్ పదవులు కూడా..

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపకాలను చేపట్టేందుకూ కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. విదేశ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 22న ఉదయం రాష్ట్రానికి తిరిగి రానున్నారు. తర్వాత రెండు, మూడు రోజుల్లో నామినేటెడ్ పోస్టుల ప్రకటన ఉంటుందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఆర్టీసీ, టీఎస్ఐఐసీ, రైతు సమన్వయసమితి, మహిళా కమిషన్‌తోపాటు పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించే అవకాశం ఉందని వివరిస్తున్నాయి.

ట్యాంక్‌బండ్‌పై 'రావి' విగ్రహం ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వానికి రావి నారాయణరెడ్డి సేవా సంస్థ వినతి
- బొల్లేపల్లి నుంచి భువనగిరి కలెక్టరేట్ వరకు పాదయాత్ర



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న రావి ప్రతిభారెడ్డి

భువనగిరి రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహాలను ఆయన స్వగ్రామమైన బొల్లేపల్లితో పాటు భువన గిరి, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంస్థ ఆధ్వర్యంలో శనివారం బొల్లేపల్లి నుంచి భువనగిరి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చెరుపల్లి శ్రీనివాస్, రావి సుఖేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటులో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన జీవిత విషయాలను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. రావి నారాయణరెడ్డి నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ధీరుడని, 500 ఎకరాల తన భూమిని నిరుపేదలకు పంచిపెట్టిన నిస్వార్థజీవి అని కొనియాడారు. పాదయాత్రలో రావి నారాయణరెడ్డి మనవరాలు ప్రతిభారెడ్డి, సేవా సంస్థకు చెందిన ప్రేమ్‌దాస్ వెంకటేశ్వర్లు, గడ్డం విజయభార్గవ్, చెరుకుపల్లి మహేశ్, సర్పంచ్‌లు కడమంచి ప్రభాకర్, మద్ది బుచ్చిరెడ్డి, చుక్క స్వామి, నాగెల్లి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కోరుకునే విధంగా 'మాస్టర్‌ప్లాన్'లు!

ఉమ్మడి వరంగల్ స్థాయి సమీక్ష... హాజరైన పొన్నం, సీతక్క, సురేఖ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

సాక్షి ప్రతినిధి, వరంగల్: గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ సహా తెలంగాణలోని అన్ని నగరాలు, పట్టణాలకు త్వరలోనే కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మాస్టర్‌ప్లాన్ అమలు చేసే ప్రయత్నం చేస్తే చాలాచోట్ల ప్రజలు అడ్డుకున్నారని, ఈ ప్రభుత్వం ప్రజల మనోభావాలు, అభిప్రాయాలకు అనుగుణంగానే మాస్టర్‌ప్లాన్లు సిద్ధం చేస్తుందన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరు జిల్లాలు, 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలు, హామీలతో ప్రజలను మభ్యపెట్టి అవినీతికి పాల్పడిందని, ఆ అవినీతిని బయటకు తీస్తామన్నారు. ఇరిగేషన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, భూ కబ్జాలపై చర్చించినట్లు చెప్పారు. మేడారం మహాజాతరను నిర్వహిస్తామని, ఇందుకోసం ఈసారి రూ.105 కోట్లు కేటాయించినట్లు పొంగులేటి చెప్పారు.

అలా అయితే రైతులు కొడ్తరు: సమీక్షలో ఎమ్మెల్యేలు

ఉమ్మడి వరంగల్ అభివృద్ధిపై సుదీర్ఘంగా సాగిన సమీక్షలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు నీటి విడుదలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. నీటిపారుదల శాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వకపోతే ఊళ్లకు వెళితే రైతులు కొట్టే పరిస్థితి ఉందని నర్సంపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణలు ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనే అధికార సమావేశంలో కాంగ్రెస్ నేతలు కొమ్మూరి ప్రతాపరెడ్డి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రతాపరెడ్డి పాల్గొనడంపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొమ్మూరి సమీక్ష నుంచి వెళ్లిపోయారు. ఈ సమీక్షలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ధనసరి సీతక్క, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌జే మ్యాక్ హౌసింగ్ సొసైటీకి అడ్‌హక్ బోర్డు

ఫిబ్రవరి 4న ఎన్నిక • నోటీసు జారీ చేసిన సహకార శాఖ

హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు నిర్వహించేందుకోసం అడ్‌హక్ బోర్డును ఏర్పాటు చేయాలని సహకార శాఖ నిర్ణయించింది. ఈమేరకు జిల్లా సహకార అధికారి (రిజిస్ట్రార్) డి.రమాదేవి శనివారం నోటీసు జారీ చేశారు. రమాదేవితో పాటు డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి.. నిజాంపేట్‌లోని జేఎన్‌జే కార్యాలయానికి వెళ్లి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆ వెంటనే నోటీసు జారీ చేశారు. 2024 ఫిబ్రవరి 4న జేఎన్‌జే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు రమాదేవి నోటీసులో పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు నిజాంపేట్‌లోని జేఎన్‌జే సొసైటీ స్థలంలోనే ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో అడ్‌హక్ బోర్డు ఎన్నిక ఉంటుందని వివరించారు. ఈ బోర్డు జేఎన్‌జే మ్యాక్ హౌసింగ్ సొసైటీకి సంబంధించి 5 డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తుంది. నెలరోజుల్లోగా ఎన్నిక ప్రక్రియను ఈ బోర్డు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంపై సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్‌జే వ్యవస్థాపక సభ్యుడు పి.వి.రమణారావు దీనిపై సంతోషం వ్యక్తం చేశారు.

వ్యవసాయ శాఖలో త్వరలో బదిలీలు!

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు, అధికారుల బదిలీలు చేపట్టాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే బదిలీల ప్రక్రియ చేపడతామని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఐదేళ్ల క్రితం వ్యవసాయశాఖలో అరకొర బదిలీలు జరిగాయి. అప్పటినుంచి ఇప్పటి వరకు పూర్తిస్థాయి బదిలీలపై అధికారులు ఎవరూ దృష్టిసారించలేదు. దీంతో అనేక మంది ఉద్యోగులు ఒకే చోట తిష్ట వేయగా, కొందరు కుటుంబాలకు దూరంగా ఉంటూ అన్యాయానికి గురవుతున్నారు. దీనిపై ఉద్యోగ సంఘాల నేతలు వ్యవసాయ ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటూ వస్తున్నారు. ఉద్యోగుల్లో దాదాపు 2 వేల మందికి పైగా బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ శాఖలో చాలామంది డిప్యుటేషన్లు, ఓడీలు, ఫారిన్ సర్వీసులపై ఉంటున్నారు. బదిలీలు జరగకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇప్పటికీ డిప్యుటేషన్ల కోసం వందల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఆ అధికారి వెల్లడించారు. మరోవైపు వ్యవసాయశాఖలో దాదాపు 500 మందికి పైగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఒకేసారి అన్ని శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ చేపట్టినా వ్యవసాయశాఖలో మాత్రం జరగలేదు. ఆయా విషయాలపై ఇటీవల అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రాములు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. త్వరలో అగ్రి అసోసియేషన్లతో డైరెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మూడు బ్యారేజీలూ ప్రమాదంలోనే..

- కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి రాష్ట్ర ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించలేదు
- బీఆర్‌ఎస్ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు
- మేడిగడ్డ డిజైన్‌లోనే లోపం ఉందని ప్రాథమిక సమాచారం
- త్వరలోనే డ్యామేజీ ఫొటోలు విడుదల చేస్తాం..అసెంబ్లీలో చర్చిస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: స్వతంత్ర భారత చరిత్రలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అంత నిర్లక్ష్యంగా నిర్మించిన ప్రాజెక్టు మరొకటి లేదని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లోనే లోపం ఉందని ప్రాథమికంగా సమాచారం ఉందన్నారు. అలాగే, దాని నిర్మాణం, నిర్వహణ కూడా పూర్తి నిర్లక్ష్య పూరితంగా జరిగాయని చెప్పారు. శనివారం ఆయన సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. రూ. 94వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టు 40వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇస్తుందని కాగ్ రిపోర్టు చెబుతోందని, అది కూడా కూలిపోయే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు వ్యాప్కో సంస్థ డిజైన్ చేసిందని, అందులో రూ.38వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు డిజైన్ చేసిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలూ ప్రమాదంలోనే ఉన్నాయన్నారు. కాళేశ్వరం అంటే ఈ మూడు బ్యారేజీలు మాత్రమేనని, వీటినే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిందని, పైనున్న ఎల్లంపల్లి, మిడ్ మానేరు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినవేనని వివరించారు. అన్నారం బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిందని, డ్యామేజీతోపాటు నిర్లక్ష్యం కూడా చోటుచేసుకుందని, వీటికి సంబంధించిన ఫొటోలు త్వరలోనే విడుదల చేస్తామని ఉత్తమ్‌కుమార్ చెప్పారు.

కృష్ణా బోర్డుకు అప్పగించలేదు

కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు ఇస్తామని ఎలాంటి హామీ ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలోనే కృష్ణానీటి దుర్వినియోగం జరిగిందని, వాళ్ల తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారం ప్రారంభించారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేఆర్‌ఎంబీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో ఒప్పందం చేసుకుందని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గత డిసెంబర్ 7న తాము అధికారంలోకి వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టుల స్థితి ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉందని చెప్పారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి కృష్ణా నీటి వాటా ఎందుకు తగ్గిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వారు చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడికి దిగుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో ముఖ్యమంత్రి రేవంత్, తాను సమావేశమైనప్పుడు కేఆర్‌ఎంబీపై యథాతథస్థితి కొనసాగించాలని చెప్పినట్లు తెలిపారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి ప్రజల ముందు పెట్టనున్నట్లు చెప్పారు. కాళేశ్వరంపై పలు విచారణలు సాగుతున్నాయని, పూర్తి వివరాలతో నిపుణులే మాట్లాడతారన్నారు. విధ్వంసక మైండ్ సెట్ ఉన్నోళ్లే కరెంట్ బిల్లు కట్టొద్దని అంటున్నారని, విద్యుత్ శాఖలో రూ.వేలకోట్ల అప్పులు చేసి బిల్లులు కట్టొద్దని మాట్లాడటం శోచనీయమని అన్నారు.

మీ కౌంటర్‌లో పస లేదు!

- మేడిగడ్డపై నీటిపారుదల శాఖకు ఎన్డీఎస్‌ఏ లేఖ
- ఎన్డీఎస్‌ఏ నివేదికను తప్పుబడుతూ బదులిచ్చిన నీటిపారుదల శాఖ
- అందులో ఎలాంటి సరుకు లేదని ఎన్డీఎస్‌ఏ స్పష్టీకరణ
- పనుల్లో నాణ్యత పర్యవేక్షణ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణ
- బ్యారేజీ వద్ద నీళ్లు తోడేస్తే మళ్లీ నిపుణుల బృందాన్ని పంపిస్తామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై క్షేత్ర స్థాయిలో పర్యటించి తాము సమర్పించిన నివేదికలోని అంశాలను ఖండిస్తూ గత డిసెంబర్ 7న నీటిపారుదల శాఖ పంపించిన నివేదికలో ఎలాంటి పస లేదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) తేల్చి చెప్పింది. బ్యారేజీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అదనపు సమాచారం సైతం అసంపూర్తిగానే ఉందని స్పష్టం చేసింది. సాధ్యమైనంత త్వరగా మిగిలిన సమాచారాన్ని పంపించాలని కోరింది. ఈ మేరకు ఎన్డీఎస్‌ఏ డైరెక్టర్ రాహుల్ కుమార్ ఈ నెల 12న రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్డీఎస్‌ఓ)కు లేఖ రాశారు.

'నాణ్యత'పై గోప్యత ఎందుకు ..?

బ్యారేజీ నిర్మాణ సమయంలో నాణ్యతా పర్యవేక్షణకు తీసుకున్న చర్యలు, ప్రత్యేకించి థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నాణ్యతాపర్యవేక్షణకు సంబంధించిన సమాచారాన్ని సైతం అందించలేదని ఎన్డీఎస్‌ఏ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎంతో కీలకమైన ఈ సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించిన తర్వాతే బ్యారేజీ పియర్లు కుంగడానికి కారణాలు తెలుస్తాయని పేర్కొంది. బ్యారేజీ పునరుద్ధరణకు తదుపరిగా తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించడానికి నిర్ణయించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

పొంతన లేని విభాగాల డ్రాయింగ్స్

భూగర్భంలో రాతిపొరల నిర్మాణ క్రమాన్ని తెలియజేసే 'జియోలాజికల్ సెక్షన్'డేటాను, ప్రత్యేకించి బ్యారేజీకి సంబంధించి ఒక్కో విభాగానికి సంబంధించిన 'సెక్షనల్ డ్రాయింగ్'ను వేర్వేరుగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏకు సమర్పించింది. వీటిపై అధ్యయనం తర్వాత బ్యారేజీ పునాదుల కింద నుంచి ప్రవహించాల్సిన నీళ్లకు భూగర్భంలో నిర్మించిన కటాఫ్ గోడలు అడ్డుగా ఉన్నట్టు భావన కలుగుతోందని ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసింది. మరోవైపు ప్రాజెక్టు అధికారులు సమర్పించిన 'డిజైన్ కాలిక్యులేషన్స్'మాత్రం బ్యారేజీ కింద భూగర్భంలో ప్రవాహానికి కటాఫ్ గోడలు అడ్డంకిగా లేవని స్పష్టం చేస్తున్నాయని ఎన్డీఎస్‌ఏ పేర్కొంది. ప్రాజెక్టు అధికారులు సమర్పించిన వేర్వేరు రకాల సమాచారాన్ని విశ్లేషించి, పరస్పర విరుద్ధమైన అభిప్రాయానికి ఎన్డీఎస్‌ఏ వచ్చింది. ప్రాజెక్టు డిజైన్‌కు సంబంధించి కీలకమైన ఈ అంశంపై మరింతగా పరిశీలన కోసం ..ప్రత్యేకించి బ్యారేజీ విభాగాల డ్రాయింగ్స్(సెక్షనల్ డ్రాయింగ్స్)ను జియోలాజికల్ వివరాలతో సహా అందజేయాలని విజ్ఞప్తి చేసినా ఇంత వరకు అందజేయలేదని ఎన్డీఎస్‌ఏ పేర్కొంది.

మళ్లీ ఎన్డీఎస్‌ఏ బృందాన్ని పంపిస్తాం...

ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని దారిమళ్లించి, బ్యారేజీ కుంగిన ప్రాంతం వద్ద ఉండే నీటి నిల్వలను తోడేసిన తర్వాత తమకు తెలియజేయాలని ఎన్డీఎస్‌ఏ సూచించింది. అలా తెలిపిన వెంటనే కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), ఎన్డీఎస్‌ఏ నిపుణుల బృందం వచ్చి వాస్తవాలను తెలుసుకోవడానికి తొలి పరిశీలన చేస్తుందంటూ నివేదికలో పేర్కొన్న అంశాన్ని ఎన్డీఎస్‌ఏ మళ్లీ గుర్తు చేసింది. బ్యారేజీ కుంగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దర్యాప్తు అంశాలను సైతం తమకు తెలియజేయాలని కోరినట్టు పేర్కొంది. ఈ రెండు విషయాల్లో ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారాన్ని అందించలేదని తెలిపింది.



మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని
మన మెరిగిన యెడల మన మాయనను వేడుకొనినవి
మనకు కలిగిన వని యెరుగుదుము.
– క్రైస్తవ ధర్మం

దగుల్బాజీ పాత్రికేయం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



కాటికి కాళ్లు చాపిన వయసులో ఉన్నవారిని విమర్శించడానికి మనసొప్పదు. వారు తప్పు చేసినా సరే. కానీ ఇదేంది జీ? మిమ్మల్ని నోటికొచ్చినట్టు తిట్టాలనిపిస్తున్నది? మీరు సింపతీ కోసం లీక్ చేసిన పడక సీన్ ఫోటోలను చూసి ఉన్నప్పటికీ... మిమ్మల్ని తిట్టకుండా ఉండటం సాధ్యం కావడం లేదు. ఇది ఒక్కడి తహతహ కాదు. లక్షలాదిమంది మానసిక స్థితి. ఉన్మత్త ప్రేలాపనలతో మీరు అచ్చొత్తి ఫ్రీగా పంచుతున్న మీ అశుద్ధ పత్రికను చదివిన పాఠకులు అస్వస్థతకు గురవుతున్నారు. మీ కడుపు నొప్పితో, మీ కక్కుడు పారుడు రోగంతో జనసమూహంలో జుగుప్సాకర వాతావరణాన్ని తయారు చేస్తున్నారు జీ. మంచిది కాదు జీ. మీరు ఏ ప్రయోజనాన్ని ఆశించి ఈ కుతంత్రాన్ని పన్నుతున్నారో ఆ ప్రయోజనం నెరవేరేది కాదని మీకు తెలియదా? అయినా... ఏమో గుర్రం ఎగరకపోతుందా అనే దింపుడు కళ్లెం ఆశతో ఇంత దిగజారుడుతనం వాంఛనీయం కాదు జీ!

మీ పేరు చివర జీ అక్షరం వింతగా ఉన్నది జీ. అది పెట్టుడు పేరో, దత్త పేరో తెలియదు గానీ అందులో తెలుగుదనం, తెలుగు సంప్రదాయం లేదు జీ. 'తెలుగు భాష కోసం పుట్టిన ఏకవీర నేనే'నని తమరు వీరతాళ్లు వేయించుకుంటారు కదా! ఈ మరాఠీ సంప్రదాయ పేరు అందుకు నప్పలేదు జీ. ఇంగ్లిషు పదాలకు మీ విషపత్రికలో చేసే తెలుగు అనువాదాల్లాగే ఉన్నది. 'పిల్లి కాదు మార్జాలం' అన్నట్టుగా 'కుప్పుస్వామి అయ్యర్ మేడ్ డిఫికల్ట్' అన్నట్టుగా మీ పత్రిక అనువాదాలుంటాయి. ఇదీ అలాగే ఉన్నది. దగుల్బాజీ అనే మాట పారశీక సంప్రదాయం నుంచి వచ్చిందేమో కానీ శతాబ్దాల కిందనే తెలుగులో కలిసిపోయింది. కనుక చివర్లో జీ ఉన్నప్పటికీ అది తెలుగు మాటగానే రూపాంతరం చెందింది. ఆ మాటను జనసామాన్యం యథేచ్ఛగా వాడేస్తున్నప్పటికీ దాని అసలు అర్థం మోసగాడు అనే! ఈ పేరేదో బాగా అతికినట్టున్నది. చూస్తారా?

మీరు మోసగాళ్లే కదా జీ. అలా అని పలు సందర్భాల్లో కోర్టులు కూడా అభిప్రాయపడ్డాయిగదా జీ! ఎన్టీ రామారావు కూడా అదే అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించినట్టున్నారు కదా! జీజే రెడ్డి సహకారంతో మీరు వ్యాపారంలో వేసిన తొలి అడుగుల్లో మోసం లేదా? యాభయ్యేళ్ల కింద మీరు విశాఖపట్నంలో 'ఈనాడు' ప్రారంభించినప్పుడు మిమ్మల్ని నమ్మి భూమి లీజుకిచ్చిన ఆదిత్య వర్మకు మీరు చేసిందేమిటి? మోసమే కదా! అది రుజువైంది కదా! దాన్ని దగుల్బాజీ వ్యవహారం అంటారా అనరా? పైగా వర్మ భూమిని కొంతభాగం రోడ్డు విస్తరణకు అప్పగించి బదులుగా ప్రభుత్వం ఇచ్చిన భూమిని తమరు కైంకర్యం చేయలేదా జీ! దీన్నేమంటారు? ఈ వ్యవహారంలో మీ మీద ఫోర్జరీ కేసు పెట్టాలని న్యాయస్థానం ఆదేశించలేదా? ఫోర్జరీ కూడా మోసమే కదా!

సీలింగ్ చట్టాన్ని ఉల్లంఘించి ఫిలిం సిటీలో వేలాది ఎకరాల భూమిని మీరు పోగేశారని రెవెన్యూ అధికారులు నిర్ధారించలేదా? అది మోసం కాదా? ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిని కూడా భోంచేశారు కదా! చిట్‌ఫండ్ పేరుతో ఫిలింసిటీలో ఉన్న 137 ఎకరాల భూమి చట్టప్రకారం చందాదారులకు దక్కాలి కదా? మీరెందుకు చంకలో పెట్టుకున్నారు? మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యవహారంలో మీరు వసూలు చేసిన 2600 కోట్ల డిపాజిట్లు మోసపూరితమైనవిగా రిజర్వ్ బ్యాంక్, సుప్రీంకోర్టులు నిర్ధారించాయా, లేదా? చిట్‌ఫండ్స్ పేరుతో మీరు మోసగించారని చందాదారులు ఫిర్యాదులు చేశారా, లేదా? సీఐడీ కేసు నడుస్తున్నదా, లేదా? ఇంకా చెప్పాలా? అబ్బబ్బ... తనువంతా ఇన్ని మచ్చలేంది స్వామీ? పైగా వేరొకరిపై నిత్యం అభాండాలా? నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అనుకుంటున్నారా?

ఎన్టీ రామారావు ఏమన్నారు? మీ పత్రిక ఓ చెత్త కాగితాల కట్ట. మీరు గోబెల్స్‌ను మించిన దుష్ప్రచారకులు. తిమ్మిని

తప్పుడు ప్రచారాలతో జగన్ ప్రభుత్వం మీద ప్రజల్లో అపోహలు సృష్టించడానికి గురు పత్రిక నాయకత్వంలోని యెల్లో మీడియా చేయని ప్రయత్నం లేదు. అయినా ఫలితం కనిపించడం లేదు. నిరాశా నిస్పృహలతో ఆ మీడియా హద్దుల్ని దాటేస్తున్నది. మర్యాదలను అతిక్రమిస్తున్నది. సంప్రదాయాలను చాపచుట్టేసింది. కనీస ప్రమాణాలను కూడా అటకెక్కించింది. మానసిక వైకల్యానికి గురైన గ్రామ సింహాల్లా యెల్లో మీడియా నర్తిస్తున్నది. వారి ఖర్మ కొద్దీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఘట్టం ఇప్పుడే వచ్చింది. పీఠంతో కలిపి 206 అడుగుల ఎత్తున్న కాంస్య విగ్రహం. ప్రపంచంలో అంబేడ్కర్ విగ్రహాలన్నిటిలోకీ పెద్దది. విజయవాడ నడిబొడ్డున ఖరీదైన ప్రాంతమైన బందర్ రోడ్డుపై పద్దెనిమిదిన్నర ఎకరాల స్వరాజ్ మైదాన్ ఆయన స్మృతి వనానికి వేదికైంది. పెత్తందారీ వర్గానికి ఇది మరో కంటగింపు కారణం. ప్రాంతీయ పెత్తందారీ వర్గానికీ, ఆ వర్గం వైభవానికీ గుర్తు బందర్ రోడ్డు. ఈ రోడ్డులో ప్రభుత్వ కార్యాలయాలు పోనూ మిగిలిన ఖరీదైన భవనాల్లో ముప్పాతిక శాతానికి పైగా ఒకే వర్గ పెత్తందారీ కుటుంబాల వారివే. విజయవాడ నగరంలో ఏం జరగాలన్నా బందర్ రోడ్డు బాద్షాలు ఎస్ అంటే ఎస్! నో అంటే నో!! రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం బందర్ రోడ్డు మీదుగా ఒక మెట్రోలైన్‌ను కేంద్రం కేటాయించింది. మనవాళ్ల భవనాలు చాలా కూలగొట్టవలసి వస్తుంది కనుక నాటి చంద్రబాబు ప్రభుత్వం అడ్డుపుల్ల వేసింది.

బమ్మిని చేయడమే మీ నైజం. చివరికి మీరు చరిత్ర పెంట కుప్పలోనే మిగిలిపోతారు. అవే మాటలు కదా ఆయనో ఇంటర్వ్యూలో చెప్పింది. ఆ ఘడియలు తరుముకొచ్చినట్టున్నాయి కదూ! అనారోగ్యంతో మంచం మీద ఉంటే మా నాన్న కాగితాల మీద సంతకాలు తీసుకున్నారనీ, నానా మాటలు అన్నారనీ స్వయంగా మీ కుమారుడే చెప్పిన విషయం మర్చిపోయారా? మీ విశ్వసనీయతకు ఇంతకంటే గొప్ప సర్టిఫికెట్ ఇంకేముంటుంది? ఇంతటి ఘనత వహించిన తమరు చిత్తం వచ్చినట్టు కాకమ్మ కథలు చెబితే జనం నమ్ముతారా?

ఈ కాకమ్మ కథలనూ, కనికట్టు రాతలనూ ఎవరూ ఊహించలేని అధమాధమ స్థాయికి తీసుకెళ్లారేమిటి జీ? పత్రికా ప్రమాణాల పాతాళం డైవింగ్‌లో మీ రికార్డులను మీరే బద్దలు కొట్టారు. హుర్రే! ఈ ఫీట్ ఇంకెవడి వల్లా కాదు. ఈ వయసులో అదేదో బూస్టర్ గోళీ వేసుకున్నట్టు ఇంత ఉన్మత్త ఆవేశమేమిటో? కారణముందిలే! అసలే జగన్‌మోహన్‌రెడ్డి అంటే అస్సలు పడదు. ఆయన పేద వర్గాల రాజకీయ ప్రతినిధి. తమరు పెత్తందారీ వర్గాల కులగురువుగా నేమ్ ప్లేట్‌ను వాకిట్లో తగిలించుకున్నవారు. అయిదేళ్లుగా మీ వర్గం ఆటలు సాగడం లేదు. మీ కాకమ్మ కథలు పండటం లేదు. పేదలకు చదువు చెబుతున్న సర్కారు బళ్లు ఆధునికతను సంతరించుకున్నాయి. మీ పెత్తందారీ వర్గ పిల్లలతో సమానంగా పేద పిల్లలు ఇంగ్లిషు మీడియంలో చదువుకోగలుగుతున్నారు. నాణ్యమైన వైద్యం పేదల ఇంటి ముంగిట్లోకి వచ్చింది. కార్పొరేట్ వ్యాపారులకు సెగ తగిలింది. చిన్న రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం మొదలైంది, లాభాల బాట వైపు కూడా పయనం ప్రారంభమైందని దేశదేశాల నుంచి ప్రతినిధి బృందాలు వచ్చి చూస్తున్నాయి. ప్రభుత్వ చేయూతతో సామాన్య మహిళలు సైతం సంపద సృష్టిలో పాల్గొంటున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. రిటెయిల్ వ్యాపారం అనూహ్య లాభాలనార్జిస్తున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటు దేశంలోనే అగ్రస్థానంలో పెరుగుతున్నది. కరోనా కాటేసిన కాలం పోగా మిగిలిన స్వల్పకాలంలోనే ఈ అభివృద్ధి సాధ్యమైంది. పెత్తందార్లు పంచుకు తినవలసిన సొమ్ము ప్రజల చేతుల్లో వృద్ధి పొందుతున్నది. జగన్‌మోహన్‌రెడ్డి మీద పెత్తందారీ వర్గానికి కంటగింపు కలగడానికి ఈ కారణాలు చాలవా?

తప్పుడు ప్రచారాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మీద ప్రజల్లో అపోహలు సృష్టించడానికి గురు పత్రిక నాయకత్వంలోని యెల్లో మీడియా చేయని ప్రయత్నం లేదు. అయినా ఫలితం కనిపించడం లేదు. నిరాశా నిస్పృహలతో ఆ మీడియా హద్దుల్ని దాటేస్తున్నది. మర్యాదలను అతిక్రమిస్తున్నది. సంప్రదాయాలను చాపచుట్టేసింది. కనీస ప్రమాణాలను కూడా అటకెక్కించింది. గజ్జి సోకిన గ్రామ సింహాల్లా యెల్లో మీడియా వర్తిస్తున్నది. వారి ఖర్మ కొద్దీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఘట్టం ఇప్పుడే వచ్చింది. పీఠంతో కలిపి 206 అడుగుల ఎత్తున్న కాంస్య విగ్రహం. ప్రపంచంలో అంబేడ్కర్ విగ్రహాలన్నిటిలోకీ పెద్దది. విజయవాడ నడిబొడ్డున ఖరీదైన ప్రాంతమైన బందర్ రోడ్డుపై పద్దెనిమిదిన్నర ఎకరాల స్వరాజ్ మైదాన్ ఆయన స్మృతివనానికి వేదికైంది. పెత్తందారీ వర్గానికి ఇది మరో కంటగింపు కారణం. ప్రాంతీయ పెత్తందారీ వర్గానికీ, ఆ వర్గం వైభవానికీ గుర్తు బందర్ రోడ్డు. ఈ రోడ్డులో ప్రభుత్వ కార్యాలయాలు పోనూ మిగిలిన ఖరీదైన భవనాల్లో ముప్పాతిక శాతానికి పైగా ఒకే వర్గ పెత్తందారీ కుటుంబాల వారివే. విజయవాడ నగరంలో ఏం జరగాలన్నా బందర్ రోడ్డు బాద్షాలు ఎస్ అంటే ఎస్! నో అంటే నో!! రాష్ట్ర విభజన తర్వాత బందర్ రోడ్డు మీదుగా ఒక మెట్రోలైన్‌ను కేంద్రం కేటాయించింది. మనవాళ్ల భవనాలు చాలా కూల గొట్టవలసి వస్తుంది కనుక నాటి చంద్రబాబు ప్రభుత్వం అడ్డుపుల్ల వేసింది. చంద్రబాబు పార్టీకి అభివృద్ధి అంటే పెత్తందారీ వర్గం అభివృద్ధి మాత్రమే! వారికి నష్టం కలిగించే అభివృద్ధిని అస్సలు సహించరు.

మెట్రోలైన్‌నే కాదు రోడ్డు విస్తరణను సైతం ఈ వర్గాలు అడ్డుకున్నాయి. ఇదే రోడ్డు మీద లీజుకు తీసుకున్న స్థలంలో తిష్ఠ వేసిన 'ఈనాడు' జీ రోడ్డు విస్తరణకు ససేమిరా అన్నారు. మూడు దశాబ్దాలపాటు భూ యజమానిని ముప్పుతిప్పలు పెట్టి రెండు దశాబ్దాల పాటు రోడ్డు విస్తరణను అడ్డుకొని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇరవై రోజుల కింద తట్టాబుట్టా సర్దుకొని, అన్ని గేట్లూ మూసుకొని తరలిపోవలసి వచ్చింది. చెన్నయ్‌లోని 'ది హిందూ' కార్యాలయాన్ని 'మౌంట్ రోడ్ మహావిష్ణు' అనేవారట. అదేవిధంగా తన కార్యాలయాన్ని కూడా బందర్ రోడ్డు బాద్షాగానో, జాంగ్రీగానో పిలిపించుకోవాలని ఆయన ఆశించాడట! కానీ కథ అడ్డం తిరిగింది. వందేళ్ల కిందట ఒకసారి స్వరాజ్ మైదాన్‌లో భాగ్యరెడ్డి వర్మ ఆధ్వర్యంలో దళిత సంఘాల సభ జరిగిందట! అప్పుడు స్థానిక పెత్తందార్లు కొండ మీద ఉన్న అమ్మవారి ఆలయం తలుపులు మూయించారట. దళితులు ఆలయానికి రాకూడదన్న దుష్ట తలంపుతో! ఆ పెత్తందార్ల ఆటలు ఏదో రూపంలో సాగుతూ వచ్చాయి. ఇప్పటిదాకా ఒక లెక్క. ఇప్పుడొక లెక్క! ఇప్పుడు బెజవాడంటే కొండ మీద అమ్మవారు, కొండ కింద అంబేడ్కర్! జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత స్క్రీన్‌ప్లే మారింది. పెత్తందార్లు, వారి మీడియా కడుపు మంట ద్విగుణం, త్రిగుణం కావడానికి ఈ పరిణామాలన్నీ కారణం. ఆ కడుపు మంట ఫలితమే విగ్రహావిష్కరణ రోజున యెల్లో పత్రికల నిండా పరుచుకున్న అశుద్ధం.

ఆ పద్దెనిమిది ఎకరాల్లో ఓ పెద్ద మాల్ కట్టించి తన వాళ్లందరూ వ్యాపారాలు చేసుకునేలా చూడాలని అప్పట్లో చంద్రబాబు ప్లాన్ చేశాడట! మిగిలి ఉన్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఎక్కడికన్నా తరలిస్తే బందరు రోడ్డు మీద ఇక తమదే గుత్తాధిపత్యం. కలలు చెదిరిపోయి ఇప్పుడు అంబేడ్కర్ వచ్చి చేరాడు. అదే బందరు రోడ్డు మీద ముప్పయ్యేళ్ల క్రితం తమ పెత్తనాన్ని ధిక్కరించిన వంగవీటి రంగాను అడ్డు తొలగించుకోగలిగారు. ఇప్పుడెట్లా? మింగలేక కక్కలేక చస్తున్నారు. అంబేడ్కర్‌పై ప్రేమ లేకున్నా అది బయటకు ప్రకటించలేరు. దళితులపై భూస్వాముల దాడులు, దౌర్జన్యాలకు 'ఈనాడు'లో మొదటి నుంచి ప్రాధాన్యత లభించేది కాదు. కారంచేడులో దళితుల నెత్తురు ఏరై పారినప్పుడు కూడా ఆ పత్రికలో ఓ చిన్న క్రైమ్ వార్తగానే వచ్చింది. అటువంటి 'ఈనాడు' అంబేడ్కర్ ఆశయాల పట్ల గౌరవాన్ని నటిస్తూ ఒక దిక్కుమాలిన వార్తను అచ్చేసింది.

'అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత మీకెక్కడిది జగన్' అంటూ జీ పత్రిక ఒక ఫుల్‌పేజీని కేటాయించింది. అంబేడ్కర్‌కు ముడిపెడుతూ తలాతోకా లేని ఓ పది పాయింట్ల సొల్లు కార్చారు. ఈ చచ్చు పాయింట్లకు గ్రామసీమల్లోని ఏ సాధారణ పౌరుడైనా గట్టిగా సమాధానం చెప్పగలడు. అంత పారదర్శకంగా జగన్ ప్రభుత్వం తన విధానాలను అమలు చేస్తున్నది. మద్యనిషేధాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం మద్యాన్ని పారిస్తున్నదట! దశలవారీ మద్య నియంత్రణకు వైసీపీ హామీ ఇచ్చిన మాట నిజం. ఆ హామీకి కట్టుబడి 43 వేల బెల్ట్‌షాపులను తొలగించారు. మద్యం ప్రైవేటు వ్యాపారాన్ని రద్దు చేసి నియంత్రణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేతిలోకి తీసుకున్నది. 4,380 నుంచి 2,934 వరకు షాపుల సంఖ్యను తగ్గించారు. రాత్రి తొమ్మిది గంటల వరకే అమ్మకాలకు అనుమతినిచ్చారు. ఇదంతా కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవం.

సహజ వనరులను వీలైనంత ఎక్కువ ప్రయోజనం కలిగేలా వినియోగించుకోవాలని అంబేడ్కర్ చెప్పారు. జగన్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నదని 'ఈనాడు' భాష్యం. ఇసుక మీద ప్రభుత్వానికి ఎవరి హయాంలో ఆదాయం వచ్చింది? గ్రానైట్, సున్నపు రాయి, మాంగనీస్, రోడ్ మెటల్... ఇలా మైనింగ్ కార్యక్రమాలన్నింటిలో ఏ ప్రభుత్వం హయాంలో ఎక్కువ ఆదాయం వచ్చింది? ఈ లెక్క

ఇప్పటిదాకా ఒక లెక్క. ఇప్పుడొక లెక్క! ఇప్పుడు బెజవాడంటే కొండ మీద అమ్మవారు, కొండ కింద అంబేడ్కర్! జగన్ వచ్చిన తర్వాత స్క్రీన్‌ప్లే మారింది. పెత్తందార్లు, వారి మీడియా కడుపు మంట ద్విగుణం, త్రిగుణం కావడానికి ఈ పరిణామాలన్నీ కారణం. ఆ కడుపు మంట ఫలితమే విగ్రహావిష్కరణ రోజున యెల్లో పత్రికల నిండా పరుచుకున్న అశుద్ధం.

ఆ 18 ఎకరాల్లో ఓ పెద్ద మాల్ కట్టించి తన వాళ్లందరూ వ్యాపారాలు చేసుకునేలా చూడాలని అప్పట్లో చంద్రబాబు ప్లాన్ చేశాడట! మిగిలి ఉన్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఎక్కడికన్నా తరలిస్తే బందరు రోడ్డు మీద ఇక తమదే గుత్తాధిపత్యం. కలలు చెదిరిపోయి ఇప్పుడు అంబేడ్కర్ వచ్చి చేరాడు. అదే బందరు రోడ్డు మీద ముప్పయ్యేళ్ల క్రితం తమ పెత్తనాన్ని ధిక్కరించిన వంగవీటి రంగాను అడ్డు తొలగించుకోగలిగారు. ఇప్పుడెట్లా? మింగలేక కక్కలేక చస్తున్నారు. అంబేడ్కర్‌పై ప్రేమ లేకున్నా అది బయటకు ప్రకటించలేరు. దళితులపై భూస్వాముల దాడులు, దౌర్జన్యాలకు 'ఈనాడు'లో మొదటి నుంచి ప్రాధాన్యత లభించేది కాదు. కారంచేడులో దళితుల నెత్తురు ఏరై పారినప్పుడు కూడా ఆ పత్రికలో ఓ చిన్న క్రైమ్ వార్తగానే వచ్చింది. అటువంటి 'ఈనాడు' అంబేడ్కర్ ఆశయాల పట్ల గౌరవాన్ని నటిస్తూ ఒక దిక్కుమాలిన వార్తను అచ్చేసింది.

లేవీ చెప్పకుండా బట్టకాల్చి మీద వేసే బద్మాష్‌గిరీకి 'ఈనాడు' పాల్పడింది. ఆదాయాలకు మూలమైన పరిశ్రమలను ధ్వంసం చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు పెరగవని అంబేడ్కర్ చెప్పారు. కానీ జగన్ ప్రభుత్వానికి భారీ పరిశ్రమలను తీసుకు రావడం సాధ్యం కాలేదట. పైపెచ్చు కొన్ని పరిశ్రమలు పారిపోయాయట. రాష్ట్రంలో తమ కార్యక్రమాలను విస్తరించబోతున్నట్టు అమరరాజా గ్రూప్ అధికారికంగా ప్రకటిస్తే ఆ సంస్థ పారిపోయిందంటూ 'ఈనాడు' గీకి పారేసింది. జగన్ హయాంలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఒక్క పరిశ్రమల శాఖ ద్వారానే 99 ఒప్పందాలు జరిగితే ఇప్పటికే 78 యూనిట్లు పని ప్రారంభించాయి. ఇంకో 21 ఒప్పందాలకు సంబంధించి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం ఒప్పందాలు 386. వీటిద్వారా ఆరు లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తుందని అంచనా. చంద్రబాబు హయాంలో కూడా ఇటువంటి మీట్ జరిగింది. పార్టీ కార్యకర్తలకు కోట్లు వేసి నకిలీ ఒప్పందాలు చేసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. అప్పటికీ ఇప్పటికీ ఏమైనా పోలిక ఉన్నదా?

ఇంగ్లిష్ మీడియంలో చదువొద్దని అంబేడ్కర్ చెప్పారట. జగన్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదట! పేద వర్గాల ఇంగ్లిష్ చదువుల మీద పెత్తందార్లు ఎంత ద్వేషం పెంచుకున్నారో ఈ అభూత కల్పనను చూస్తేనే అర్థమవుతుంది. ఇంగ్లిష్ మీడియంపై ఏ అంబేడ్కరిస్టుతోనైనా ఓ గంటసేపు మాట్లాడి ఉంటే ఎంతోకొంత జ్ఞానోదయమై ఉండేది. ప్రతిపక్షాలు, పత్రికలు ప్రజాస్వామ్యానికి స్ఫూర్తి అని అంబేడ్కర్ చెబితే జగన్ ప్రభుత్వం వారిని రాచిరంపాన పెడుతున్నదట. అధికారంలో ఉన్న వారిని పచ్చి బూతులు తిట్టినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా, అసత్య ప్రచారాలకు తెగబడినా సరే కేసులు పెట్టొద్దని అంబేడ్కర్ ఎక్కడ చెప్పాడో మాత్రం ఆ పత్రిక చూపెట్టలేకపోయింది.

ఇటువంటి తలాతోకా లేని పాయింట్లతో కార్యక్రమాన్ని అభాసుపాలు చేయాలని ప్రయత్నించిన యెల్లో మీడియా గుండెలు గుభేల్ మనేలా, కళ్లలో గుంటూరు కారం మండేలా లక్షలాదిమంది పేద వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ జైత్రయాత్ర ఏప్రిల్‌లో ఎన్నికలు ముగిసేవరకే కాదు, ఆ తర్వాత కూడా కొనసాగనున్నది. 'తెలుగుదేశం' రాజకీయ కూటమి పెద్దలూ, యెల్లో మీడియా గద్దలూ అందరూ హైదరాబాద్‌లోనే ఉంటారు. ఎందుకైనా మంచిది. కౌంటింగ్ రోజున వారందరి ఇళ్ల ముందు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచడం తెలంగాణ ప్రభుత్వం బాధ్యత. కడుపు మంట అదుపు తప్పితే ఏమౌతుందో ఏమో!

vardhelli1959@gmail.com

సత్యం... శాశ్వతం... మూడక్షరాల లెనిన్!

సందర్భం



డి. పాపారావు

'వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యానోవ్... లెనిన్... పోరాటమే జీవితం అయినవాడు... తుది శ్వాస విడిచాడు'– ఈ మాటలు 1924 జనవరి 21వ తేదీన, నేటికి సరిగ్గా 100 ఏళ్ల క్రితం నాటి లెనిన్ మరణం గురించి ఆయన జీవిత చరిత్ర రచయిత రాబర్ట్ సర్వీస్ పుస్తకంలోనివి. అలాగే అదే రచయిత మరో సందర్భంలో పేర్కొన్నట్లుగా '20వ శతాబ్ద రాజకీయ నేతలలో, అధికార స్థానాన్ని ఈషణ్మాత్రం కూడా తన సొంతం కోసం వాడుకోనివాడు' వ్లాదిమిర్ లెనిన్. మరణం నాటికి లెనిన్ వయస్సు కేవలం 53 సంవత్సరాలు.

1870 ఏప్రిల్ 22వ తేదీన రష్యాలోని సింబిర్స్క్ పట్టణంలో ఉన్నత విద్యా వంతులైన దంపతులకు మూడవ బిడ్డగా వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యానోవ్ జన్మించాడు. ఉద్యమ ప్రస్థానంలో 1901లో లెనిన్ అనే మారు పేరును ఆయన ఎంచుకున్నాడు. నల్లేరు మీద నడక వంటి లెనిన్ కుటుంబం జీవితంలో మొదటి దెబ్బ ఆయన పదిహేనవ ఏట తండ్రి మరణంతో తగిలింది. ఆ తర్వాత లెనిన్ పదిహేడవ ఏట తనకు రోల్ మోడల్‌గా భావించిన తన అన్న... జార్ చక్రవర్తిని హత్యచేసేందుకు ప్రయత్నించి విఫలమై ఉరికంబం ఎక్కాడు. ఈ తరుణంలోనే ఆయన మార్క్సిజం అధ్యయనం దిశగా అడుగులు వేశారు. న్యాయశాస్త్రం అభ్యసించి 1892–93 కాలంలో న్యాయవాదిగా ప్రధానంగా రైతాంగం, చేతి వృత్తుల వారి కేసులను ఆయన వాదించాడు.

1893 ఆగస్టులో ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరాన్ని చేరి, అక్కడ మార్క్సిస్ట్ అధ్యయన బృందాలలో చురుకైన పాత్ర పోషించనారంభించారు. ఆ సమయంలోనే కార్మికులకు కార్ల్ మార్క్స్ రచించిన 'పెట్టుబడి' గ్రంథంపై ఆయన అధ్యయన తరగతు లను నిర్వహించారు. ఈ మార్క్సిస్ట్ విప్లవ భావాల ప్రచార క్రమంలోనే ఆయనతో పాటు కొందరు నాయకులు కూడా 1895 డిసెంబర్‌లో అరెస్ట్ అయ్యారు. 15 నెలల జైలు జీవితం అనంతరం, లెనిన్‌ను 3 సంవత్సరాల సైబీరియా ప్రవాసానికి నాటి జార్ ప్రభుత్వం పంపింది. అక్కడే ఆయనతో జత కలిసిన కృపస్కయాను ఆయన వివాహం చేసుకున్నారు. కృపస్కయా ఆయనకు జీవితకాల సహచరి, కామ్రేడ్, కార్య దర్శిగా గొప్ప పాత్ర పోషించారు. సైబీరియా ప్రవాసం 1900 జనవరిలో ముగిసింది.

అయితే, రష్యాలో ఉండగా చట్టబద్ధంగా రాజకీయ కార్యకలాపాలు సాధ్యం కాదని నిర్ణయించుకొని లెనిన్ రష్యాను విడిచి జర్మనీలోని మ్యూనిక్ నగరాన్ని చేరుకున్నారు. ఈ ప్రవాస ప్రస్థాన క్రమంలో యూరోప్‌లోని అనేక నగరాలలో జీవించారు. తన తాత్విక గురువు ప్లెకనోవ్, సహచరుడు మార్టోవ్‌లతో కలిసి 'ఇస్క్రా' (నిప్పురవ్వ) అనే పత్రికను స్థాపించారు. ఒక ప్రచార సాధనంగా, పార్టీ నిర్మాణానికి కేంద్ర బిందువుగా పత్రికల పాత్రను గుర్తించిన లెనిన్ అటు తర్వాత అనేక పత్రికల స్థాపన, నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. అలాగే, ఆ యా పత్రికలలో పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు రాశారు. అలాగే, తన అన్న అలెగ్జాండర్ మరణం అనంతరం ఆయన ఆశయాన్ని స్వీకరించి, తీవ్రవాద దాడుల ద్వారా ఆ ఆశయాన్ని సాధించలేమని గుర్తించి కార్మిక రాజ్య లక్ష్యసాధనకు ఏకైక మార్గంగా సంఘటిత పఢ్ఢ కార్మిక జనాళి తాలూకు నిర్మాణానికి పూనుకున్నారు.

ప్రవాసంలో ఉంటూనే పత్రికలూ, రష్యాలోని పార్టీ నిర్మాణాల ద్వారా కార్మికవర్గంలోనూ, విస్తృత ప్రజానీకంలోనూ సోషలిస్ట్ భావజాల వ్యాప్తికి లెనిన్ కృషి చేశారు. ఈ క్రమంలోనే, మార్క్సిజం పట్ల, దాని సజీవ నిర్వచనం పట్ల వామపక్షవాదులలో ఉన్న అనేక తప్పుడు ధోరణులపై ఆయన నిరంతర పోరాటం చేశారు. మార్క్సిజం అనేది పోరాట కరదీపిక అనీ... అది కరుడుగట్టిన పిడివాదం కాదనీ ఆయన నిరంతరం బోధించారు. పార్టీలో అంతర్గత పోరాట క్రమంలో మెన్షివిక్ బృందంతో తెగదెంపులు చేసుకొని 1903లో 'బోల్షివిక్' పార్టీని ఏర్పరచారు.

అనంతరం 1905లో, రష్యా – జపాన్ యుద్ధంలో ఓటమి పాలైన రష్యాలో విప్లవ పోరాటం చెలరేగింది. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలు, ఆర్థిక డిమాండ్ల స్థాయిని దాటి రాజకీయ పోరాటాలుగా మారాయి. అయితే, ఈ విప్లవాన్ని జార్ చక్రవర్తులు అణచివేయగలిగారు. కానీ, అంతిమంగా తమ ప్రజానీకానికి పాక్షిక ప్రజాతంత్ర హక్కులను ఇవ్వక చక్రవర్తికి తప్పలేదు. దీనిలో భాగంగానే పార్లమెంటరీ వేదికగా 'డ్యూమా' ఏర్పడింది. అలాగే, 1903లో మెన్షివిక్, బోల్షివిక్ పార్టీలుగా చీలిపోయిన సోషలిస్ట్ డెమోక్రాట్లు ఈ విప్లవ వైఫల్యం పట్ల ప్రతిస్పందించిన తీరూ... వారు దాని నుంచి తీసుకున్న పాఠాలు కూడా పూర్తిగా భిన్నమైనవి. ఈ విప్లవ



నేడు లెనిన్ శత వర్ధంతి

వైఫల్యానంతరం మెన్షివిక్‌లు మరింత ఆర్థికవాదం, సంస్కరణవాద దిశగా మరలారు. కాగా, ఈ విప్లవ పరాజయం కార్మిక వర్గం మరింత మిలిటెంట్ పోరాటాలకు మరలవలసిన అవసరాన్ని చెబుతోందని లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్‌లు నిర్ధారించుకున్నారు.

1914లో మొదలైన మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభానికి ముందరే యూరప్‌లోని వివిధ దేశాల కమ్యూనిస్టులు యుద్ధం గనుక వస్తే, అది సామ్రాజ్యవాద దేశాలు, ప్రపంచంలోని మార్కెట్లను పంచుకొనేందుకు కొట్లాడుకొనేదిగానే ఉంటుంది గనుక ఆ యుద్ధాన్ని వ్యతిరేకించాలనీ... తమ తమ దేశాల సైనికులకు ఈ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చేందుకు వారు తమ తమ దేశాల పెట్టుబడిదారుల పైకి తమ తుపాకులను తిప్పేలా పిలుపునివ్వాలనీ నిర్ణయించారు. అయితే, తీరా యుద్ధం మొదలయ్యాక అనేక దేశాల పార్టీలు జాతీయత, దేశభక్తి పేరిట తమ తమ దేశాల ప్రభుత్వాలను సమర్థించుకోసాగాయి. ఈ నేపథ్యంలో, ఒక్క లెనిన్ మాత్రమే సూత్రబద్ధ వైఖరి తీసుకొని ఈ యుద్ధంలో రష్యా ప్రవేశానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. ఈ యుద్ధంలో రష్యా సైనికులు, కార్మికులు తమ ఆయుధాలను స్వదేశీ పెట్టుబడిదారులపైకి తిప్పాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదులు తమ తమ స్వప్రయోజనాల కోసం, మార్కెట్లను పంచుకోవడం కోసం కొట్లాడుకొనే ఈ యుద్ధంలో వివిధ దేశాల పేద కార్మికులూ, సైనికులూ పరస్పరం చంపుకోవడం కూడనిదని ఆయన ఉద్బోధించారు. కాగా, కడకు 1917 నాటికి ఈ యుద్ధ క్రమంలో తీవ్ర ప్రాణ నష్టానికి, కడగండ్లకు గురైన రష్యా సైనికులు, కార్మికులు యుద్ధం పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేయసాగారు. అలాగే, కాస్తంత సొంత భూమి కోసం తపన పడుతోన్న రష్యా రైతాంగం కూడా ఈ అసంతృప్తిలో భాగస్వామి అయ్యింది. దీని పర్యవసానమే 1917 ఫిబ్రవరి విప్లవం. అయితే, ఈ విప్లవ క్రమంలో అధికారంలోకి వచ్చిన మెన్షివిక్‌లు తదితరులు మెజారిటీ రష్యా ప్రజానీకం ఆకాంక్ష అయిన యుద్ధం నుంచి వైదొలగాలన్న దానిని గౌరవించలేదు. వారు ఆ యుద్ధంలో కొనసాగారు.

ఈ దశలోనే, స్విట్జర్లాండ్ నుంచి సీల్ వేసిన రైలు పెట్టెలో జర్మనీ గుండా రష్యాలో అడుగిడిన వ్లాదిమిర్ లెనిన్... 'కార్మికులకు రొట్టె, రైతుకు భూమి, సైనికుడికి శాంతి' నినాదంతో మరో విప్లవం దిశగా సాగాల్సిన అవసరాన్ని '1917 ఏప్రిల్ థీసిస్' ద్వారా రష్యా ప్రజల ముందు ఉంచారు. దీనితో అభద్రతకూ... ఆగ్రహానికి లోనైన మెన్షివిక్ ప్రభుత్వం లెనిన్‌ను అరెస్ట్ చేసేందుకు నిర్ణయించింది. పర్యవసానంగా మరికొద్ది కాలం పాటు రష్యా సరిహద్దులోని ఫిన్లాండ్‌లో ఒక కార్మికుడి ఇంట అజ్ఞాతంగా గడిపిన లెనిన్, అనంతరం అక్టోబర్ నాటికి విప్లవానికి బోల్షివిక్ పార్టీని సమాయత్తం చేశారు. ఈ మొత్తం క్రమంలో పార్టీలో అంతర్గతంగా కూడా వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. మొత్తంగా, 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభం నుంచీ... 1917 అక్టోబర్ వరకూ ఆయన దాదాపు ఒంటరిగానే విప్లవ చోదక శక్తిగా... ప్రపంచ పీడిత జనాళి పథ నిర్దేశకుడిగా ముందు నడిచారు.

అక్టోబర్ విప్లవానంతరం, సోవియట్ సోషలిస్ట్ రాజ్యాన్ని కూల్చివేసేందుకు దాడి చేసిన పద్నాలుగు పెట్టుబడిదారీ దేశాల సైన్యాలనూ, వైట్‌గార్డుల రూపంలో అంతర్గత శత్రువులనూ తిప్పి కొట్టడంలోనూ... జర్మనీతో బ్రెస్ట్‌లిటోవ్స్క్ సంధి చేసుకోవడం వంటి విషయాలలో ట్రాట్స్కీ వంటి వారి అతివాద పోకడలను అదుపులో పెట్టడం లోనూ లెనిన్ పాత్ర అద్వితీయం. ఈ క్రమంలో ఆయన పైన జరిగిన తుపాకీ కాల్పుల హత్యాయత్నం, తీవ్రమైన పని ఒత్తిడి వంటివి ఆయన ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీశాయి. 1917 విప్లవానంతరం 1922 వరకూ రష్యాలో అంతర్యుద్ధం జరిగింది.

1921లో ఆరోగ్య సమస్యలు బయటపడడం మొదలైన తర్వాత 1924 జనవరి 21 వరకు ఆయన స్థితి దిగజారుతూనే ఉంది. అయినా, చివరి క్షణం వరకూ లెనిన్ విప్లవాన్ని కంటికి రెప్పలా కాపాడుకొనేందుకు పెనుగులాడుతూనే ఉన్నారు. పక్షవాతంతో మంచం పట్టినా పట్టువిడవని దీక్షతో చివరి క్షణం వరకూ విప్లవ పురోగతి కోసం ఆయన తపన పడ్డారు. తాను ముందు ఊహించినట్లుగా రష్యా విప్లవాన్ని అనుసరించి జర్మనీ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో విప్లవాలు జరగకపోవడంతో నాడు ప్రపంచ విప్లవ కేంద్రబిందువు, తూర్పు దిశగా కదిలిందని ఆయన సూత్రీకరించారు. పర్యవసానంగా చైనాలో విప్లవం జరిగే అవకాశాన్ని కూడా ఆయన ప్రతిపాదించారు.

పెట్టుబడిదారులు మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందంటూ చేస్తున్న అసత్య ప్రచారాల ద్వారా మార్క్స్, లెనిన్‌లను పలచన చేయనారంభించారు. అయితే, అంతిమంగా ఈ మధ్యనే ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడిదారీ పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్' నేటి యుగంలో లెనిన్ లేవనెత్తిన ప్రశ్నలకు ఇంకా సమకాలీనత ఉందంటూ వ్యాఖ్యానించడం వాస్తవాలకు అద్దం పడుతోంది. అయితే, అదే పత్రిక లెనిన్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆయనే ఇచ్చిన జవాబు మాత్రం సరైనది కాదంటూ సన్నాయి నొక్కులు నొక్కడం ఆ పత్రిక తాలూకు అనివార్య అగత్యం. మూడు దశాబ్దాల క్రితం రచయిత అదృష్ట దీపక్ లెనిన్ గురించి చెప్పిన ఈ మాటలు నేడు మరింత వాస్తవం: 'అతీత గత అవస్థలను ఎరుగని అఖండ కాలం పేరు లెనిన్, హృదయ స్పందన వీనుల సోకే ప్రతీ ప్రదేశం పేరు లెనిన్...'

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.ఏకాదశి రా.9.12 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: రోహిణి తె.5.28 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి మృగశిర, వర్జ్యం: రా.9.33 నుండి 11.05 వరకు, దుర్ముహూర్తం: సా.4.19 నుండి 5.07 వరకు, అమృతఘడియలు: ప.2.31 నుండి 4.03 వరకు; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుండి 1.30 వరకు, సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 5.44.

గన్‌మెన్లను ఇవ్వాలని హైకోర్టులో ఆరూరి రమేశ్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: 2 ప్లస్ 2 గన్‌మెన్లతో తనకు రక్షణ కల్పించాలని కోరుతూ వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వర్ధన్నపేట నుంచి 2సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించానని, గత అసెంబ్లీ ఎన్నికల వరకు 3 ప్లస్ 3 గన్‌మెన్ల భద్రత కల్పించారని పేర్కొన్నారు. ఫలితాల తర్వాత ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే 3 ప్లస్ 3 గన్‌మెన్లను ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయని, తాను అన్ని గ్రామాలకు తిరగాల్సి ఉంటుందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 2 ప్లస్ 2 గన్‌మెన్ల భద్రత కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ రెండు, మూడు రోజుల్లో విచారణకు వచ్చే అవకాశముంది.

సుపారీ ఇచ్చి.. భర్తను హత్య చేయించి

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని.. రూ.50వేలు సుపారీ ఇచ్చిన భార్య
- కిడ్నాప్.. హత్య.. ఆపై దహనం
- ఐదుగురు నిందితుల అరెస్టు
- సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్ వెల్లడి


మల్లేశం

జోగిపేట (అందోల్): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని సుపారీ ఇచ్చి భర్తను భార్య హత్య చేయించి మృతదేహాన్ని తగలబెట్టించిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శనివారం వెలుగుచూసింది. సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. జోగిపేటకు చెందిన పాపన్నపేట మల్లేశం(30)కు అందోల్ మండలం మన్ సాన్‌పల్లికి చెందిన కల్పనతో 2015లో వివా హం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. జోగిపేట పట్టణం అందోల్‌లోని డబుల్ బెడ్‌రూం కాలనీల వద్ద వీరు నివాసం ఉంటున్నారు. కల్పనకు మన్‌సాన్‌పల్లికి చెందిన మస్కూరి మహేశ్‌తో పెళ్లికి ముందు నుంచీ సంబంధం ఉంది. వివాహం తర్వాత కూడా ఈ బంధాన్ని కొనసాగిస్తోంది. ఈ విషయమై మల్లేశం కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భావించి విషయం ప్రియుడు మస్కూరి మహేశ్‌కి వివరించింది. దీంతో మహేశ్.. రంగంపేటకు చెందిన తన మేనబావ ఉసికే అంబాజీకి చెప్పగా, అదే గ్రామానికి చెందిన పాత నేరస్తుడు తలారి మహేశ్‌తో పరిచయం చేయించి, రూ.50 వేలకు హత్య చేసేలా సుపారీ మాట్లాడుకున్నారు. అడ్వాన్సుగా రూ.5 వేలు ఇవ్వగా, పలుమార్లు మరో రూ.30 వేలను అందజేశారు. ఈ విషయంలో తన స్నేహితుడు, గంగారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వజ్జరి మహేశ్ సహకారం తీసుకున్నారు.

హత్య జరిగిందిలా..

వజ్జరి మహేశ్, మస్కూరి మహేశ్, తలారి మహేశ్.. ఈ ముగ్గురూ ఓ కారు అద్దెకు తీసుకుని శుక్రవారం తెల్లవారుజామున కల్పన ఇంటి వద్దకు వెళ్లి కాపుకాశారు. 5:30 గంటల ప్రాంతంలో మల్లేశం బయటకు రాగానే అతని తలపై బండరాయితో మస్కూరి మహేశ్ బలంగా కొట్టడంతో స్పృహకోల్పోయాడు. వెంటనే అతడిని కారులో వేసుకుని సంగుపేట వైపు వెళ్లారు. మల్లేశం చేతులను కట్టేసి, గొంతు నొక్కడంతో అతను కారులోనే మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం కోనాపూర్ చెరువు వద్ద మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి నిందితులు పారిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. మల్లేశం భార్య కల్పనను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. అసలు విషయాలు వెలుగుచూశాయి. నిందితులు మస్కూరి మహేశ్, కల్పన, తలారి మహేశ్, వజ్జరి మహేశ్, ఉసికే అంబాజీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా కేసును కేవలం 22గంటల వ్యవధిలో ఛేదించిన జోగిపేట పోలీసులను ఎస్పీ రూపేశ్ అభినందించారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఏర్పాటు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వెల్లడి


సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ముషీరాబాద్ (హైదరాబాద్): మూడు విప్లవ పార్టీలు కలిసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పేరుతో ఒకే పార్టీగా ఏర్పడ్డాయి. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనీషియేటివ్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) పార్టీల ప్రతినిధులు ఏడాది కాలంగా రాజకీయ, నిర్మాణ పరిస్థితులపై చర్చలు జరిపిన అనంతరం ఒకే పార్టీగా ఏర్పడేందుకు నిర్ణయించుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వెల్లడించారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కె.జి.రాంచందర్, రెవల్యూషనరీ ఇనీషియేటివ్ రాష్ట్ర కార్యదర్శి గద్దం సదానందంతో కలసి గుమ్మడి నర్సయ్య శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆల్ ఇండియా యూనిటీ కాన్ఫరెన్స్‌ను మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మాస్‌లైన్ పార్టీకి సెంట్రల్ ఆర్గాన్ (పత్రిక) పేరును కూడా మాస్‌లైన్‌గా ఉండాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో కె.రంగారెడ్డి, కె.రమ, ఆర్.చంద్రశేఖర్, వి.కృష్ణ, చంద్ర అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఉంటే తీవ్ర చర్యలు

- ప్రతి ఒక్కరూ క్షేత్ర పర్యటనలు చేయాలి
- అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి పీసీసీఎఫ్ డోబ్రియల్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: అటవీ అధికారులు, సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్ హెచ్చరించారు. చీఫ్ కన్జర్వేటర్ స్థాయి నుంచి బీట్ అధికారి వరకు ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తరచుగా క్షేత్ర పర్యటనలు చేయాలని సూచించారు. అటవీ సిబ్బందికి కేటాయించిన అటవీ బీట్లలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ చేయాలని (కాలినడక పర్యవేక్షణ) ఆదేశించారు. అడవులకు నష్టం చేసేవారిని, వన్యప్రాణులను హతమార్చే వారి పట్ల అత్యంత కఠినమైన అటవీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో పెద్ద పులి పాత్ర ఉన్నత స్థానంలో ఉంటుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో రెండు పెద్ద పులులు చనిపోవటం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. శనివారం అరణ్య భవన్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల చీఫ్ కన్జర్వేటర్లు, ఫీల్డ్ డైరెక్టర్లు, అటవీ డివిజనల్ అధికారులతో పీసీసీఎఫ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డోబ్రియల్ మాట్లాడుతూ.. ఇన్ఫార్మర్లతో పాటు, నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం ద్వారా అడవులు, వన్యప్రాణులను రక్షించుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన క్యాచ్ ద ట్రాప్ (ఉచ్చులు, వలలను పట్టు కోవటం) సమర్థ వంతంగా కొనసాగుతోందని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎం.సీ పర్గెయిన్ తెలిపారు. ఇప్పటివరకు 1320 ఉచ్చులను అటవీ శాఖ స్వాధీనం చేసుకుందని, సుమారు ఏడు వందల కేజీల ఇనుప వస్తువులను సిబ్బంది పట్టుకున్నారని వెల్లడించారు.

శోభాయమానం.. రామమయం

అభిషేకం, గర్భాలయ సంప్రోక్షణ

- అయోధ్యలో మరో ప్రధాన క్రతువు పూర్తి
- బాలరామునికి నేడు 125 కలశాలతో మంగళస్నానం
- ప్రాణప్రతిష్ట వేడుక కోసం మొదలైన వీఐపీల రాక

అయోధ్య/న్యూఢిల్లీ: రామాలయ ప్రారంభోత్సం, బాలరాముని ప్రాణప్రతిష్ఠకు ముహూర్తం సమీపిస్తున్న కొద్దీ అయోధ్య మరింత శోభాయమానంగా మారుతోంది. నగమంతటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ఎటు చూసినా 'శుభవేళ రానే వచ్చింది', 'అయోధ్య సిద్ధమైంది' అంటూ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఆహూతులకు హార్దిక స్వాగతం పలుకుతున్నాయి. లౌడ్ స్పీకర్ల నిండా రామ నామం, భక్తి గీతాలు మార్మోగుతున్నాయి. అయోధ్య అణువణువూ రామమయంగా మారింది. రామాలయ ప్రారంభ సన్నాహాలు తుది దశకు చేరుతున్నాయి. గర్భాలయంలో కొలువుదీరిన బాలరాముని విగ్రహాన్ని శనివారం పవిత్ర సరయూ నదీజలాలతో అభిషేకించారు. గర్భాలయాన్ని కూడా నదీ జలాలతో సంప్రోక్షణ చేశారు. మంత్రోచ్చారణ నడుమ శుద్ధీకరణ కార్యక్రమాలు ముగిశాయి. అనంతరం శాస్త్రోక్తంగా వాస్తు శాంతి, అన్నాధివాస, పుష్పాధివాస క్రతువులు జరిపారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రసాదాలు, పుష్పాలతో బాలరామునికి నివేదన జరిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు. బాలరామునికి ఆదివారం 125 కలశాలతో మంగళస్నానం జరగనుంది...


శనివారం పుష్పాలంకరణతో మెరిసిపోతున్న అయోధ్య రామాలయం లోపలి ప్రాంగణం

యజమానులుగా 14 మంది దంపతులు

ప్రాణప్రతిష్ట క్రతువులో 14 మంది దంపతులు ముఖ్య యజమానులుగా పాల్గొననున్నారు. వీరిని దేశవ్యాప్తంగా తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, ఈశాన్య ప్రాంతాల నుంచి ఎంపిక చేశారు. వీరందరి సమగ్ర భాగస్వామ్యంలో పూజలు, క్రతువులు జరుగుతాయని రామ జన్మభూమి ట్రస్టు వర్గాలను ఉటంకిస్తూ ఆరెస్సెస్ నేత సునీల్ అంబేడ్కర్ వివరించారు.

జైషే బెదిరింపులు

ప్రాణప్రతిష్ట సమీపిస్తున్న వేళ అయోధ్యలో కల్లోలం సృష్టిస్తామంటూ పాక్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ చేసిన హెచ్చరిక అలజడి రేపుతోంది. హింసాత్మక ప్రతీకారం తప్పదని శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో హెచ్చరించడంతో అయోధ్యలో హై అలర్ట్ ప్రకటించారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. నిఘా వర్గాలు పరిస్థితిని డేగ కళ్లతో గమనిస్తున్నాయి.

'రామ' రైల్వేస్టేషన్లకు విద్యుత్ వెలుగులు

రామన్నపేట్ (తెలంగాణ). రామచంద్రపురం (ఆంధ్రప్రదేశ్). రామగిరి (కర్ణాటక). ఇవన్నీ రాముని పేరుతో ఉన్న రైల్వేస్టేషన్లు. ఇలా దేశ వ్యాప్తంగా మొత్తం 343 రైల్వేస్టేషన్లున్నాయి. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇవన్నీ విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోనున్నాయి. రైల్వే శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాముని పేరిట ఉన్న రైల్వేస్టేషన్లలో అత్యధికంగా 55 ఏపీలో ఉండటం విశేషం!

దర్శనాలకు బ్రేక్

తాత్కాలిక మందిరంలో పూజలందుకుంటున్న ప్రస్తుత రామ్‌లల్లా విగ్రహాన్ని నూతన గర్భాలయంలోకి చేర్చే ప్రక్రియకు కూడా అర్చకులు శ్రీకారం చుట్టారు. నూతన విగ్రహంతో పాటు ఈ విగ్రహాన్ని కూడా గర్భాలయంలో ప్రతిష్ఠించనుండటం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం నుంచే తాత్కాలిక ఆలయంలో దర్శనాలు నిలిపేశారు. ఈ విగ్రహాన్ని బహుశా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వయంగా గర్భాలయంలోకి తీసుకెళ్తారని అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అభిప్రాయపడ్డారు. గుడారం నుంచి తాత్కాలిక మందిరంలోకి కూడా ఈ విగ్రహాన్ని ఆదిత్యనాథే తీసుకెళ్లారు.

విమానాల వరద...

అయోధ్యకు వీఐపీల రాక ఇప్పటికే మొదలైంది. ఆదివారం నాటికి ఇది ఊపందుకోనుంది. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి దాదాపు 7,000 మందికి ఆహ్వానాలు అందడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని అయోధ్యకు చేరవేసేందుకు సోమవారం ఏకంగా 100కు పైగా చార్టర్డ్ ఫ్లైట్లు రానున్నట్టు చెబుతున్నారు. వీటి తాకిడిని తట్టుకోవడం కొత్తగా నిర్మించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయానికి శక్తికి మించిన పనే కానుంది. ఇప్పటికే 40కి పైగా విమానాల ల్యాండింగ్‌కు విజ్ఞప్తులు అందినట్టు చెబుతున్నారు. కానీ నిబంధనల ప్రకారం ప్రధాని ప్రయాణించే ఎయిరిండియా వన్ ల్యాండయ్యాక విమానాశ్రయంలోకి మరే విమానాన్నీ అనుమతించరు. ఈ నేపథ్యంలో వీఐపీలు దిగీ దిగగానే వచ్చిన విమానాన్ని వచ్చినట్టే వారణాసి, లఖ్‌నవూ తదితర సమీప విమానాశ్రయాలకు పంపనున్నారు. ప్రధాని వెనుదిరిగాక వాటిని ఒక్కొక్కటిగా తిరిగి అయోధ్యకు అనుమతిస్తారు.

2 నెలలు 2 కోట్ల మంది!

రామాలయ ప్రారంభం అనంతరం అయోధ్యకు దేశ నలుమూలల నుంచీ భారీగా భక్తులను తరలించేలా బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జనవరి 25 నుంచి మార్చి 25 దాకా 2 కోట్ల మందికి దర్శనం కల్పించనుంది. ఒక్కో లోక్‌సభ నియోజవర్గం నుంచి 5 వేల మంది చొప్పున మొత్తం 543 లోక్‌సభ స్థానాల నుంచీ భక్తులను తరలించనుంది. ఇందుకోసం వందలాది ప్రత్యేక రైళ్లతో పాటు బస్సులు తదితర ఏర్పాట్లు చేస్తోంది.

ఫొటోలు లీకయ్యాయి: పూజారి

ప్రాణప్రతిష్ఠకు ముందే బాలరాముని విగ్రహం ఫొటోలు లీకవడంపై అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. దీనిపై దర్యాప్తుకు డిమాండ్ చేశారు. ''ప్రాణప్రతిష్ఠ జరగకుండా మూలవిరాట్టు ఫొటోలు విడుదల చేయడం సరికాదు. ముఖ్యంగా నేత్రాలను బహిర్గతపరచడం పూర్తిగా నిషిద్ధం. కళ్లు కనిపిస్తున్నది అసలు విగ్రహం కాదు. ఒకవేళ అది అసలు విగ్రహమే అయితే ఫొటోను లీక్ చేసిందెవరో కనిపెట్టి శిక్షించాలి'' అని కోరారు. ప్రాణప్రతిష్ఠ జరగనున్న బాలరామునికి సంబంధించి శుక్రవారం రెండు ఫొటోలు వెలుగు చూడటం తెలిసిందే. ఒకదాంట్లో కళ్లకు పసుపు వస్త్రం కట్టి ఉండగా మరొక దాంట్లో కళ్లు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణప్రతిష్ఠకు సంబంధించి ఎలాంటి తప్పుడు కంటెంట్‌నూ వ్యాప్తి చేయొద్దని ప్రింట్, టీవీ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికలకు కేంద్రం సూచించింది.

1,265 కిలోల లడ్డూ, 400 కిలోల తాళం





అయోధ్య రామునికి దేశ విదేశాల నుంచి వినూత్న కానుకల వరద కొనసాగుతూనే ఉంది. వీటిలో భాగంగా ఏకంగా 1,265 కిలోల లడ్డూ, 400 కిలోల తాళం శనివారం అయోధ్య చేరాయి. లడ్డూను హైదరాబాద్‌కు చెందిన నాగభూషణంరెడ్డి అనే భక్తుడు, తాళాన్ని యూపీలోని అలీగఢ్‌కు చెందిన సత్యప్రకాశ్ శర్మ దంపతులు తయారు చేయించారు. శర్మ ఇటీవలే మరణించారు. తాళాన్ని రామునికి సమర్పించాలంటూ చివరి కోరిక కోరారు. ఆ మేరకు ఆయన భార్య దాన్ని అయోధ్య చేర్చారు. దీన్ని ప్రపంచంలోకెల్లా అతి పెద్ద తాళంగా చెబుతున్నారు. తాళాల తయారీకి అలీగఢ్ దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. 25 మంది 3 రోజుల పాటు శ్రమించి లడ్డూను తయారు చేసినట్టు నాగభూషణంరెడ్డి చెప్పారు. ఇది నెల రోజుల పాటు పాడవకుండా ఉంటుందన్నారు.

ప్రత్యేక ప్రసాదాలు



ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక ప్రసాదాలు అలరించనున్నాయి. టిప్లా, బాదం మిఠాయి, మటర్ కచోరీ తదితరాలను సోమవారం బాలరామునికి నివేదిస్తారు. అనంతరం వాటిని, తిరుమల శ్రీవారి లడ్డూలు, 1,265 కిలోల భారీ లడ్డూతో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన ఇతర ప్రసాదాలను భక్తులకు అందిస్తారు. మరోవైపు బాలరాముని నివేదన కోసం లక్నో నుంచి ఛప్పన్ భోగ్ (56 రకాల భోజన పదార్థాల)తో కూడిన వెండి థాలీ కూడా అయోధ్యకు చేరింది.

రంగనాథుని సేవలో మోదీ

భజన, కంబ రామాయణ శ్రవణం • తమిళనాడులో ఆలయాల సందర్శన


సాక్షి, చెన్నై/ తిరుచిరాపల్లి: కొద్దిరోజులుగా శ్రీరాముడి జీవితంతో ముడిపడి ఉన్న ఆలయాలను సందర్శిస్తున్న ప్రధాని మోదీ అందులో భాగంగా శనివారం తమిళనాడులోని ద్వీప పట్టణం 'శ్రీరంగం'లోని ప్రఖ్యాత శ్రీ రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శనివారం ఉదయం ధోతి, అంగవస్త్రం, రుద్రాక్షమాలతో తమిళ సంప్రదాయ ఆహార్యంలో ఆలయానికి విచ్చేసిన ప్రధాని మోదీకి ఆలయ నిర్వహణ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారికి వేదాలు పఠిస్తూ పండితులు తోడు వచ్చారు. మోదీ ఆ తర్వాత రంగనాథస్వామివారిని దర్శించుకున్నారు. రామానుజాచార్య, చక్రత్తాళ్వార్ సన్నిధాలను సందర్శించారు. ఆలయ ఏనుగు ఆండాళ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏనుగు మౌతార్గాన్ వాయిస్తూ ఆహ్వానం పలకడం విశేషం. భారత ప్రధాని రంగనాథ ఆలయాన్ని దర్శించుకోవడం ఇదే తొలిసారి. 12వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత తమిళ కవి కంబ రచించిన కంబ రామాయణాన్ని ఈ సందర్భంగా మోదీ పారాయణం చేశారు. తమిళనాడులోని ప్రఖ్యాత వైష్ణవదేవాలయాల్లో రంగనాథాలయం ముఖ్యమైనది. 108 దివ్య దేశాల్లో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది.

రామేశ్వరం ఆలయంలోనూ...

శనివారం మధ్యాహ్నం మోదీ రామేశ్వరం వెళ్లారు. అగ్నితీర్థం బీచ్‌లో పుణ్యస్నానం ఆచరించారు. 22 పవిత్ర తీర్థాలలో స్నానం చేశారు. ప్రాచీన శివాలయమైన ప్రఖ్యాత రామనాథస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. భక్తి, భజన కార్యక్రమాల్లో పాల్గొని భజన చేశారు. రామయణ గాథతో ఈ ఆలయానికి గాఢానుబంధం ఉంది. అనంతరం పట్టణంలోని బీజేపీ కార్యకర్తలు, స్థానికులతో మోదీ మాట్లాడారు. రాత్రి రామేశ్వరంలోని రామకృష్ణ మఠంలో బస చేశారు. ఆదివారం ఉదయం ఆయన మళ్లీ రామేశ్వరం అగ్ని తీర్థంలో పవిత్ర స్నానం చేసి మరోమారు రామనాథస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం సమీప గ్రామంలోని కోడండరామస్వామి దర్శనంతో మోదీ మూడు రోజుల తమిళనాడు పర్యటన పూర్తవుతుంది.

తిరుచిరాపల్లిలో రోడ్ షో

తిరుచిరాపల్లి పురవీధుల్లో జనం మోదీకి ఘన స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా పూలవర్షం కురిపించారు. వారందరికీ వనక్కమ్ అంటూ మోదీ అభివాదం చేశారు. జై శ్రీరామ్ నినాదాలతో ఆ మార్గమంతా మార్మోగిపోయింది. అక్కడి నుంచి శ్రీరంగం వైపుగా మోదీ రోడ్‌షో కొనసాగింది.


రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయంలో ప్రధాని మోదీ

రశ్మిక డీప్ ఫేక్ కేసులో నిందితుడి అరెస్ట్

న్యూఢిల్లీ: సినీ నటి రశ్మికా మందన్నడీప్ ఫేక్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు శనివారం వెల్లడించారు. అతన్ని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఈమని నవీన్ (23) అనే బీటెక్ గ్రాడ్యుయేట్‌గా గుర్తించారు. రశ్మికను అభ్యంతరకంగా చిత్రిస్తూ అతను రూపొందించిన ఫేక్ వీడియో బాగా వైరలవడం తెలిసిందే. దీనిపై గతేడాది నవంబర్ 10న ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారు. నిందితున్ని గుర్తించేందుకు మెటా సాయం తీసుకున్నారు. అతడిని ఢిల్లీకి తీసుకువచ్చి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు నక్సల్స్ మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. బాలంనేంద్ర సమీపాన బేళంగుట్టల్లో మావోయిస్టులు సమావేశమయ్యారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనాస్థలిలో రెండు తుపాకులు, ఒక పిస్టల్ లభించాయని డీఎస్పీ ఘరిమా తెలిపారు.

శబరిమల ఆలయానికి రికార్డు ఆదాయం

శబరిమల: ప్రఖ్యాత శబరిమల ఆలయానికి మండల- మకరవిలక్కు పూజల సందర్భంగా ఈసారి రికార్డు స్థాయిలో ఆదాయం లభించినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వామ్ బోర్డు(టీడీబీ) తెలిపింది. గత ఏడాది ఇదే సీజన్‌లో రెండు నెలల్లో 44 లక్షల మంది అయ్యప్పను సందర్శించుకోగా, ఈసారి 50 లక్షల మంది వచ్చారని టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ చెప్పారు. రూ.357.47 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఇది గతేడాది కంటే రూ.10 కోట్లు ఎక్కువని చెప్పారు.

హాస్టల్‌లో అగ్ని ప్రమాదం.. 13 మంది సజీవ దహనం

బీజింగ్: చైనాలోని హెనాన్ ప్రావిన్సులో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 13 మంది బాలలు మృత్యువాతపడ్డారు. యన్‌షాన్‌పు గ్రామంలోని ఇంగ్‌కై ప్రైవేట్ స్కూల్ హాస్టల్‌లో ఘటన చోటుచేసుకుంది. మృతులందరూ 9, 10 ఏళ్ల మూడో గ్రేడ్ విద్యార్థులని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో హాస్టల్‌లో 30 మంది వరకు విద్యార్థులున్నారు. 13 మంది చనిపోగా మిగతా వారిని ఫైర్ సిబ్బంది రక్షించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

మయన్మార్ సరిహద్దుల్లో కంచె

హోం మంత్రి అమిత్ షా

గువాహటి: భారత్–మయన్మార్ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. మయన్మార్‌తో సరిహద్దులకు కూడా పూర్తి స్థాయిలో ముళ్ల కంచె నిర్మిస్తామని చెప్పారు. రెండు దేశాల సరిహద్దుల్లో ప్రజలు స్వేచ్ఛగా సంచరించే వెసులుబాటును సైతం రద్దు చేసేందుకు యోచిస్తున్నామని ప్రకటించారు. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భారత్–మయన్మార్ మధ్య అరుణాచల్ ప్రదేశ్, నాగాల్యాండ్, మణిపూర్, మిజోరంల రాష్ట్రాల మీదుగా 1,643 కిలోమీటర్ల పొడవైన సరిహద్దుంది. యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా 2018 నుంచి సరిహద్దులకు ఇరువైపులా 16 కిలోమీటర్ల దూరం వరకు వీసా లేకుండా ప్రజలు సంచరించేందుకు కేంద్రం వీలు కల్పించింది. ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని మయన్మార్‌కు చెందిన వేలాది మంది భారత భూభాగంలో అక్రమంగా నివాసం ఉండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమిత్ షా ప్రకటనతో అక్రమ చొరబాట్లతో ఇక చెక్ పడనుంది. శనివారం అమిత్ షా అయిదు అస్సాం పోలీస్ కమాండో బెటాలియన్ల మొదటి బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్‌నుద్దేశించి, ఆ తర్వాత సలోనిబారిలో సశస్త్ర సీమా బల్ 60వ అవతరణ దినోత్సవంలో మాట్లాడారు. సరిహద్దులను కాపాడటంతోపాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా తమ విధులను ఎస్ఎస్‌బీ, ఇతర కేంద్ర బలగాలు సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ హయాంలో పదేళ్లలో దేశంలో శాంతిభద్రతలు గణనీయంగా మెరుగయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు సంధించారు. కాంగ్రెస్ హయాంలో ఉద్యోగాలు రావాలంటే యువత లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, నేడు బీజేపీ పాలనలో ఉద్యోగాల కోసం ఒక్క పైసా కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠపై ఆయన.. దాదాపు 550 ఏళ్ల తర్వాత రామ్ లల్లా తిరిగి అయోధ్యకు రావడం యావత్ దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మూడేళ్లలో దేశంలో నక్సల్స్ ఉనికి లేకుండా చేస్తామని చెప్పారు.


శనివారం తేజ్‌పూర్‌లో 13వ త్రైవార్షిక బథౌ సభలో డోలు వాయిస్తున్న అమిత్ షా

సోరెన్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

ఏడు గంటలకుపైగా విచారణ

రాంచీ: జార్ఖండ్‌లో భూకుంభకోణం, సంబంధిత మనీ లాండరింగ్ కేసులో ఆఫీసుకొచ్చి విచారణకు హాజరుకావాలని ఏడు సార్లు సమన్లు ఇచ్చినా బేఖాతరు చేసిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు చివరకు ఆయన ఇంటికే వచ్చి విచారించారు. ఈడీ అధికారులు వస్తున్నారన్న వార్తతో జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్యకర్తలు రావడంతో ఈడీ అధికారుల రక్షణ కోసం భద్రతాబలగాలు భారీ ఎత్తున మొహరించారు. దీంతో ఇంటి పరిసరాలు ఛాకీవనాన్ని తలపించాయి. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాంచీలోని ఆయన నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు సోరెన్‌పై సుదీర్ఘంగా ఏడు గంటలకుపైగా ప్రశ్నలు సంధించారు. కేసుపై పలు వివరాలు అడిగారు. ఈ సందర్భంలో రాష్ట్ర మంత్రి జోబా మాంఝీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే దీపికా పాండే సింగ్, రాజ్యసభ ఎంపీ మహువా మాజీ, కొందరు పార్టీ ఎమ్మెల్యేలు ఇంట్లోనే ఉన్నారు. రాష్ట్ర డీజీపీ అజయ్‌సింగ్ సైతం అక్కడే ఉన్నారు. జేఎంఎం గిరిజన కార్యకర్తలు కొందరు విల్లు, బాణాలతో సోరెన్ ఇంటిపరిసరాల్లో గుమిగూడి ఈడీ వ్యతిరేక నినాదాలిచ్చారు. ఈడీ వ్యతిరేక ర్యాలీలు జరక్కుండా రాంచీ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఉత్కర్ష్ ఇంటి పరిసరాల్లో కర్ఫ్యూ విధించారు. ఈడీ చర్యపై జేఎంఎం కార్యకర్తలు, గిరిజన సంఘాల నేతలు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు దిగారు.



ఇప్పటికే 14 అరెస్టులు

భూ హక్కులను మాఫియా అక్రమంగా చేతులు మార్చి కోట్లు కొల్లగొట్టారని ఈడీ గతంలో ఆరోపించింది. ఇప్పటికే ఈ కేసులో 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఛావీ రంజన్ సహా 14 మందిని ఈడీ అరెస్ట్‌చేసింది. ఈ కేసులో బాధితుడిగా నాటకం ఆడుతూ సీఎం రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేయిస్తున్నాడని బీజేపీ ఆరోపిస్తోంది. సీఎంను కేసులోకి లాగి ప్రభుత్వాన్ని కూలదోయాలని మోదీ సర్కార్ కుట్ర పన్నిందని జేఎంఎం ఆరోపిస్తోంది.

నా పై కుట్ర: సోరెన్

ఏడు గంటలపాటు ఈడీ విచారణ ముగిశాక ఇంటిబయట కార్యకర్తలనుద్దేశించి సోరెన్ మాట్లాడారు. '' నా పై కుట్ర పన్నారు. కుట్రను త్వరలోనే బయటపెడతా. మనం ఎవరికీ భయపడేది లేదు. మీ విశ్వాసాన్ని సమున్నతంగా నిలిపేందుకు బుల్లెట్లనైనా ఎదుర్కొంటా. నాకు మద్దతుగా ఇక్కడికొచ్చిన మీకందరికీ ధన్యవాదాలు'' అని సోరెన్ ప్రసంగించారు.

ప్రతి 15 ఏళ్లకు రూ.10 వేల కోట్లు కావాలి

జమిలి ఎన్నికలకు కావాల్సిన కొత్త ఈవీఎంలపై ఈసీ అంచనా

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వనరులపై కేంద్ర ఎన్నికల సంఘం అంచనాలు వేస్తోంది. ఒకే విడతలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరపాల్సి వస్తే కొత్త ఈవీఎంల కొనుగోలుకు ప్రతి 15 ఏళ్లకు రూ.10 వేల కోట్లు అవసరమవుతాయని లెక్కలు కట్టింది. ఒక్కో ఈవీఎం జీవిత కాలం 15 ఏళ్లు కాగా, ఒక్కో మెషీన్‌ను మూడు సార్లు వాడుకోవచ్చని తెలిపింది. ఏకకాలంలో జరిపే ఎన్నికలకు దేశవ్యాప్తంగా 11.80 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో పోలింగ్ బూత్‌లో జత ఈవీఎంలు.. ఒకటి లోక్‌సభకు, మరోటి శాసనసభ నియోజకవర్గానికి అవసరమవుతాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బ్యాలెట్ యూనిట్(బీయూ)లు 46,75,100, కంట్రోల్ యూనిట్(సీయూ)లు 33,62,300, వీవీప్యాట్‌లు 36,62,600 అవసరమవుతాయని కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే తెలిపింది. కనీసం ఒక బీయూ, ఒక సీయూ, ఒక వీవీప్యాట్‌లను కలిపి ఒక ఈవీఎంగా పరిగణిస్తారు. ఒక బీయూ ఖరీదు రూ.7,900, ఒక సీయూ ఖరీదు రూ.9,800, ఒక వీవీప్యాట్ ఖరీదు రూ.16,000గా తాజాగా నిర్ణయించింది. అదనంగా పోలింగ్, భద్రతా సిబ్బంది, ఈవీఎంల నిర్వహణ కేంద్రాలు, మరిన్ని వాహనాలు అవసరమవుతాయని కూడా ఎన్నికల సంఘం పేర్కొంది. కొత్తగా ఈవీఎల తయారీ, ఇతర సౌకర్యాలను సమకూర్చుకున్నాక 2029లో మాత్రమే మొదటి జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు అవకాశం ఉందని స్పష్టం చేసింది.

దేశ ప్రజాస్వామ్యానికి విఘాతం: ఆప్

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల విధానం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతిపక్ష ఇండియా కూటమికి చెందిన ఆప్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ మౌలిక స్వరూపం, సమాఖ్య విధానాలను దెబ్బతీస్తుంది. పార్లమెంట్, శాసనసభల్లో హంగ్ ఏర్పడిన సందర్భాల్లో ఈ విధానంలో పరిష్కారం లేదు. పైపెచ్చు పార్టీ ఫిరాయింపులను, ఎమ్మెల్యేలు, ఎంపీలను బహిరంగంగానే కొనుగోలు చేసేందుకు దారులు చూపుతుంది. జమిలి ఎన్నికల నిర్వహణతో ఆదా అయ్యే ప్రజాధనం కేంద్ర వార్షిక బడ్జెట్‌లో కేవలం 0.1 శాతం మాత్రమే. సంకుచిత ఆర్థిక లాభాలు, పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాంగం, ప్రజాస్వామ్య సిద్ధాంతాలను త్యాగం చేయజాలం'అని ఆప్ పేర్కొంది.

కులమతాల చిచ్చు పెడుతున్నారు

విద్వేషంతో విడగొడుతున్నారు • బీజేపీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శ

ఇటానగర్: కులం, మతం ప్రాతిపదికన దేశ ప్రజలను మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ విడగొడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర శనివారం అరుణాచల్ ప్రదేశ్‌లో అడుగుపెట్టిన సందర్భంగా దోయ్‌ముఖ్‌లో రాహుల్ స్థానికులనుద్దేశించి ప్రసంగించారు. '' దేశంలో విద్వేషం చిమ్మడమే బీజేపీ పని. తమ కులం, మతం గొప్పదంటూ దేశ ప్రజలు తమలో తాము ఘర్షణలుపడేలా బీజేపీ కుట్రలు చేస్తోంది. కొద్ది మంది పారిశ్రామికవేత్తల కోసమే బీజేపీ పనిచేస్తోంది. జనం కష్టాలు ఆ పార్టీకి పట్టవు. ప్రజాసమస్యల పరిష్కారం కోసమే వారి ఐక్యత కోసం కాంగ్రెస్ కృషిచేస్తోంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా అస్సాంలో కొనసాగుతున్న భారత్ జోడో యాత్ర మార్గమధ్యంలో శనివారం పాపుం పరే జిల్లా గుండా అరుణాచల్ ప్రదేశ్‌లో అడుగుపెట్టింది. అరుణాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ నబాం టుకీ రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు. శనివారం ఒక్కరోజు మాత్రమే అరుణాచల్‌లో యాత్ర కొనసాగి ఆదివారం మళ్లీ అస్సాంలోకి అడుగుపెట్టనుంది.

నిక్కీ హేలీ నా రన్నింగ్ మేట్ కాదు: ట్రంప్

వాషింగ్టన్: అధ్యక్ష పదవి రేసులో రిపబ్లికన్ పార్టీ నుంచి పోటీదారుగా ఉన్న భారతీయ అమెరికన్ నిక్కీ హేలీ తన రన్నింగ్ మేట్ (ఉపాధ్యక్ష పదవి అభ్యర్థి) కాదని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఆమెకు అంత సామర్థ్యం లేదని, ఉపాధ్యక్ష పదవికి ఆమెను ఎంపిక చేసుకోనని వ్యాఖ్యానించారు. అధ్యక్ష పదవి రేసులో రిపబ్లికన్ పార్టీ తరఫున అగ్రభాగాన ఉన్న ట్రంప్ శుక్రవారం కాంకార్డ్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. న్యూహ్యాంప్‌షైర్‌లో ట్రంప్‌కు సమీప ప్రత్యర్థిగా ఉన్న నిక్కీ హేలీ..తాను ఉపాధ్యక్ష పదవి రేసులో లేనని ఇప్పటికే ప్రకటించగా ట్రంప్ పైవిధంగా స్పందించడం గమనార్హం. అదేవిధంగా, ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో నిక్కీ హేలీని జాతిపరంగా హేళన చేశారు. పంజాబ్‌కు చెందిన సిక్కు తల్లిదండ్రుల కుమార్తె అయిన నిక్కీ హేలీని 'నింబ్రా'అంటూ పలుమార్లు పేర్కొన్నారు. నిక్కీ తల్లిదండ్రులు అమెరికన్లు కానందున అధ్యక్ష పదవికి ఆమె అర్హురాలు కాదని ఇటీవల పేర్కొన్న ట్రంప్..ఆమె పేరును 'నిమ్రద'అంటూ తప్పుగా ఉచ్చరించారు. సౌత్ కరోలినాకు రెండు పర్యాయాలు గవర్నర్‌గా పనిచేసిన నిక్కీ హేలీ అసలు పేరు నిమ్రతా నిక్కీ హేలీ. వివాహానంతరం నిక్కీ హేలీగా మార్చుకున్నారు.

గురక పెట్టొద్దన్నందుకు పొడిచేశాడు

మేరీల్యాండ్: చెవులకు చిల్లులు పడేలా గురక పెట్టకురా అన్నందుకు ఓ పెద్దాయనను పొడిచి చంపిన ఘటన అమెరికాలో జరిగింది. పెన్సిల్వేనియా రాష్ట్రం మోంట్‌గోమేరీ కౌంటీలో 62 ఏళ్ల రాబర్ట్ వాలెస్ తల్లితో కలిసి ఉంటున్నాడు. అదే డూప్లెక్స్ భవనంలో 55 ఏళ్ల క్రిస్టఫర్ కేసీ ఒంటరిగా ఉంటున్నాడు. క్రిస్టఫర్ పెడుతున్న భారీ గురకను వినలేకపోతున్నానని ఏడాదిన్నరగా రాబర్ట్ చెప్పీచెప్పీ విసిగిపోయాడు. విషయం పోలీసుల దాకా వెళ్లింది. వాళ్లు నచ్చజెప్పినా లాభం లేకపోయింది. క్రిస్టఫర్, రాబర్ట్‌ల పడక గదులు పక్కపక్కనే ఉండటం, ఒక చెక్క గోడ మాత్రమే అడ్డుగా ఉండటంతో గురక రాబర్ట్‌కు బాగా ఇబ్బందిపెట్టేది. విసిగిపోయిన పెద్దాయన చివరకు జనవరి 15న సాయంత్రం క్రిస్టఫర్ వరండా దగ్గరికొచ్చి బెదిరించాడు. వినకపోవడంతో అతని కిటికీ స్క్రీన్‌ను చింపేసి చంపేస్తానని అరిచాడు. ఒకనొక సమయంలో నీ గురక సమస్యకు శస్త్రచికిత్స చేయిస్తానని కూడా మాట ఇచ్చాడు. వాగ్వాదం చాలాసేపు జరిగి ఆగిపోయే సమయానికి క్రిస్టఫర్ తలుపుతీయడంతో రాబర్ట్ మళ్లీ తిట్లపురాణం మొదలెట్టాడు. వీరావేశంతో ఉన్న గురకమహాశయుడు వెంటనే కత్తితో రాబర్ట్ గుండెలపై పలుమార్లు పొడిచి చంపాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

డబ్బుల కోసం బామ్మను చంపేశాడు

న్యూఢిల్లీ: జల్సాగా తిరగాలనే కోరికతో ఓ 15 ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్నేహితుడి సాయంతో ఎవరికీ అనుమానం రాకుండా బామ్మను చంపేసి, ఆమె దగ్గరున్న డబ్బులు ఎత్తుకుపోయాడు. ఈ ఘటన ఢిల్లీలోని షహదారా ఏరియాలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. జీటీబీ ఎన్‌క్లేవ్‌లోని ఓ ఇంట్లో వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. పక్క వీధిలోనే వారి కుమారుడి కుటుంబం ఉంటోంది. గురువారం మధ్యాహ్నం వృద్ధురాలు(77) ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో తొమ్మిదో తరగతి చదివే ఆమె మనవడు స్నేహితుడితో వారింటికి కలిసి వచ్చాడు. ఆ సమయంలో బామ్మ నిద్రిస్తుండటం గమనించి, దుప్పటితో ఆమెను ఊపిరాడకుండా గట్టిగా అదిమారు. ఆపైన పదునైన వస్తువుతో నుదుటిపై గట్టిగా కొట్టడంతో ఆమె చనిపోయింది. అనంతరం బాలురిద్దరూ బీరువాలో ఉన్న రూ.14 వేలను తస్కరించి వెళ్లిపోయారు. కొద్దిసేపయ్యాక ఇంటికి చేరుకున్న వృద్ధుడు.. భార్య నిద్రలోనే చనిపోయిందని భావించి, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి వృద్ధురాలి నుదుడి గాయం ఉన్న విషయాన్ని గుర్తించారు. బీరువా లాకర్‌లో డబ్బు మాయమైన విషయాన్ని తెలుసుకున్న వృద్ధుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం మనవడిని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది.

స్వతంత్ర పాలస్తీనాకు నెతన్యాహు నో

టెల్ అవీవ్: గాజాలో యుద్ధం ముగిశాక స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు చేయాలన్న అగ్ర రాజ్యం అమెరికా ప్రతిపాదనను తిరస్కరించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హమాస్ నిర్మూలన, బందీల విడుదలతో సంపూర్ణ విజయం లభించేదాకా గాజాలో యుద్ధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు మరికొన్ని నెలలు పడుతుందని చెప్పారు. గాజాలోని 25 వేల మంది ప్రజలు మృత్యువాత, 85% మంది ప్రజలు వలసబాట పట్టిన నేపథ్యంలో యుద్ధం విరమించుకునేలా చర్చలు జరపాలంటూ ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా సహా పలు దేశాలు 'రెండు దేశాల'విధానాన్ని పునరుద్ధరించాలంటూ కోరుతున్నాయి. అయితే, నెతన్యాహు తాజా ప్రకటనతో యుద్ధం విషయంలో ఇజ్రాయెల్ నిర్ణయంలో మార్పులేదని స్పష్టమైంది. నెతన్యాహు వ్యాఖ్యలపై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు ప్రతినిధి జాన్ కిర్బీ స్పందిస్తూ.. ఇజ్రాయెల్, అమెరికాలు ఒకే అంశంపై భిన్నంగా ఆలోచించడం సహజమేనన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్‌ల ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్ సహా నాలుగు జిల్లాల్లో సీఐడీ బృందాల తనిఖీలు
- కీలక నిందితుడు సత్తార్ సహా 12 మందిని అరెస్టు చేసిన సీఐడీ
- అరెస్టయిన వారిలో నిందితులకు సహకరించిన ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ అధికారులు
- ఫేక్ డాక్యుమెంట్లతో వందకు పైగా పాస్‌పోర్టులు జారీ చేయించినట్టు గుర్తింపు
- 108 పాస్‌పోర్టులు, 15 మొబైల్ ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం
- సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్ వెల్లడి


చాంద్ ఖాన్


అశోక్‌రావు


ఖమ్రుద్దీన్

సాక్షి, హైదరాబాద్, సాక్షిప్రతినిధి, కరీంనగర్: నివాస ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు ఇలా అన్నింటినీ నకిలీవి సృష్టించి విదేశీయులకు స్థానికంగా పాస్‌పోర్టులు జారీ చేయిస్తున్న ఓ ముఠా గుట్టురట్టు చేశారు తెలంగాణ సీఐడీ పోలీసులు. ఈ మొత్తం ముఠాలో కీలక నిందితుడు అబ్దుస్ సత్తార్ ఉస్మాన్ అల్ జవ్హారీతో పాటు నకిలీ పాస్‌పోర్టుల జారీకి పనిచేస్తున్న తొమ్మిది మంది ముఠా సభ్యులు, వీరికి సహకరిస్తున్న ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ అధికారులు.. మొత్తం 12మందిని శుక్రవారం అరెస్టు చేశారు. విదేశాల నుంచి వచ్చిన శరణార్థులు, అక్రమ చొరబాటు దారులకు నిబంధనలకు విరుద్ధంగా పాస్‌పోర్టులు జారీ అవుతున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణ సీఐడీ రంగంలోకి దిగింది. హైదరాబాద్, జగిత్యాల, కోరుట్ల, నిజామాబాద్, కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో సీఐడీ అధికారుల 12 ప్రత్యేక బృందాలు ఈనెల 18న ఏక కాలంలో సోదాలు జరిపాయి. ఈ సోదాల్లో 108 పాస్‌పోర్టులు, 15 మొబైల్ ఫోన్లు, ఐదు ల్యాప్‌టాప్‌లు, మూడు ప్రింటర్లు, 11 పెన్‌డ్రైవ్‌లు, ఒక స్కానర్, పాస్‌పోర్టు దరఖాస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ ఎకనమిక్ అఫెన్స్ వింగ్ ఎస్పీ కే వెంకట లక్ష్మి నేతృత్వంలో చేపట్టిన ఈ ఆపరేషన్ వివరాలను సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నకిలీ పత్రాల తయారీ నుంచి పాస్‌పోర్టుల వరకు

హైదరాబాద్‌కు చెందిన అబ్దుస్ సత్తార్ స్థానికంగా గ్రాఫిక్ డిజైనింగ్, ప్రింటింగ్ వర్క్‌లో పనిచేసేవాడు. 2011నుంచి ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టించడం ప్రారంభించాడు. చెన్నైకి చెందిన ఓ పాస్‌పోర్టు బ్రోకర్‌తో టచ్‌లోకి వెళ్లిన సత్తార్..రూ.75 వేల కమీషన్‌కు ఒక్కో పాస్‌పోర్టు జారీ చేసేలా.. ఇందుకు అవసరమైన నకిలీ పత్రాలు కూడా సృష్టించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుగా నకిలీ ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన తర్వాత సత్తార్ హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో స్లాట్‌లు బుక్ చేయించి ఇక్కడి నుంచి పాస్‌పోర్టులు జారీ చేయించేవాడు. పోలీస్ వెరిఫికేషన్‌కు వచ్చే స్పెషల్ బ్రాంచ్ అధికారులకు సైతం లంచాలు ఇస్తూ ఈ దందా కొనసాగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు కీలక నిందితులతోపాటు ఈ ముఠాలో చెన్నై ఏజెంట్‌ను సైతం బెంగళూరులో అరెస్టు చేసి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఈ ముఠా నుంచి పాస్‌పోర్టులు పొందిన వారిలో 92 మంది విదేశీ ప్రయాణాలు చేసినట్టు సీఐడీ అధికారుల దర్యాప్తులో తెలిసింది. మొత్తం 12 మంది నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు వారు పేర్కొన్నారు.

స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు లంచాల ఎర!

నకిలీ పాస్‌పోర్టుల కుంభకోణంలో సీఐడీ అధికారులు తవ్విన కొద్దీ విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన ఈ ముఠా.. కేవలం నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను సంపాదించడమే కాకుండా.. విదేశీయులు, దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు కూడా భారతీయత ఉండేలా తప్పుడు ఐడీలు సృష్టించి, పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి సాగనంపారని తెలుస్తోంది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సైతం లంచాలిచ్చి భారతీయులు కాని వారికి సైతం ఇక్కడి జనన, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి విదేశాలకు విమానాలెక్కించారని విచారణలో తెలిసింది. చాలా పాస్‌పోర్టులకు ఒకే ఆధార్ కార్డు ఉండటం, కస్టమర్లందరికీ ఏజెంట్లు తమ ఫోన్‌నెంబరునే అటాచ్ చేసి ఉంచడంతో అనుమానం వచ్చిన పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా సోదాలు చేపట్టడంతో ముఠా గుట్టు బయటపడింది.

అరెస్టు అయింది వీరే!

అబ్దుస్ సత్తార్ ఉస్మాన్ అల్ జవహరీ నాంపల్లి.. హైదరాబాద్, మహ్మద్ ఖమ్రుద్దీన్ కోరుట్ల, చాంద్ ఖాన్ కోరుట్ల, దేశోపంతుల అశోక్ రావు కోరుట్ల, పెద్దూరి శ్రీనివాస్ తిమ్మాపూర్.. కరీంనగర్, గుండేటి ప్రభాకర్ జగిత్యాల, పోచంపల్లి దేవరాజ్ వేములవాడ, చెప్యాల సుభాష్ భీంగల్.. నిజామాబాద్, అబ్దుల్ షకూర్ రాయికల్.. జగిత్యాల, సయ్యద్ హాజీ (కాలాపత్తర్) తోపాటు వీరికి సహకరించిన మరో ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ అధికారులు అరెస్టయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగుల ప్రమాద బీమా మొత్తం పెంపు

సాక్షి, హైదరాబాద్: తమ ఉద్యోగులకు ప్రమాద బీమా మొత్తాన్ని రూ.40 లక్షల నుంచి రూ.1.12 కోట్లకు పెంచుతూ టీఎస్‌ఆర్టీసీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ప్రమాద బీమా పెంపుపై టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, యూబీఐ సీజీఎం అండ్ జోనల్ హెడ్ భాస్కర్ రావు శనివారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఫిబ్రవరి 1 నుంచి కొత్త బీమా అమల్లోకి వస్తుంది.

ఎలాంటి ప్రీమియం చెల్లించకుండానే: ఎండీ సజ్జనార్

ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. ఎలాంటి ప్రీమియం చెల్లింపు అవసరం లేకుండా రూ.1.12 కోట్ల వరకు ప్రమాద బీమాను పెంచడం శుభ పరిణామమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన, శాశ్వత వైకల్యానికి గురైన సిబ్బంది కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగపడు తుందని చెప్పారు. యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ కింద రోడ్డు ప్రమాదాల్లో మరణించిన 12 మంది సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.40 లక్షల చొప్పున అందజేశామని సజ్జనార్ తెలిపారు. గతంలో శాలరీ శ్లాబులతో ప్రమాద బీమా ఇచ్చేవారని, ఈ కొత్త ఒప్పందంలో శాలరీ శ్లాబులతో సంబంధం లేకుండా సిబ్బందికి రూ.ఒక కోటి ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రూపే కార్డు ఉంటే మరో రూ. 12 లక్షల బీమా అందుతుందని ఆయన వివరించారు.

సూసైడ్ నోట్‌లో మాజీ ఎమ్మెల్యే పేరు

- తన భూమిని కబ్జా చేసినా మాజీ ఎమ్మెల్యే పట్టించుకోలేదంటూ ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి


బాల్‌చంద్రం

దోమకొండ: ఆత్మహత్యకు పాల్పడ్డ ఓ వ్యక్తి సూసైడ్ నోట్‌లో కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ పేరు ఉండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పూర్వాపరాలిలా.. జిల్లాలోని దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన పుట్ట బాల్‌చంద్రం(38) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామంలోని రైతువేదిక వద్ద తనకున్న 250 గజాల స్థలాన్ని సర్పంచ్ సలీం, అతడి సోదరుడు సద్దాం కబ్జాచేశారని, ఈ విషయం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదనీ, ఆయన కనుసన్నల్లోనే తన ప్లాట్ కబ్జాకు గురైందని మృతుడు బాల్‌చంద్రం తన వాట్సాప్ లేఖలో పేర్కొన్నాడు. అదే విధంగా ఫరీద్‌పేట రోడ్డులో తమకున్న రెండెకరాల ముప్పై గుంటల భూమిని కబ్జా చేసేందుకు తమ కులస్తులు దాసరి పెద్దలు, పుట్ట శ్రీనివాస్, పుట్ట బాల్‌నర్సు, పుట్ట రమేష్ యత్నిస్తున్నారని, తాను వ్యవసాయం కూడా చేయకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నాడు. దీంతో ఏం చేయాలో తెలియక మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. తన ఆత్మహత్యకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, గ్రామ సర్పంచ్ సలీం, అతడి సోదరుడు సద్దాంతో పాటు ఆ నలుగురు కులస్తులే కారణమనే లేఖ రాసి గ్రామంలోని దాదాపు అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడు. అనంతరం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడు బాల్‌చంద్రం తండ్రి పుట్ట వెంకయ్య ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు. కాగా మృతుడు బాల్‌చంద్రం వాట్సాప్ సూసైడ్ నోట్‌లో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేరు రాయగా, పోలీసులకు బాల్‌చంద్రం తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేరు లేకపోవడం గమనార్హం.

భార్య రూ. 500 ఇవ్వలేదని ఉరేసుకున్న భర్త

- భర్త మృతిని తట్టుకోలేక వెంటనే భార్య బలవన్మరణం
- తల్లిదండ్రుల క్షణికావేశంతో ఒంటరైన కుమారుడు
- గుడివాడలో తీవ్ర విషాదం


మృతి చెందిన దంపతులు

గుడివాడ రూరల్: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం సంతోషంగా సాగిపోతున్న ఓ సంసారాన్ని ఛిన్నాభిన్నం చేసింది. తల్లిదండ్రుల ఆత్మహత్యతో తనయుడు ఒంటరిగా మిగిలాడు. ఈ విషాద ఘటన ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడులో శనివారం సాయంత్రం జరిగింది. టూరిస్ట్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొలుసు రాంబాబు(42), కనకదుర్గ(38) దంపతులు స్థానిక వాసవీనగర్‌లో నివసిస్తున్నారు. వారికి కుమారుడు గౌతమ్, కుమార్తె తనూజ ఉన్నారు. తనూజకు వివాహం అయింది. గౌతమ్ మెకానిక్‌గా పనిచేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాడు. శనివారం సాయంత్రం మద్యం తాగేందుకు రూ. 500 ఇవ్వాలని భార్యను రాంబాబు అడిగాడు. భార్య డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో దంపతుల మధ్య స్వల్ప వివాదం జరిగింది. మనస్తాపం చెందిన రాంబాబు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరి వేసుకున్నాడు. ఇది చూసి దుర్గ కుమారుడికి వెంటనే ఫోన్ చేసి చెప్పింది. హుటాహుటిన ఇంటికి వచ్చి తండ్రిని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గౌతమ్ తరలించాడు. అప్పటికే రాంబాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. భర్త చనిపోవడాన్ని జీర్ణించుకోలేని భార్య కనకదుర్గ వెంటనే తను కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన కొడుకు.. ఇంట్లో తల్లి కూడా మృతి చెంది కనిపించడంతో ఒక్కసారిగా హతాసుడయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కుమార్తె గోళ్ల తనూజ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎప్పుడు సరదాగా ఉండే రాంబాబు దంపతుల ఆత్మహత్య పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రులను ఒకేసారి కోల్పోయిన కుమారుడిని ఓదార్చడం అక్కడున్న వారి వల్ల కాలేదు.

క్లుప్తంగా...

ఏపీలో 21.27 లక్షల కుటుంబాల కులగణన పూర్తి

45.30 లక్షల మంది వివరాల నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కులగణన ప్రక్రియ రెండో రోజూ చురుగ్గా కొనసాగింది. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ఉమ్మడిగా వారి పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై వివరాలు సేకరించారు. శనివారం రాత్రి 8 గంటల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా 21,27,158 కుటుంబాలకు సంబంధించి 45.30 లక్షల మంది వివరాలు నమోదు పూర్తయినట్లు గ్రామ వార్డు సచివాలయ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ వార్డు సచివాలయాలు ఉండగా.. 14,803 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటికే ఈ కార్యక్రమం మొదలైనట్టు వివరించారు. కాగా, పూర్తి ఆన్‌లైన్ విధానంలో మొబైల్ యాప్ ద్వారా ఈ కులగణన కార్యక్రమం కొనసాగుతుండగా.. గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని 515 గ్రామ సచివాలయాల పరిధిలో ఆఫ్‌లైన్ విధానంలో ఈ కులగణన ప్రక్రియను చేపడుతున్నారు. ఈ ఆఫ్‌లైన్ విధానంలో కులగణన జరుగుతున్న గ్రామ సచివాలయాల్లో అత్యధికంగా 347 అల్లూరి సీతారామరాజు జిల్లా, 72 పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో ఉన్నట్టు అధికారులు వివరించారు.

తరుగు లేకుండా ధాన్యం సేకరించినందుకు ధన్యవాదాలు

టీపీసీసీ కిసాన్ సెల్ తీర్మానం

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి టీపీసీసీ కిసాన్ సెల్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసింది. సమావేశంలో భాగంగా పలు రైతాంగ సమస్యలు చర్చించామని అన్వేశ్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి తగిన విధంగా ప్రతిపాదనలు చేయాలని కోరుతూ ఆర్థిక మంత్రి భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఏపీలో గ్రూప్-1 దరఖాస్తు గడువు పెంపు?

సాక్షి, అమరావతి: స్టేట్ సివిల్ సర్వీసెస్‌గా పేర్కొనే గ్రూప్-1 పోస్టులకు ఏపీపీఎస్సీ డిసెంబర్ 8న నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులకుఆన్‌లైన్ దరఖాస్తు గడువు నేటి (ఆదివారం)తో ముగియనుంది. అయితే, దరఖాస్తు గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్వీస్ కమిషన్‌కు భారీగా విజ్ఞప్తులు అందుతున్నాయి. ఈ క్రమంలో దరఖాస్తు గడువును పెంచే యోచనలో కమిషన్ ఉన్నట్టు తెలిసింది. దీనిపై సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవైపు గ్రూప్-2 పోస్టులకు మొత్తం 4,83,525 దరఖాస్తులు వచ్చినట్టు సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గతనెలలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో తొలుత 897 పోస్టులను ప్రకటించగా, అదనంగా మరో రెండు పోస్టులు కలిపి మొత్తం 899 పోస్టులు ఉన్నట్లు తేలింది. దరఖాస్తు గడువు ముగియడంతో తప్పులను సవరించుకునేందుకు ఈనెల 24 వరకు కమిషన్ ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. ఈ క్రమంలో అభ్యర్థులు తప్పులు సరిదిద్దుకుని, సరిచేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రకటించిన పోస్టులతో పాటు కొన్ని ప్రభుత్వ విభాగాల్లో మరిన్ని ఖాళీ ఉన్నట్టు తేలింది. ఆ పోస్టులను సైతం ఈ నోటిఫికేషన్‌కు జత చేయనున్నారు. ఇదే జరిగితే మొత్తం గ్రూప్-2 పోస్టుల సంఖ్య 1000కి పైగా చేరే అవకాశం ఉంది. ముందే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రిలిమినరీ పరీక్షను ఫిబ్రవరి 25న నిర్వహించేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది.

డాక్టర్ల చేతికి 'ఏఐ'స్కోప్!

వైద్యారోగ్య రంగంలో కీలకంగా మారుతున్న కృత్రిమ మేధ

- ఇప్పటికే రేడియాలజీ, టీబీ, కేన్సర్ల గుర్తింపు, చికిత్సల్లో వినియోగం.. ఏఐ సాయంతో వైద్య రిపోర్టుల సమగ్ర విశ్లేషణ
- వైద్యుల సమయం 40% ఆదా.. మైక్రోస్థాయిలో డేటా విశ్లేషణతో మరింత ప్రయోజనం
- ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఆరోగ్య రంగంలో ఏఐ'పై డాక్యుమెంట్‌లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మనను పరీక్షించి, ఆరోగ్య సమస్య ఏమిటో గుర్తించే డాక్టర్లకు స్టెతస్కోప్ ఎలాంటిదో.. ఇకపై కృత్రిమ మేధ (ఏఐ) కూడా అలా అరచేతిలో ఉపకరణం కాబోతోంది. రోగ నిర్ధారణ నుంచి చికిత్సల దాకా వీలైనంత తోడ్పాటు అందించనుంది. భవిష్యత్తులో వైద్యరంగంలో ఏఐ అత్యంత కీలకంగా మారుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) పేర్కొంది. ఇప్పటికే రేడియాలజీ, టీబీ, కేన్సర్ వ్యాధుల నిర్ధారణ, చికిత్సల కోసం ఏఐని వినియోగిస్తున్నట్టు గుర్తు చేసింది. ఈ మేరకు 'వైద్యారోగ్య రంగంలో కృత్రిమ మేధ వాడకం, నిర్వహణ, నైతికతపై డాక్యుమెంట్-2024'ను ఇటీవల విడుదల చేసింది. వ్యాధి నిర్ధారణ, క్రిటికల్ కేర్, క్లిష్టమైన కేసుల్లో వైద్యం చేయడంలో, వైద్య నిర్ధారణ పరీక్షలను సమీక్షించుకోవడంలో కృత్రిమ మేధ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంది. వెంటిలేటర్‌పై ఉన్న రోగులతో కూడా వారి కుటుంబ సభ్యులు ఏఐ సాయంతో మాట్లాడవచ్చని.. వారికి సంబంధించిన వైద్య నిర్ధారణ పరీక్షల నివేదికలను ఎప్పటికప్పుడు అందుకోవచ్చని తెలిపింది. వైద్యులు కేస్‌షీట్‌లో అన్ని వివరాలు రాసినా, వైద్య పరీక్షల రిపోర్టులను పరిశీలించినా.. వాటన్నింటినీ క్రోడీకరించి, అనుసంధానం చేసి చూడటం ఒకింత కష్టమని స్పష్టం చేసింది. అదే ఏఐ ద్వారా డేటా మొత్తాన్ని అనుసంధానం చేస్తే.. సరైన, కచ్చితమైన నిర్ధారణకు రావొచ్చని తెలిపింది.

డబ్ల్యూహెచ్‌ఓ నివేదికలోని ముఖ్యాంశాలివీ..

రోగుల వివరాలు అన్నింటి నమోదులో ఏఐ ఉపయోగపడుతుంది.

డాక్టర్లు, రోగులు వేర్వేరు భాషల్లో మాట్లాడితే.. ఇతర భాషల్లోకి తర్జుమా చేస్తుంది. దీంతో ప్రపంచంలో ఏ వైద్యులతోనైనా మాట్లాడవచ్చు. చికిత్స పొందవచ్చు.

రోగులు వాడిన మందులు, ప్రిస్క్రిప్షన్లు, వచ్చిన జబ్బులు, లక్షణాలు, ఇతర వివరాలను ఏఐ సాయంతో నమోదు చేసి పెట్టవచ్చు. భవిష్యత్తులో ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే.. సులువుగా వైద్యం చేయడానికి వీలవుతుంది.

వైద్య, నర్సింగ్ విద్యలో విద్యార్థుల స్థాయిని బట్టి బోధనను అందించవచ్చు. వివిధ రోగాలకు సంబంధించిన లక్షణాలను, వైద్య పరీక్షల నివేదికలను ఏఐ సాయంతో వేర్వేరుగా సృష్టించి.. ఎలాంటి పరిస్థితిలో ఏ తరహా చికిత్స ఇవ్వాలన్న శిక్షణ ఇవ్వవచ్చు.

వైద్య పరిశోధన, మందుల తయారీ కోసం చాలా డేటా అవసరం. దానికోసం తీవ్రంగా శోధించాల్సి ఉంటుంది. అదే ఏఐ ఇంటర్నెట్ నుంచి సమాచారాన్ని క్రోడీకరించి అందిస్తుంది.

వేల మంది రోగుల డేటా, వైద్య రిపోర్టులను ఏఐలో పొందుపర్చితే వాటన్నింటినీ విశ్లేషించి, రోగ నిర్ధారణలో సాయం చేయగలదు.

ఒకేసారి లక్ష మంది చెస్ట్ ఎక్స్‌రేలను పొందుపర్చినా ఏఐ వాటన్నింటినీ విశ్లేషించగలదు. డాక్టర్లకు సమయం కలసి వస్తుంది. చికిత్స సులువు అవుతుంది. స్పెషలిస్టుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం తగ్గుతుంది.

వెనుకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 2030 నాటికి కోటి మంది డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది కొరత ఏర్పడుతుందని అంచనా. కృత్రిమ మేధను వాడటం వల్ల ఉన్న సిబ్బందితోనే సమస్యను అధిగమించొచ్చు.

➤ యాక్సెంచర్ కంపెనీ నివేదిక ప్రకారం.. ఏఐని సరిగా వాడితే డాక్టర్లకు 40శాతం సమయం ఆదా చేస్తుంది. రోగులకు మరింత నాణ్యమైన సమయం కేటాయించే అవకాశం వస్తుంది.

➤ 2023లో యాక్సిడ్ అనే కంపెనీ కృత్రిమ మేధ సాయంతో ప్రొటీన్‌లో ఉండే సమాచారాన్ని నిక్షిప్తం చేయడం మొదలుపెట్టింది. ఇప్పటివరకు 60కోట్ల ప్రొటీన్ల సమాచారాన్ని సేకరించింది. ఎన్నో పరిశోధనలకు ఇది ఉపయోగపడుతుంది.

➤ యూఎస్‌కు చెందిన ఒక కంపెనీ కృత్రిమ మేధకు సంబంధించిన ఒక భాషపై మోడల్‌ను తీసుకొచ్చింది. జనవరి 2023లో అది ప్రారంభం కాగా.. రెండు నెలల్లో 10 కోట్ల మంది దాన్ని వాడారు.

క్లిష్టమైన కేసుల్లో రోగ నిర్ధారణ సులువు

అరుదైన, క్లిష్టమైన కేసుల్లో రోగ నిర్ధారణ కష్టంగా మారుతున్న నేపథ్యంలో.. కృత్రిమ మేధ దాన్ని సులువు చేస్తుంది. వైద్య ఆవిష్కరణల వేగం గత 75 ఏళ్లలో 200 రెట్లు పెరిగింది. ఆ వేగాన్ని అందుకోవాలంటే వైద్యులకు సాయం అవసరం. కృత్రిమ మేధ ఆ లోటును పూడ్చగలదు. దీనిని సమర్థవంతంగా వాడితే వైద్యంలో కచ్చితత్వం పెరుగుతుంది. అయితే ఏఐలో కొన్ని అంశాలపై అసమగ్ర సమాచారాన్ని మనం పొందుపరిస్తే.. అది తనకుతాను ఊహించుకొని 3 నుంచి 27శాతం వరకు సొంత నిర్ణయాలు ఇచ్చే అవకాశముంది. ఈ మేరకు కొంత నష్టం వాటిల్లే ప్రమాదమూ ఉంది. ఎక్కువగా టెక్నాలజీపై ఆధారపడితే డాక్టర్లలో నైపుణ్యాలు తగ్గిపోయే అవకాశం కూడా ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

– డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

ఇక లోక్‌సభ ఎన్నికల పనిలో..

- పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ
- ఇప్పటికే మంత్రులకు నియోజకవర్గాల వారీ కోఆర్డినేటర్ల బాధ్యతలు
- సామాజిక వర్గాల వారీగా సమావేశాలు
- ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్ వర్గాలతో మున్షీ భేటీలు
- ఈనెల 25న బూత్ అధ్యక్షులకు దిశానిర్దేశం చేయనున్న ఖర్గే



సామాజిక వర్గాల వారీగా వరుస సమావేశాలను నిర్వహిస్తోంది.

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టడం ద్వారా మంచి ఊపు మీద ఉన్న ఆ పార్టీ రాష్ట్రంలో కనీసం 12 పార్లమెంటు స్థానాల్లో గెలుపొందే దిశలో కార్యాచరణ రూపొందించుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే అన్ని పార్లమెంటు స్థానాలకు సమన్వయకర్తలుగా రాష్ట్ర మంత్రులకు బాధ్యతలు అప్పగించిన ఆ పార్టీ

అనుబంధ సంఘాల ఆసరాగా

లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం ప్రణాళికాబద్ధంగా కాంగ్రెస్ పార్టీ ముందుకెళుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన విజయాన్ని బట్టి కనీసం 12 స్థానాలు సులువుగా సాధించగలమనే అంచనాతో ఉన్న ఆ పార్టీ ఇప్పటికే రాష్ట్ర మంత్రులకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించింది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒకరిని ఇంచార్జిగా నియమించగా, కొన్ని చోట్ల రెండు స్థానాలకు ఒకే మంత్రికి బాధ్యతలు అప్పగించింది. లోక్‌సభ స్థానాల వారీగా పార్టీని సమన్వయం చేయడంతో పాటు ఎన్నికలు పూర్తయి ఫలితాలు వచ్చేంతవరకు ఈ సమన్వయకర్తల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు జరగనున్నాయి. ఇక, పార్టీ అనుబంధ సంఘాలను వేదికగా చేసుకుని ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలతో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమావేశాలు పూర్తి చేశారు. టీపీసీసీ ఎస్టీ సెల్ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసిన మున్షీ, ఆ తర్వాత హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల లోక్‌సభ స్థానాల పరిధిలోని ముస్లిం నేతలతో సమావేశమయ్యారు. అనంతరం సికింద్రాబాద్‌లో క్రిస్టియన్ సంఘాలతో భేటీ అయి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.


ఈనెల 25 తర్వాత సీఎం జిల్లాల పర్యటన

బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలను కదిలించేందుకు హైదరాబాద్ వేదికగా భారీ సమావేశాన్ని కాంగ్రెస్ నిర్వహించబోతోంది. ఈ నెల 25న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరై రాష్ట్రంలోని 44వేల మంది పోలింగ్ బూత్ స్థాయి అధ్యక్షులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశం అనంతరం సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రారంభమవుతుందని, ఆ తర్వాత లోక్‌సభ సమన్వయకర్తల హోదాలో రాష్ట్ర మంత్రులు కూడా తమ తమ నియోజకవర్గాలకు వెళ్లి ఎన్నికలకు సన్నద్ధమయ్యేలా కేడర్‌ను కదలిస్తారని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి.

టీడీపీలో మసకబారుతున్న 'చంద్రుడు'

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయకత్వం మసకబారుతోంది. ఇప్పటికే చంద్రబాబు సీఎంగా పనిచేసిన సమయంలో ప్రజలను వంచించిన తీరు, ఆయనలో నాయకత్వ పటిమ తగ్గడంతో ప్రజల్లో పార్టీపై నమ్మకం విపరీతంగా తగ్గిపోయింది. ఇటీవలి కాలంలో ఆయన నిర్వహిస్తున్న బహిరంగ సభలు, కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనకపోవడం, కార్యకర్తలు కూడా అంతంతమాత్రంగా ఉండటంతో ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారు. ఒంటరిగా పోటీ చేస్తే పార్టీ గల్లంతేనన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చిన చంద్రబాబు.. జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఈ పార్టీలు రెండూ దొందు దొందే కావడంతో ప్రజాదరణ కనీస మాత్రంగా కూడా లేదు. దీంతో రూపాయి ఖర్చు పెట్టినా వృథాయేనన్న ఆలోచన నాయకుల్లో వేళ్లూనుకుపోయింది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి ఎక్కడా సరైన అభ్యర్థులు దొరక్క చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారు. ఓ వైపు సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికను చకా చకా పూర్తి చేస్తుంటే.. చంద్రబాబు మాత్రం ఎటూ తేల్చుకోలేక.. నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారు. ఇది పార్టీలో ఉన్న కొద్దిమంది నాయకుల్లో కూడా అసంతృప్తిని రగిలిస్తోంది. వైఎస్సార్‌సీపీ దూకుడు చూసి త్వరలో అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేస్తామని ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. సంక్రాంతి పండుగ తర్వాత 25 మంది అభ్యర్థులతో జనసేన, టీడీపీ అభ్యర్థుల తొలి ఉమ్మడి జాబితా ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు ముందడుగు పడలేదు. ప్రస్తుతం పార్టీ ఉన్న దైన్య స్థితిలో అది వెంటనే సాధ్యమవదని టీడీపీ నేతలే చెబుతున్నారు. బాబు నాన్చుడు ధోరణిపై టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నా ఇంకా అభ్యర్థులను తేల్చకుండా తమ నేత 'చెబుతా.. చెబుతా.. చెబుతా' అంటున్నారని, ఎప్పుడు చెబుతారని వ్యంగ్యంగా ప్రశ్నించారు. తిరగడానికి, నియోజకవర్గంలో ప్రజల్ని కలవడానికి సమయం ఉంటుందా అని ప్రశ్నించారు. జేసీ బహిరంగంగా చెప్పిన ఈ విషయాన్ని అన్నిచోట్లా నేతలు అంతర్గతంగా చర్చిస్తూనే ఉన్నారు.

- చంద్రబాబు నాయకత్వ పటిమపై నాయకులు, కేడర్‌లో తగ్గిన నమ్మకం.. జనసేనతో పొత్తు కూడా ఫలించని వైనం
- ప్రజల్లో కోల్పోయిన టీడీపీ పరపతి
- పోటీ చేసేందుకు ముందుకు రాని నేతలు
- అభ్యర్థులు దొరక్క చంద్రబాబు మల్లగుల్లాలు
- అభ్యర్థుల ఎంపికలో దూసుకుపోతున్న ఏపీ సీఎం జగన్
- జగన్ దూకుడు చూసి తొలి జాబితా ప్రకటిస్తామని డాంబికాలు
- కనీసం 25 మందితో కూడా తొలి జాబితా ఇవ్వలేక మౌనం
- బాబు సాగదీతపై ఉన్న నేతల్లోనూ అసంతృప్తి



పొత్తులతో తంటా!!

➤ మరోవైపు పొత్తులు ఉంటే గానీ వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేని దీనావస్థ కూడా చంద్రబాబును అడుగు ముందుకు వేయనీయడంలేదు. ఇప్పటికే జనసేనతో పొత్తు కుదుర్చుకున్నారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియ రెండు నెలలుగా కొలిక్కి రావడంలేదు. జనసేన 50 సీట్లు అడుగుతున్నట్లు వినికిడి. అన్ని సీట్లు ఇస్తే పార్టీలో తిరుగుబాటు వస్తుందనే భయం చంద్రబాబును వెంటాడుతోంది. మరోవైపు బీజేపీతోనూ పొత్తు కోసం పాకులాడుతున్నారు. బీజేపీతో పొత్తు కుదిరితే ఆ పార్టీకి ఏ సీట్లు కేటాయించాలనే దానిపైనా గందరగోళం నెలకొంది. బీజేపీతో పొత్తు కుదరకపోతే సీపీఐ, సీపీఎంతోనైనా పొత్తు పెట్టుకుని వెళ్లే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీతోనూ తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నారు. లోపాయికారీగా కొన్ని సీట్ల విషయంలో ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధపడ్డారు. ఇలా అన్ని పార్టీలతో పెట్టుకున్న లింకులు చంద్రబాబునే చుట్టుకొన్నాయి. దీంతో పార్టీలో ప్రస్తుతం ఉన్న నేతలకు కూడా ఎప్పుడు ఎవరి సీటు గల్లంతవుతుందన్న ఆందోళన నెలకొంది. ఈ పరిణామాలన్నీ టీడీపీలో చంద్రబాబుపై నమ్మకం తగ్గిపోయేందుకు కారణమయ్యాయి. క్రమంగా అందరూ పార్టీని వీడిపోతున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు, పార్టీ కోసం పనిచేసే నాయకులే కరువయ్యారు.

అనేక స్థానాలకు దొరకని అభ్యర్థులు..

➤ అధికారంలోకి వచ్చేస్తున్నామని ఎల్లో, సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నా, నియోజకవర్గాల్లో మాత్రం అందుకు విరుద్ధమైన వాతావరణం కనిపిస్తోంది. అనేక నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో ఇన్‌చార్జీలు కూడా లేరు. ఉన్న ఇన్‌ఛార్జిలు కూడా పోటీ చేసే పరిస్థితిలో లేరు. లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులు దొరకడమే టీడీపీకి గగనంగా మారింది. మరోపక్క ఎన్నికలు దగ్గరకు వస్తున్నకొద్దీ సీనియర్లు పార్టీకి దూరమవుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని ఉదంతమే ఇందుకు నిదర్శనం. గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కూడా టీడీపీకి దూరంగా జరిగినట్లేనని చెబుతున్నారు. ఇలా అనేక చోట్ల పార్టీకి నాయకులు దొరకని పరిస్థితి నెలకొంది.

గిరిజన విశ్వవిద్యాలయం.. వడివడిగా సన్నద్ధం!

- 2024-25 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభించేందుకు కసరత్తు
- త్వరలో ఉన్నత విద్యా మండలితో సమావేశం కానున్న అధికారులు
- హెచ్‌సీయూకు తాత్కాలికంగా నిర్వహణ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాల ప్రక్రియ, తరగతుల నిర్వహణ తదితరాలను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. విభజన చట్టంలో భాగంగా అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి గిరిజన వర్సిటీని మంజూరు చేసిన సంగతి తెలిసిందే. పదేళ్ల తర్వాత ఈ వర్సిటీ ఏర్పాటు బిల్లును పార్లమెంటులో ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం.. వర్సిటీ కార్యకలాపాల కోసం రూ. 889.07 కోట్లు కేటాయించింది. ఇటీవల కేంద్రం నుంచి ఓ కమిటీ సైతం రాష్ట్రానికి వచ్చి పరిశీలన చేపట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి పలు రకాల అనుమతులు తాజాగా మంజూరు కావడంతో వీలైనంత త్వరలో అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. రెండు విడతల్లో ఈ వర్సిటీని అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. తొలుత గ్రాడ్యుయేషన్ కోర్సులతో ప్రారంభించి మూడేళ్ల తర్వాత పోస్టుగ్రాడ్యుయేషన్, ఆపై కోర్సులు అందుబాటులోకి తేనున్నారు.

హెచ్‌సీయూకు పర్యవేక్షణ బాధ్యతలు

సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా జాకారం సమీపంలో 498 ఎకరాల భూమిని గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించింది. ప్రస్తుతం వర్సిటీ ప్రారంభ దశలో ఉండటంతో కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు సమీపంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)ను ప్రభుత్వం కేటాయించింది. దీంతో తక్షణమే కార్యకలాపాలు సాగించే వెసులుబాటు కలిగింది. ఈ క్రమంలో గిరిజన వర్సిటీ కార్యకలాపాలు సాగించడం, సలహాలు, సూచనలు ఇవ్వడం,పర్యవేక్షణ కోసం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయా (హెచ్‌సీయూ)నికి బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా హెచ్‌సీయూ నుంచి ప్రత్యేకంగా ఒక అధికారిని సైతం నియమించనుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయినట్లు సమాచారం. అతిత్వరలో సమ్మక్క-సారక్క వర్సిటీ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి అధికారులతో సమావేశమై కోర్సులు, ఇతర అకడమిక్ కార్యకలాపాలపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. 2024-25 విద్యా సంవత్సరంలో గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఈ వర్సిటీలో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చే నెలాఖరు నాటికి కోర్సులు ఖరారు చేసేలా హెచ్‌సీయూ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఏపీలో సచివాలయ వ్యవస్థ అద్భుతం

- ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రశంసనీయం
- ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయి
- సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు చాలా బాగున్నాయి
- పలు రాష్ట్రాల అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన



ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తున్న అధికారులు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): 'దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ఒక అద్భుతం. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా తమ గ్రామ పరిధిలోనే... అది కూడా ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందిస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం. మా రాష్ట్రాల్లో కూడా ఇలాంటి వ్యవస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందిస్తాం..' అని వివిధ రాష్ట్రాల అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పారు. 'హెల్తీ విలేజ్' కార్యక్రమంలో భాగంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులు, ప్రజాప్రతినిధులు మూడు బృందాలుగా ఏర్పడి శనివారం చంద్రగిరి నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రగిరి మండలంలోని తొండవాడ పంచాయతీలో ఛండీగఢ్, జమ్మూ-కశ్మీర్, పంజాబ్, హరియాణా, రాజస్తాన్, కేరళకు చెందిన 49 మంది ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, త్రిపుర, కర్ణాటక, సిక్కిం రాష్ట్రాల ప్రతినిధులు 47 మంది, చెర్లోపల్లి గ్రామంలో ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ , తెలంగాణకు చెందిన 48మంది ప్రతినిధులు పర్యటించారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్, వెల్‌నెస్ సెంటర్ ఎస్‌డబ్ల్యూపీసీ, ప్రభుత్వ పాఠశాలలు వంటి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు అన్ని రంగాల్లో రాణించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు చాలా బాగున్నాయని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని, మౌలిక సదుపాయాలతోపాటు డిజిటల్ క్లాసులు, ట్యాబుల ద్వారా విద్యాబోధన ఒక అద్భుతమని చెప్పారు. అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో ప్రతి ఏడాది నగదు జమ చేసి విద్యను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు ఆరోగ్య కేంద్రాల పనితీరు చాలా గొప్పగా ఉందని చెప్పారు.

నా జీవిత చరిత్రను యండమూరి రాస్తున్నారు

- మెగాస్టార్ చిరంజీవి వెల్లడి
- యండమూరికి లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం ప్రదానం



యండమూరికి పురస్కారం అందజేస్తున్న చిరంజీవి, జస్టిస్ శేష సాయి, యార్లగడ్డ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు


సాక్షి, విశాఖపట్నం/విజయవాడ: సమకాలీన రచయితల్లో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన యండమూరి వీరేంద్రనాథ్ తన జీవిత చరిత్ర (బయోగ్రఫీ) రాసేందుకు ఆసక్తి చూపించడం అంతులేని సంతోషాన్ని కలిగిస్తోందని సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఎన్టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాలతో పాటు లోక్‌నాయక్ ఫౌండేషన్ 20వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం సంస్థ వ్యవస్థాపకుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖలోని రుషికొండలో శనివారం నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు రూ.2 లక్షల నగదు బహుమతితో సాహిత్య పురస్కారాన్ని ముఖ్యఅతిథి చిరంజీవి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ప్రముఖ మనో వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యాటక శాఖ నిపుణుడు విల్సన్ సుధాకర్ తుల్లుమిల్లి, బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాధాకృష్ణంరాజుకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు.

ఎన్టీఆర్, ఏఎన్నార్ నుంచి ఎన్నో నేర్చుకున్నా

చిరంజీవి మాట్లాడుతూ.. యండమూరి రాసిన నవలల ఆధారంగా తీసిన చిత్రాలే తనను మెగాస్టార్‌గా చిత్రసీమలో నిలబెట్టాయన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో దైవ సమానులైన ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో కలిసి నటించిన సందర్భాలలో వారి నుంచి ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఏపీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ.. తెలుగు భాషా వ్యాప్తికి యార్లగడ్డ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

ఏపీలో రిజిస్ట్రేషన్ వ్యవస్థ బాగుంది

- దాన్ని అధ్యయనం చేస్తాం... ధరణిపై ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇస్తాం..
- కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల వ్యవస్థ చాలా బాగుందని ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ ఆ తరహా రిజిస్ట్రేషన్ల వ్యవస్థను తీసుకువస్తే ఎలా ఉంటుందన్న దానిపై అధ్యయనం చేస్తామని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ధరణి పోర్టల్ కార్యకలాపాలపై లోతైన విచారణ జరుగుతోందని, త్వరలో ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక అందజేస్తామని చెప్పారు. మొత్తం నివేదిక ఇచ్చేందుకు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దూసుకెళుతోందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థను చక్కబెట్టడానికి కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయం ఇవ్వాలని, కానీ ఓటమిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు అసత్యాలు మాట్లాడుతూ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారని విమర్శించారు. గతంలో మంత్రి హోదాలో కేటీఆర్ దావోస్ వెళ్లినప్పుడు కాకి లెక్కలు చెప్పారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి పర్యటనలో నిక్కచ్చిగా రూ.40 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించే విధంగా తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్పామని కోదండరెడ్డి వెల్లడించారు.

న్యూస్‌రీల్

శ్రద్ధతో కృషి చేస్తే మంచి ఫలితాలు: కలెక్టర్ అనుదీప్



సాక్షి, సిటీబ్యూరో: శ్రద్ధ, ఆసక్తితో కృషి చేస్తే ఏ పనిలోనైనా మంచి ఫలితాలు సాధిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం ఏసీ గార్డ్స్‌లోని హోలీమేరీ ఉన్నత పాఠశాల, సికింద్రాబాద్‌లోని కీస్ ఉన్నత పాఠశాలలో సైన్స్, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్‌లో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక, అదనపు తరగతులు నిర్వహించాలని, స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు పెట్టి రివిజన్ చేసినట్లయితే వారికి పరీక్షల భయం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఈఓ రోహిణి పాల్గొన్నారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు 'సిటీ' విద్యార్థులు



చార్మినార్: ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొనడానికి నగరంలోని సిటీ కాలేజీకి చెందిన ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్లకు అవకాశం లభించింది. ఈ మేరకు బీఎస్సీ విద్యార్థి రాజశేఖర్, బీకాం విద్యార్థి మణికంఠలకు సంబంధిత అధికారుల నుంచి ఆహ్వానం అందింది. ఎంపికైన కేడెట్లతో పాటు ఎన్‌సీసీ యూనిట్ అధికారి డాక్టర్ కృష్ణవేణిని ప్రభుత్వ సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ అభినందించారు.

అయోధ్య బాలరాముడికి ముత్యాల గజమాల





రామయ్యకు సమర్పించే ముత్యాల గజమాల, వెంకట్ దాస్‌ను సత్కారిస్తున్న మల్కా ప్రకాష్

మల్లాపూర్: నగరంలోని నాచారానికి చెందిన వెంకట్ దాస్ అనే వ్యక్తి అయోధ్య బాలరాముడికి ముత్యాల గజమాలను తయారు చేయించారు. శనివారం నాచారం హెచ్ఎంటీ నగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర్‌స్వామి దేవాలయంలో ముత్యాల గజమాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వెంకట్ దాస్ మాట్లాడుతూ.. చినజీయర్ స్వామి ఆదేశాల మేరకు అయోధ్య రామయ్యకు ముత్యాల గజమాలను తయారు చేయించినట్లు తెలిపారు. ఆదివారం అయోధ్యకు వెళ్లి బాలరాముడికి దీనిని సమర్పిస్తానన్నారు. ఈ సందర్భంగా వెంకట్ దాస్‌ను నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మల్కా ప్రకాష్ సత్కరించారు.

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు: జలమండలి ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: సీఎం క్యాంపు ఆఫీసు, దాని పరిసర ప్రాంతాలకు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి చేపట్టిన పనులను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ 1 అజ్మీరా కృష్ణ, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ పాల్గొన్నారు.



బేగంపేట విమానాశ్రయంలో విన్యాసాలను తిలకిస్తున్న సందర్శకులు

వినువీధిలో వినోదం

మూడోరోజూ మురిపించిన వైమానిక విన్యాసాలు

సనత్‌నగర్: 'వింగ్స్ ఇండియా'కు సాధారణ సందర్శకులు పోటెత్తారు. వైమానిక విన్యాసాలతో సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. 'షో' తిలకించి ఆనంద చకితులయ్యారు. భారీగా తరలివచ్చిన సందర్శకులతో బేగంపేట విమానాశ్రయం కిటకిటలాడింది. విమానాలు, హెలికాప్టర్ల వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించలేదు. రన్‌వే ఎదురుగా ఏర్పాటు చేసిన గ్రిల్స్ వద్దనే సందర్శకులను నిలిపివేశారు. గ్రిల్స్ వద్ద నుంచే విమానాలను తిలకించి మురిసిపోయారు. వాటి ముందు ఫొటోలు తీసుకుని సంబరపడ్డారు. శనివారం ఒక్కరోజే 10 వేల మందికిపైగా సందర్శకులు వచ్చినట్లు సమాచారం.

త్రివర్ణం.. ఆనందభరితం..

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీమ్, మార్క్‌జాఫ్రీస్ బృందాల వైమానిక విన్యాసాలతో సందర్శకులు సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలను తిలకించి ఆనంద పారవశ్యులయారు. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా 45 నిమిషాల చొప్పున జరిగిన వైమానిక విన్యాసాలను కనులారా వీక్షించారు. నింగి వైపు త్రివర్ణంలో పొగలు చిమ్ముకుంటూ విభిన్న ఆకృతులను ఆవిష్కరించిన తీరు సందర్శకులను కట్టిపడేసింది. సందర్శకుల కరతాళ ధ్వనులతో విమానాశ్రయ ప్రాంగణం మార్మోగింది. వైమానిక విన్యాసాలు చేసిన పైలట్లతో కలిసి ఫొటోలు దిగేందుకు ఉత్సాహం కనబరిచారు.

వింగ్స్ ఇండియా ఏర్పాటు చేసిన స్టాళ్లు శనివారం సందర్శకులతో కిక్కిరిశాయి. విమానయాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి నెలకొంది.

తిను బండారాల ధరలు ఆకాశంలో..

ఏవియేషన్ షోలో తిరిగి తిరిగి.. కూల్‌డ్రింక్స్‌తో సేదదీరుదామనుకుంటే ధరలు చుక్కల్లో కనిపించాయి. చాయ్ తాగాలంటే రూ.40 పెట్టాల్సిందే. ప్లెయిన్ దోశ రూ.150, మసాలా దోశ రూ.180, ఇడ్లీ సాంబార్ రూ.160, పావ్‌బాజీ రూ.180, వెజ్ పిజ్జా రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక జ్యూస్ తాగాలంటే అక్షరాలా రూ.200 వెచ్చించాల్సిందే. ఈ క్రమంలో గత్యంతరం లేక ఇక్కడి ఫుడ్‌కోర్టులను ఆశ్రయించి వారు అడిగినంత ఇచ్చుకుని దప్పిక, ఆకలి తీర్చుకున్నారు.

నేడు మూడుసార్లు విన్యాసాలు..

శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు సార్లు మాత్రమే వైమానిక విన్యాసాలు జరుగుతూ వచ్చాయి. ఆదివారం సెలవు దినం కావడంతో మూడుసార్లు ఏరోబాటిక్స్ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 11–11.45 వరకు, మధ్యాహ్నం 3–3.45 వరకు, సాయంత్రం 5.45 వరకు.. మూడు పర్యాయాలు సందర్శకులు గాలిలో స్టంట్లను తిలకించవచ్చు. ఎంట్రీ పాస్‌లను బుక్ మై షోలో గానీ, నేరుగా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద గానీ తీసుకునే అవకాశం కల్పించారు.



శివమణి సంగీతం.. శ్రవణానందం

వింగ్స్ ఇండియా–2024 వేదికగా ప్రముఖ పెర్క్యూషనిస్ట్ పద్మశ్రీ శివమణి లైవ్ ప్రదర్శన వీక్షకులకు వీనుల విందు చేసింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అయిన 'కలంకారి' విమానంలో నుంచి వీక్షకుల ముందుకు వస్తూనే తన సంగీతంతో మంత్రముగ్ధులను చేశారు. చేతిలో సూట్‌కేస్ ఆకృతిలో ఉన్న వాద్యాన్ని మనోరంజకంగా ప్లే చేస్తూ అభిమానులకు ఎంట్రీ ఇచ్చారు. ఆఖరికి ఎయిర్ ఇండియా మెట్లను కూడా తన సంగీత సాధనంగా చేసుకుని సందర్శకులకు శ్రవణానందాన్ని పంచారు. అనంతరం 45 పెర్క్యూషన్ వాద్యాలతో దేశ సాంస్కృతిక, సంగీత వైవిధ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఉర్రూతలూగించారు.

విన్యాసాలు అద్భుతం..



వైమానిక విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ముఖ్యంగా గాలిలో చేసిన స్టంట్లు ఎంతో థ్రిల్ అనిపించాయి. తరచూ చూసే విమానాలే అయినప్పటికీ దగ్గర నుంచి చూడడం ఒక మధురానుభూతి. ఇంటి దగ్గర నుంచి ఫుడ్ తెచ్చుకుందామంటే అనుమతించరని అన్నారు. ఇక్కడ చూస్తే ధరలు ఎక్కువగా ఉండడం బాధాకరం. – ఆకృతి, నగర వాసి

విజ్ఞానాన్ని పంచేలా స్టాళ్లు..



విమానాల దగ్గరకు అనుమతించకపోవడం పిల్లలకు నిరాశను కలిగించింది. వైమానిక విన్యాసాలు మాత్రం సూపర్. ఎంజాయ్ చేశాం. ఎగ్జిబిషన్‌లో ఏవియేషన్ రంగంలో వచ్చిన ఆధునిక మార్పులపై ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. – పూర్ణ, కరీంనగర్

స్టంట్‌లు.. ఒళ్లు గగుర్పొడిచేలా



వైమానిక విన్యాసాలు మధురానుభూతిని కలిగించాయి. ఒక్కోసారి పడిపోతుందేమోనని, అంతలోనే ఒక్కసారిగా మళ్లీ గాలిలో దూసుకుపోవడం.. ఒకదానికొకటి ఎదురెదురుగా వచ్చి ఢీకొంటున్నాయా? అన్నట్లుగా విన్యాసాలు సాగాయి. – తరుణ్, నగర వాసి

అక్కడిదాకా అనుమతిస్తే బాగుండేది..



విమానాల వద్దకు అనుమతిస్తే బాగుండేది. ఎంతోమంది, ముఖ్యంగా పిల్లలు ఎంతో ఆశగా వాటిలోకి ఎక్కి సరదాగా ఫొటోలు దిగాలనే ఉత్సాహంతో ఏవియేషన్ షోకు వచ్చారు. మొదటి రెండు రోజులు విమానాల్లోకి ఎక్కించి తీరా సామాన్య ప్రజలకు ఆ అవకాశాన్ని ఇవ్వకపోవడం బాధాకరం. – కృష్ణ, నగర వాసి

ఎన్నో విషయాలు తెలిశాయి..



ఏవియేషన్ రంగంలో వచ్చిన మార్పులు అద్భుతం. ముఖ్యంగా డ్రోన్ల పరిజ్ఞానం ఏ విధంగా అప్‌డేట్ అయ్యిందో ఇక్కడి స్టాల్స్‌ను చూస్తే అర్థమవుతుంది. భవిష్యత్ అంతా డ్రోన్ల యుగమే. ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. – కీర్తన, నగర వాసి

లే అవుట్ డౌటే!

హెచ్ఎండీఏలో నిలిచిన భూసేకరణ

- గతంలో ఔటర్‌కు నలువైపులా ప్రణాళికలు
- రైతుల నుంచి సేకరించి అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రభుత్వం మారడంతో స్తంభించిన పనులు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో భూసేకరణ నిలిచిపోయింది. ఔటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూములను సేకరించి లే అవుట్‌లను అభివృద్ధి చేసేందుకు గతంలో ప్రణాళికలను రూపొందించారు. పలు చోట్ల రైతుల నుంచి భూసేకరణ కూడా చేపట్టారు. లేమూరు, ఇనుముల్‌నర్వ వంటి చోట్ల లే అవుట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు కూడా చేపట్టారు. నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా లే అవుట్‌లను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ.. ప్రభుత్వం మారడంతో భూసేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. భూ సేకరణపై కొత్త సర్కారు సమీక్షించి నిర్ణయం తీసుకొంటే తప్ప ముందుకెళ్లడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు.



వెయ్యి ఎకరాల సేకరణకు ప్రణాళికలు..

- కోకాపేట్, మోకిలా, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ సొంత స్థలాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో అదే పద్ధతిలో మరిన్ని భూములను అభివృద్ధి చేయాలని భావించారు. ఔటర్‌కు అన్ని వైపులా సుమారు 1000 ఎకరాల వరకు సేకరించి అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఉప్పల్ భగాయత్‌లో మూడుసార్లు నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కూడా కొనుగోలుదారుల నుంచి స్పందన లభించింది. అన్ని చోట్లా అంచనాలకు మించి ఆదాయం లభించింది. దీంతో హెచ్ఎండీఏ ఎక్కడ భూమి లభిస్తే అక్కడ లే అవుట్‌ను అభివృద్ధి చేసేందుకు రంగంలోకి దిగింది. ఈ మేరకు ఉప్పల్ భగాయత్ తరహాలో ప్రతాపసింగారంలో భారీ లే అవుట్‌కు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సుమారు 250 ఎకరాలను హెచ్ఎండీఏకు అప్పగించేందుకు రైతులు సైతం సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులకు, హెచ్ఎండీఏకు మధ్య ఒప్పందం ఏర్పాటు చేసుకోవాల్సిన తరుణంలో ఎన్నికల దృష్ట్యా ఈ ప్రక్రియ నిలిచిపోయింది.
- కీసర సమీపంలోని బోగారంలోనూ మరో 170 ఎకరాలు లే అవుట్‌కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ భూములు నిరుపయోగంగా ఉన్నాయి. రెండు దఫాలుగా రైతులతో చర్చలు జరిపారు. మరోసారి చర్చించి ఒప్పందం చేసుకోవాల్సిన తరుణంలో అసెంబ్లీ ఎన్నికలొచ్చేశాయి. ప్రతాపసింగారం, బోగారంలతో పాటు కుర్మల్‌గూడ, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నర్వ, కొత్రెముల, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న సుమారు వెయ్యి ఎకరాల భూములను గుర్తించారు. ఇప్పటికే ఇన్ముల్‌నర్వలోని 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాలను సేకరించారు. కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 924 ఎకరాలకు పైగా భూములను గుర్తించగా, ఈ భూముల సేకరణ పూర్తయ్యేనాటికి మరికొంతమంది రైతులు ముందుకు వచ్చే వచ్చే అవకాశం ఉందని అప్పట్లో అధికారులు అంచనాలు వేశారు. కానీ ప్రభుత్వ మార్పుతో ఈ కార్యక్రమం నిలిచిపోయింది.

తూర్పు వైపు విస్తరణపై దృష్టి..

- ఇటీవల కాలంలో పడమటి వైపున రియల్టర్లు, బిల్డర్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. ఐటీ సంస్థలు,పలు అంతర్జాతీయ సంస్థలు పడమటి వైపే విస్తరించుకొని ఉండడం, హైరైజ్ భవనాల నిర్మాణానికి అనుమతులు లభించడంతో కొనుగోలుదారులు సైతం ఇటు వైపు ఆసక్తి చూపుతున్నారు. కోకాపేట్ చుట్టుపక్కల ప్రాంతాల తర్వాత బుద్వేల్ హాట్‌కేక్‌గా మారింది. ఇప్పటికే ఈ రెండు చోట్ల విక్రయాలు పూర్తి కావడంతో హెచ్ఎండీఏ తూర్పు వైపున దృష్టి సారించింది. గతంలో మేడిపల్లి, బోడుప్పల్, తొర్రూరు తదితర ప్రాంతాల్లో స్థలాలను విక్రయించారు.
- సొంత ఇళ్ల నిర్మాణానికి ఈ లేఅవుట్‌లు అనుకూలంగా ఉండడంతో మధ్యతరగతి వర్గాలు, ఎన్నారైలు ఎక్కువగా కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే మరోసారి తూర్పు వైపున కొనుగోలుదారులను ఆకట్టుకొనేందుకు భారీ లేఅవుట్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిరుపయోగంగా ఉన్న భూములను సేకరించి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పార్కులు తదితర సదుపాయాలతో నివాసయోగ్యమైన వెంచర్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేసిన తర్వాత 60 శాతం భూములను తిరిగి వారికే అప్పగిస్తారు. 40 శాతం భూమిని హెచ్ఎండీఏ తీసుకుంటుంది. 'భూ సేకరణ తిరిగి మొదటికొచ్చింది. ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే తప్ప తిరిగి చేపట్టడం సాధ్యం కాదు' అని ఒక అధికారి చెప్పారు.

హెచ్ఎండీఏ భూములకు జియో ట్యాగింగ్

హెచ్ఎండీఏ భూములకు త్వరలో జియో ట్యాగింగ్ చేయనున్నారు. ఇందుకోసం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి తదితర జిల్లాల్లో హెచ్ఎండీఏకు ఉన్న భూములపై అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఆ లెక్క తేలిన వెంటనే జియో ట్యాగింగ్‌కు శ్రీకారం చుడతారు. ఇదే జరిగితే ఆన్‌లైన్‌లో నిరంతరం భూములను పర్యవేక్షించేందుకు ఆస్కారం ఉంటుంది. ఎక్కడ ఎలాంటి అక్రమ కట్టడాలు వెలసినా, కబ్జాలకు పాల్పడినట్టు నిర్ధారణ అయిన వెంటనే హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం రంగంలోకి దిగుతుంది. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, తదితర విభాగాల సాయంతో భూముల రక్షణకు చర్యలు చేపడుతుంది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో వేలాది ఎకరాలకు పైగా భూములు ఉన్నట్టు అంచనా. అయితే కొంతకాలంగా ఈ భూముల రక్షణ పెద్ద సవాల్‌గా మారింది. ఒక్క జవహర్‌నగర్‌లోనే దాదాపు 1500 ఎకరాలు అన్యాక్రాంతమైనట్టు అంచనా. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక చోట్ల హెచ్ఎండీఏ భూములు అదృశ్యమయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు గతంలో హెచ్ఎంటీ ప్రాంతంలో ఉన్న వంద ఎకరాలకు పైగా భూమికి రక్షణ చర్యలు చేపట్టారు. కాగా.. శంషాబాద్‌లో అన్యాక్రాంతమైన భూముల కోసం హెచ్ఎండీఏ పెద్దఎత్తున న్యాయ పోరాటం చేయాల్సివచ్చింది. ఇటీవల ఆ భూములపై సుప్రీంకోర్టులోనూ హెచ్ఎండీఏకు అనుకూలంగా తీర్పు వెలువడిన సంగతి తెలిసిందే. ఇలా సొంత స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకే తాజాగా జియో ట్యాగింగ్ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.



అక్షరాలా అలరించిన 'జై శ్రీరామ్'

అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని శనివారం బోడుప్పల్ హేమానగర్ ఎస్‌ఆర్‌డీజీ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన 'జై శ్రీరామ్' అక్షరాల ఆకారం విశేషంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. శ్రీరాముని నామస్మరణతో హోరెత్తించారు. జోనల్ ఇన్‌చార్జి సుమలత, పాఠశాల ప్రిన్సిపాల్ వి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఫలించిన 5 శతాబ్దాల నిరీక్షణ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి

చార్మినార్: అయోధ్యలో భవ్య రామ మందిరం కోసం అయిదు వందల ఏళ్ల నిరీక్షణకు తెరపడటంతో కోట్లాది మంది భక్తులు చాలా ఆనందంగా ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అన్నారు. శనివారం ఉదయం బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంతో కలిసి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని ఆమె సందర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ట్రస్టీ శశికళ, బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర, చార్మినార్ బీజేపీ ఇన్‌చార్జి సురేందర్, గోల్కొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిత్య పారేఖ్, ప్రవీణ్ బాగ్డీ తదితరులు కావ్యారెడ్డి వెంట ఉన్నారు.



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న కావ్యారెడ్డి తదితరులు

రికార్డు బ్రేక్.. మన టార్గెట్

- కాంగ్రెస్ హామీలు బూటకమని ప్రజల్లోకి తీసుకెళదాం
- అధికారం లేదని నిరాశ చెందొద్దు.. మనదే విజయం
- నగర పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలుద్దాం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించిన స్ఫూర్తితో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ సికింద్రాబాద్ ఎంపీని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో జరిగిన హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశంలో ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదుగురు సభ్యులతో మాట్లాడిన కేటీఆర్ పార్టీ పరిస్థితి తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మన పార్టీ ఎమ్మెల్యేలే గెలిచారు. వారందరికీ రెండు లక్షలకుపైగా మెజార్టీ ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లోనూ సులభంగానే గెలిచే అవకాశాలున్నాయి. ఇప్పటివరకున్న రికార్డుల్ని బ్రేక్ చేసేందుకు మరింత కష్టపడాలి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో లేమని నిరాశ చెందవద్దు. పక్క పార్టీ వాళ్ల ప్రలోభాలకు లొంగవద్దు. రాజీలేని పోరాటంతో విజయం సాధిస్తాం. మళ్లీ గెలుపు మనదే. అవసరమైతే హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలోనూ గెలిచేలా తయారు కావాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీతో అయ్యేదేమీ లేదని, మళ్లీ పోరాట పటిమతో మన సత్తా చాటాలన్నారు.

ప్రజలు పోరాడేలా చేయండి

కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు సాధ్యం కాదని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, అమలు చేయకపోతే తిరగబడేలా చైతన్యం తేవాలని కేటీఆర్ సూచించారు. అభయహస్తం కింద దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ఒక కుటుంబంలో ఒకరికంటే ఎక్కువమంది పెన్షన్‌కు అర్హులుంటే ఎంతమందికి వర్తింపజేస్తారో పరిశీలించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికమని చెబుతున్నప్పటికీ, రేషన్‌కార్డులు లేని వారికి ఎప్పటిలోగా ఇస్తారో ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. వాటితోపాటు ప్రజల నుంచి అందిన ఇతర ఫిర్యాదులనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని, ఈ ప్రక్రియలన్నీ ముగిసి ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు ఎంత సమయం పడుతుందో తెలియదని చెబుతూ వీటన్నింటినీ ప్రజల్లోకి ముమ్మరంగా తీసుకెళ్లి వారు పోరాడేలా చేయాలని చెప్పారు. సమీక్ష సమావేశాలను తేలికగా తీసుకోవడం మంచిది కాదని, భద్రాచలం నుంచి వచ్చిన నేతలు సమావేశం ఆసాంతం ఉండగా.. నగర నాయకులు మాత్రం మాట్లాడి వెళ్లిపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎందుకు ఓడామంటారు?

మనం ఎన్నో కార్యక్రమాలు చేసినా రాష్ట్రంలో ఎందుకు ఓడామనుకుంటున్నారో చెప్పాల్సిందిగా కేటీఆర్ కోరారు. నగరంలో తగిన ప్రచారం చేసినందున గెలిచామని, ఇతర ప్రాంతాల్లో తగిన ప్రచారం చేయలేదని కొందరు చెప్పారు. పనుల్లో నిమగ్నమై ప్రచారంపై దృష్టి సారించనందున ఓడిపోయినట్లు మరికొందరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

సమసిపోని విభేదాలు

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్ మధ్య విభేదాలు ఈ సమావేశం సందర్భంగానూ మరోసారి వెల్లడైనట్లు సమాచారం.

బతికుండగానే సంచిలో కుక్కారు!

- పోలీసులకు సవాల్‌గా మారిన ఆదిభట్ల హత్య కేసు
- ఊపిరాడకే వ్యక్తి మరణించినట్లు ప్రాథమిక నిర్ధారణ
- శరీరంలో లభించని విష ప్రయోగం ఆనవాళ్లు, గాయాలు
- సాంకేతిక ఆధారాలతోనే కేసు దర్యాప్తు
- హతుడిని గుర్తించేందుకు రాష్ట్రంలోని అదృశ్య కేసులన్నీ జల్లెడ
- 12 లక్షల వాహనాలు, లక్షల కొద్దీ కాల్ డేటా విశ్లేషణ



సాక్షి, సిటీబ్యూరో: ఆదిభట్ల ఠాణా పరిధిలో జరిగిన హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హతుడు బతికుండగానే నోటికి ప్లాస్టర్ వేసి, కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి బలవంతంగా గోనె సంచిలో కుక్కారని, గాలి కూడా చొరబడకుండా మూట గట్టిగా కట్టేయడంతో లోపల ఊపిరాడక మరణించి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 16న బొంగుళూరు టోల్‌గేట్ నుంచి 1.5 కి.మీల దూరంలో బ్రాహ్మణపల్లి సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే.

తెలిసిన వాళ్ల పనే..

హత్య అనంతరం మృతదేహాన్ని ఎక్కడ పారేయాలో కూడా దుండగులు ముందుగానే ప్లాన్ చేశారని, ఈ క్రమంలోనే సంక్రాంతి సెలవుల్లో జాతీయ రహదారులలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఎవరూ గుర్తించలేరని నిందితులు భావించి ఉంటారని పోలీసులు పేర్కొన్నారు. హతుడికి తెలిసిన వాళ్లే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సంచిలో మూటకట్టిన మృతదేహాన్ని తీసుకొచ్చి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో పడేసి ఉంటారని వివరించారు. అయితే ఆ ప్రాంతంలో ఎలాంటి వాహన టైర్ల గుర్తులు లభించలేదని, రోడ్డు పైన ఎర్రటి మరకలు ఉండడంతో రక్తం కావచ్చని అనుమానించి..నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని చెప్పారు.

సాంకేతిక ఆధారాలతోనే ముందుకు..

హతుడి ఎవరనేది తేలితేనే కేసు దర్యాప్తు సులువవుతుందని భావించిన పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన వందలాది అదృశ్యం కేసుల వివరాలను సేకరించారు. ఘటనాస్థలంలో మృతదేహంపై లభ్యమైన వస్తువులు, హతుడి వయసు, పోలికలతో యువకుల అదృశ్యం కేసుల వివరాలను పోలుస్తున్నారు. ఘటనాస్థలం, పరిసర ప్రాంతాలలో ఎలాంటి సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో పాటు మృతదేహంపై ఎలాంటి కత్తిపోట్లు, గాయాలను పోలీసులు గుర్తించలేదు. శరీరంలో విష ప్రయోగం ఆనవాళ్లు సైతం ఫోరెన్సిక్ పరీక్షలలో వెల్లడికాలేదు. దీంతో కేసు దర్యాప్తు పూర్తిగా సాంకేతిక ఆధారాల పైనే ఆధారపడి ఉందని ఓ పోలీసు అధికారి తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి హత్య ఈనెల 8–10 తేదీలలో జరిగి ఉండొచ్చని, దీంతో ఆయా తేదీలలో ఓఆర్‌ఆర్ మీద ప్రయాణించిన సుమారు 12 లక్షల వాహనాలను, లక్షల కొద్దీ ఫోన్ కాల్స్‌ను జల్లెడ పడుతున్నామని తెలిపారు. లక్షల్లో ఉన్న డేటా వందల్లోకి వస్తేనే దర్యాప్తు కొలిక్కి వస్తుందని చెప్పారు.

6ఈ నెట్‌వర్క్‌లోకి హైదరాబాద్

- ఇండిగో 'మై సిటీ మై హెరిటేజ్' వాక్
- ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బర్స్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన పర్యాటక కేంద్రంగా కలకాలం నిలిచిపోయే ఆర్కిటెక్చర్, సాంస్కృతిక, సాంకేతిక విలువలున్న అద్భుత ప్రదేశం హైదరాబాద్ నగరమని విమానయాన సంస్థ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బర్స్ అన్నారు. ఇండిగో ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరాన్ని 54 దేశీయ, 13 అంతర్జాతీయ గమ్యస్థానాలకు విస్తృతమైన 6ఈ నెట్‌వర్క్‌లో కలుపుతున్నట్లు తెలిపారు. శనివారం నగరం వేదికగా ఇండిగో సీఎస్‌ఆర్ విభాగమైన ఇండిగోరీచ్, ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ దాతృత్వ విభాగమైన ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదవ హెరిటేజ్ వాక్ నిర్వహించాయి. 'మై సిటీ మై హెరిటేజ్' ప్రచారంతో చేపట్టిన ఈ వాక్ ప్రయాగ్‌రాజ్, భువనేశ్వర్, షిల్లాంగ్, నాసిక్‌లలో నిర్వహించామని, ప్రస్తుతం నగరంలోని ప్రతిష్ఠాత్మక కుతుబ్ షాహీ సమాధుల సముదాయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్‌లోని మహమ్మద్ కుతుబ్ షా సమాధి పరిరక్షణకు ఇండిగోరీచ్ మద్దతునిచ్చిందని, ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సహకారంతో తదుపరి దశ పరిరక్షణ పని చేపడుతుందన్నారు. ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ రోహిణి భాటియా మాట్లాడుతూ భారత్‌లో వారసత్వ సంపద పరిరక్షణకే సిటీ మై హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నామన్నారు.

నటుడు నరేష్‌కు ఇట్మా ఫిలిం స్వర్ణోత్సవ అవార్డు

బంజారాహిల్స్: తెలుగు సినిమాకు ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న నటుడు వీకే నరేశ్‌ను ఇట్మా ఫిలిం సంస్థ స్వర్ణోత్సవ అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు శనివారం ఫిలిం చాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు, చాంబర్ కార్యదర్శి కె.ఎల్.దామోదర ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, సంస్థ అధ్యక్షుడు కె.ధర్మారావు, నిర్మాత రామసత్యనారాయణ, ఎస్.ప్రసాద్, మాణిక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బెదిరించిన వ్యక్తి గుర్తింపు

హిమాయత్‌నగర్: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చంపుతామంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్న వ్యక్తిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. గతంలో ఆగంతకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజాసింగ్‌కు విదేశాల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని గుర్తించామని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు. చాంద్రాయణగుట్టకు చెందిన మమ్మద్ ఖాసిం కువైట్ నుంచి ఈ కాల్స్ చేస్తున్నట్లు పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించారు. మహమ్మద్ కాసిం 14 ఏళ్లుగా కువైట్‌లో ఉంటున్నట్లు, చాంద్రాయణగుట్ట నుంచి దుబాయ్‌కి వెళ్లి అక్కడి నుంచి కువైట్‌లో సెటిల్ అయినట్లు తెలిసిందన్నారు. ఈ కేసులో నిందితుడు మహ్మద్ ఖాసిం కోసం సైబర్ క్రైమ్ పోలీసులు ఎల్‌ఓసీ జారీచేసినట్లు వెల్లడించారు.

వర్కింగ్ స్పేస్ స్వర్గధామంగా హైదరాబాద్

సాక్షి, సిటీబ్యూరో: బహుళజాతి కంపెనీలకు వర్కింగ్ స్పేస్ సమకూర్చడంలో హైదరాబాద్ నగరం దేశంలోనే మేటిగా నిలుస్తున్నదని ఐ స్ప్రౌట్ వ్యవస్థాపకులు సుందరి పాటిబండ్ల తెలిపారు. ప్రముఖ మేనేజ్ ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్ సంస్థ 'ఐ స్ప్రౌట్' ఆధ్వర్యంలోని 2 లక్షల 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని అతిపెద్ద వర్కింగ్ స్పేస్ కేంద్రాన్ని ప్రారంభించారు. హైటెక్ సిటీ ఆరో ఆర్బిట్ వేదికగా శనివారం జరిగిన ఈ ప్రారంభోత్సవంలో సుందరి మాట్లాడుతూ కరోనా అనంతరం ఆఫీస్ స్పేస్‌ల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యంగా 4వేల సీట్ల సామర్థ్యంతో తమ సేవలను ప్రారంభించామన్నారు. ఈ రంగంలో బెంగుళూరు వంటి నగరాల కన్నా అత్యుత్తమ వృద్ధి రేటుకు నగరం చేరుకుందని ఆమె తెలిపారు.

ఎంబీటీ మీటింగ్‌కు పోలీసుల అనుమతి నిరాకరణ

- రెయిన్‌బజార్ వద్ద ఉద్రిక్తత..
- మజ్లిస్, పోలీసుల కుట్ర అని ఎంబీటీ ఆరోపణ

చార్మినార్: ఎంబీటీ పార్టీ ఆధ్వర్యంలో యాకుత్‌పురా బడే బజార్ చౌరస్తాలో శనివారం సాయంత్రం పబ్లిక్ మీటింగ్ ఏర్పాటుకు నిర్ణయించగా..రెయిన్‌బజార్ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నందున అనుమతి నిరాకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంబీటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్‌తో పాటు సౌత్‌వెస్ట్ పోలీసు స్టేషన్లకు చెందిన పలువురు ఇన్‌స్పెక్టర్లు చంచల్‌గూడలోని ఎంబీటీ పార్టీ కార్యాలయానికి చేరుకుని పార్టీ అధ్యక్షుడు పర్వతుల్లాఖాన్‌తో పాటు అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌లకు పరిస్థితిని వివరించారు. ఇందుకు అంగీకరించని పార్టీ కార్యకర్తలు, నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో సభాస్థలికి వెళ్లే ప్రయత్నం చేసిన పర్వతుల్లాఖాన్‌ను పోలీసులు చంచల్‌గూడ ప్రధాన రోడ్డుపై అడ్డుకున్నారు. కాగా మజ్లిస్ నేతలు, పోలీసులు కలిసి కుట్రపూరితంగానే తమ సభకు అనుమతించలేదని అంజదుల్లాఖాన్ ఈ సందర్భంగా ఆరోపించారు. తాము అనుమతి కోసం ఈ నెల 13న పోలీసులకు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోగా అనుమతించి..తీరా పబ్లిక్ మీటింగ్ నిర్వహించే రోజైన శనివారం మధ్యాహ్నం అనుమతి లేదంటూ అడ్డుకోవడం సరైంది కాదని ఆయన దుయ్యబట్టారు. ఈ నెల 25 తర్వాత తిరిగి పోలీసుల అనుమతితోనే పబ్లిక్ మీటింగ్ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న అంజదుల్లాఖాన్

మాదక ద్రవ్యాల కేసులో జాంబియా మహిళకు 14 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మాదక ద్రవ్యాల కేసులో జాంబియా దేశానికి చెందిన మహిళ మాకుంబ కరోల్ (31)కి 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డా.పట్టాభి రామారావు శనివారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించి స్పెషల్ పీపీ రాజశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు..2021లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కు పట్టుబడిన జాంబియా దేశస్తురాలు మాకుంబ కరోల్ మాదక ద్రవ్యాలను కలిగి ఉండడంతో అరెస్టు చేశారు. అధికారులు నిందితురాలిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు నిందితురాలికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

కలకత్తా యువతులతో వ్యభిచారం

– ఫార్చ్యూన్ లాడ్జిపై దాడి...24 మంది అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన యజమాని అఖిల్, తదితరులు

అబిడ్స్: కలకత్తా నుంచి యువతులను తీసుకువచ్చి అబిడ్స్ ఫార్చ్యూన్ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకులు, యువతులు, విటులను నగర టాస్క్‌ఫోర్స్, అబిడ్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. హైటెక్ తరహాలో అందరి కళ్లుగప్పి వ్యభిచారం నిర్వహిస్తున్న వారందరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అఖిలేష్ (36) (అఖిలేష్ ఫహిల్వాన్) అనే వ్యక్తి అబిడ్స్‌లో ఫార్చ్యూన్ లాడ్జిని కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా కలకత్తా నుంచి యువతులను తీసుకువచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. సమాచారం అందుకున్న నగర సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అబిడ్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. లాడ్జి యజమాని అఖిలేష్, మేనేజర్ రఘుపతి, 16 మంది యువతులు, 6 మంది విటులను అరెస్టు చేశారు. వీరిలో యువతులను తుక్కుగూడలోని రెస్క్యూహోమ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు తెలిపారు. మిగతా వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్కారు బడులకు ఎస్ఎంసీలు

నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు • ఖైరతాబాద్ జోన్‌లో 64 పాఠశాలల్లో ఈ నెల 29న ఎన్నికలు

బంజారాహిల్స్: సర్కార్ బడుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజింగ్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు శనివారం నోటిఫికేషన్ విడుదల కావడంతో అందుకు సబంధించిన ఏర్పాట్లు ఆయా పాఠశాలల్లో జరుగుతున్నాయి. రెండేళ్లుగా కమిటీకి ఎన్నికలు లేనందున నూతన ఎస్ఎంసీలు రానున్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమ పరిశీలన, బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించడం, టీచర్ల బోధన, పనితీరును పర్యవేక్షించడం, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసేందుకు ప్రభుత్వం విద్యా హక్కు చట్టం ప్రకారం 2009 నుంచి పాఠశాలల యాజమాన్య కమిటీలను నిర్వహిస్తున్నది. 2019 వరకు ఎన్నికలు నిర్వహించారు.


ఫిలింనగర్ అంబేడ్కర్‌నగర్ స్కూల్‌లో సమావేశమైన సభ్యులు (ఫైల్)


ఉదయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల

◆ ఈ కమిటీల పదవీ కాలం రెండు సంవత్సరాల వరకు ఉంటుంది. 2021 నవంబర్‌లో పాత కమిటీల గడువు ముగిసింది. అయితే అప్పటి కరోనా పరిస్థితుల దృష్ట్యా ఎస్ఎంసీల ఎన్నికలు వాయిదా వేశారు. ప్రతి ఆరు నెలలకోసారి వాయిదా వేస్తూ వచ్చారు.

◆ గత డిసెంబర్ 31వ తేదీ వరకు వాయిదా వేశారు. ఈ వాయిదా కూడా ముగియడంతో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది.

◆ విద్యా శాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళ రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధుల్లో ఉన్న 47 ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి.

◆ ఈ నెల 22, 23 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి 24న విద్యార్థుల తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటించి 29న ఎన్నికలు నిర్వహిస్తారు. కమిటీల కోసం మొదట ఒక్కో తర గతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుని, ఆ తర్వాత ప్రత్యేకంగా సమావేశమై చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. కమిటీలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికైన తల్లిదండ్రులు కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు.

కమిటీల విధులు...

మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, పాఠ్య పుస్తకాల పంపిణీ, స్కూల్ యూనిఫాం తదితర పనులను ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు పరిశీలిస్తారు. మనబస్తీ–మనబడి పనులను కూడా పరిశీలిస్తారు. మరుగుదొడ్లు, మంచినీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తారు. పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు. స్కూల్ నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ల ఉమ్మడి ఖాతాలో జమవుతాయి.

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వంశీధర్‌గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న వంశీధర్‌గౌడ్

పంజగుట్ట: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కె.వంశీధర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌గౌడ్ ఆయనకు అందజేశారు. బీసీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని వంశీధర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు డి.రమ, కార్యదర్శి నాయకోటి రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి


మురుగు నీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో నిర్వహిస్తున్న భారీ మురుగు నీటి కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధికారులను కోరారు. శనివారం బస్తీలో జరుగుతున్న మురుగు నీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన జలమండలి మేనేజర్ పవన్‌తో కలిసి పరిశీలించారు. 450 ఎంఎం డయా సామర్థ్యంతో రూ. 50 లక్షల వ్యయంతో ఈ మురుగు నీటి కాల్వ నిర్మాణ పనులను 250 మీటర్ల నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎక్కువగా కొండ ప్రాంతం ఉండటంతో రాయిని తొలగించేందుకు ఎక్కువ సమయం పడుతున్నదని సాధ్యమైనంత గ్యాస్ కట్టర్ల సహాయంతో కొండ ప్రాంతాన్ని తవ్వి త్వరగా పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం (550/82) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీశంకర్ శనివారం ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలంటూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ... నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రాములు, సలహాదారు కోట్ల రామకృష్ణ, కోశాధికారి శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ కోడిచెర్ల పాల్గొన్నారు.

మెడికల్ షాపులో చోరీకి యత్నం

రహమత్‌నగర్: మూసి ఉన్న దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.భూపాల్‌గౌడ్ సమాచారం మేరకు... బోరబండ భరత్‌నగర్ బడాగుండుకు చెందిన షేక్ సలీం(26) స్థానికంగా ఉన్న ఓ చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. మద్యం మత్తులో ఈ నెల 18న అర్ధరాత్రి ఇందిరానగర్‌లోని ఏపీఎస్ మెడికల్ షాపులో చోరీకి యత్నిస్తూ షట్టర్ మధ్యలో చిక్కుకుపోయాడు. గమనించిన స్థానికులు బోరబండ పోలీసులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సలీంను అరెస్టు చేశారు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు డీఐ భూపాల్‌గౌడ్ తెలిపారు. నిందితుడిపై గతంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైందని డీఐ వివరించారు.

మూడు కార్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–4లోని సరిత అపార్ట్‌మెంట్ ఎదుట పార్క్ చేసిన మూడు కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఇక్కడ పార్కింగ్ చేసి ఉన్న ఓమ్ని వ్యాన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న ఇదే అపార్ట్‌మెంట్‌లో నివసించే ప్రవీణ్‌కుమార్‌కు చెందిన డీఎల్03 సీబీడీ 0333, అరుణ్‌కు చెందిన టీఎస్09 ఎఫ్‌హెచ్ 5910 నెంబర్ కార్లను మంటలు వ్యాపించాయి. మూడు కార్లు మంటల్లో చిక్కుకుని దగ్ధమవుతుండగా స్థానికులు గమనించి డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అప్పటికే మూడుకార్లు కాలి బూడిదయ్యాయి. ఓమ్ని వ్యాన్‌లో నుంచి వచ్చిన మంటల వల్లే కొత్త కార్లు దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఆగంతకులు ఈ పని చేశారా అనే కోణంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో అపార్ట్‌మెంట్ వాసులతో పాటు చుట్టుపక్కల వారంతా భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. గంట పాటు శ్రమించిన డీఆర్ఎఫ్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

యువకులపై రౌడీషీటర్ దాడి

వెంగళరావునగర్: అకారణంగా యువకులపై దాడి చేసిన రౌడీషీటర్‌పై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిలో నివసించే కార్తీక్ (స్టూడెంట్), పి.ధీరజ్, ఎం.వంశీ (ప్రైవేట్ జాబ్స్), నటరాజ్‌లు ఈ నెల 19న అర్ధరాత్రి తాము ఉంటున్న నూరున్నీసా అపార్ట్‌మెంట్స్‌లో మద్యం సేవిస్తున్నారు. అర్ధరాత్రి వారు కూర్చున్న గది వెంటిలేటర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసరగా అద్దాలు పగిలిపోయాయి. అందులో కార్తీక్ చేతికి గాయం కూడా అయింది. వెంటనే వారు బయటకు వచ్చి చూడగా సమీపంలోని నిస్మా అపార్ట్‌మెంట్స్ వద్ద ఒక వ్యక్తి నిలబడి ఉన్నాయి. అతనిని ఎందుకు రాళ్లు విసురుతున్నారని ప్రశ్నించగా ఈలోపు తన్నుఖాన్ అనే రౌడీషీటర్‌తోపాటు అతని అనుచరులు వచ్చి వారిని యువకులను దుర్భాషలాడుతూ వారిపై దాడి చేశాడు. దాంతో వారికి గాయాలయ్యాయి. అంతేగాకుండా చంపుతామని హెచ్చరించాడు. దీంతో ఆ యువకులు శనివారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు తన్నుఖాన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి: సినీ నటి భవ్యశ్రీ


చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి భవ్యశ్రీ

బంజారాహిల్స్: గ్రామీణ హస్తకళా వికాస్ సమితి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర కళా ప్రదర్శనను సినీ నటి భవ్యశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాల్లో సిల్క్, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. చేనేత ఉత్పత్తులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నదని అన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నారని నిర్వాహకులు తిరుపతి సతీష్ తెలిపారు.

దైవసన్నిధానంలో మోహన్‌బాబు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న మంచు మోహన్‌బాబు

ఫిలింనగర్: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవసన్నిధానంలో వారం రోజులుగా జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో దైవసన్నిధానం ఆలయ చైర్మన్ మంచు మోహన్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా శనివారం ఆలయంలో మన్యుసూక్త సహిత హనుమాన్ గాయత్రీ హోమం, రామాయణ, ఉత్తరాకాండ ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం రామనామ సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ... ఈ నెల 22వ తేదీన అయోధ్యలో శ్రీ బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నేపథ్యంలో ఫిలింనగర్ దైవసన్నిధానంలో ఉదయం స్వామివారి నగరాయత్రతో పాటు అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించబోతున్నామన్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫిలింనగర్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, పరుచూరి గోపాలకృష్ణ, ఆదిశేషగిరిరావు, చాముండేశ్వరినాథ్ తదదితరులు పాల్గొన్నారు.

ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ సంస్థల అవగాహన ఒప్పందం


అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

పంజగుట్ట: నగరానికి చెందిన ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్, ఆస్ట్రేలియాకు చెందిన ఏఎంఎస్టీ ఏవియేషన్ సంస్థ పైలెట్ శిక్షణకు సంబంధించిన అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ కౌశిక్ మానేపల్లి మాట్లాడుతూ... ఈ ఒప్పందం బేగంపేటలో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 ఎగ్జిబిషన్‌లో కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఒప్పందం ద్వారా పైలెట్ శిక్షణ కోసం ఏఎంఎస్టీ ఏవియేషన్ సంస్థ మూడు అత్యాధునిక ఎయిర్ ఫాక్స్ ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్‌ల ట్రైనింగ్ సర్వీస్‌లను ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్‌కు అందించనున్నట్లు తెలిపారు. ఒప్పందం మరింత మెరుగైన పైలెట్ శిక్షణ ఇస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు దోహదపడుతుందన్నారు.

పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని వినతి

లిబర్టీ: ఉస్మానియా విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.రాములును దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ శనివారం కలిశారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయనకు విన్నవించారు. ప్రొఫెసర్ రాములు మాట్లాడుతూ... డిగ్రీ, పీజీ ఇతర విభాగాల పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని వెల్లడించారు.

బిగ్‌బాస్‌లోకి ఎంపిక చేయిస్తామని మోసం

బిగ్‌బాస్ ఇన్‌చార్జి తమిలి రాజుపై పోలీసుల కేసు నమోదు

బంజారాహిల్స్: తనను బిగ్ బాస్–7లోకి పంపిస్తామంటూ డబ్బులు తీసుకొని మోసం చేశారంటూ అమ్మినేని స్వప్న అనే యాంకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఖమ్మం జిల్లాకు చెందిన స్వప్నా చౌదరి అలియాస్ స్వప్న యాంకర్‌గా, ఈవెంట్ ఆర్గనైజర్‌గా టాలీవుడ్‌లో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిగ్‌బాస్ తెలుగు ఏడో సీజన్‌లోకి కంటెస్టెంట్‌గా పంపిస్తానని మా టీవీలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా పనిచేస్తున్న సత్య బిగ్‌బాస్ ఇన్‌చార్జి తమిలి రాజును పరిచయం చేశారు. బిగ్ బాస్‌లోకి వెళ్లడానికి అందులో ఉపయోగించే దుస్తులు ప్రచారం కోసం ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని తమిలి రాజు ఆమెకు సూచించారు. ఈ మేరకు గత ఏడాది జూన్ నుంచి దాదాపు రెండున్నర లక్షలు ఆమె అతనికి చెల్లించింది. ఒకవేళ అవకాశం రాకుంటే డబ్బులు తిరిగి ఇస్తానంటూ తమిలి రాజు ఆమెను నమ్మించాడు. ఇందుకు సంబంధించి తమిలి రాజు ఆమెకు ఒక అగ్రిమెంట్ కూడా రాసిచ్చాడు. చివరి క్షణం వరకు పంపిస్తానని చెప్పి నన్ను మోసం చేస్తూ వచ్చాడు. డబ్బుల గురించి ప్రశ్నించగా తాను ఇవ్వనని తేల్చి చెప్పడంతో కొద్దిరోజుల క్రిందట స్వప్న వీడియో రూపొందించి సోషల్ మీడియాలోనూ పోస్ట్ చేసింది. ఇదే సంఘటనపై శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా పోలీసులు సెక్షన్ 406, 420 కింద రాజు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు నమోదు కేంద్రాల పరిశీలన


ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా ఓటరు నమోదు స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారి ప్రశాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తదితరులు శనివారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించారు. ఓటు నమోదు కోసం వచ్చేవారితో, మార్పులు చేర్పులు కోసం వచ్చినవారితో మాట్లాడారు. ప్రత్యేక ఓటరు కేంద్రాల్లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కూడా ఈ కేంద్రాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తాయని, అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. బంజారా భవన్, నందినగర్ కమ్యూనిటీ హాల్, గతి ప్రభుత్వ పాఠశాల, జూబ్లీహిల్స్ క్లబ్ తదితర పోలింగ్ కేంద్రాల్లో వీరు పర్యటించారు.

'అబ్దుల్లాపూర్‌మెట్' ఘటనను ఖండిస్తున్నాం..

పంజగుట్ట: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెన్నారం కాలనీలో భార్య తలను నరికిన భర్త క్రూరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ మహిళా, ట్రాన్స్‌జెండర్ సంఘాల జేఏసీ పేర్కొంది. అనేక కేసులమాదిరే ఈ కేసులో కూడా చనిపోయిన మహిళ ఆత్మగౌరవాన్ని హరించివేస్తూ అసలు నిజాలు తొక్కేసి నిందితుడి మాటలే నిజాలు అన్నట్లుగా సమాజాన్ని నమ్మించే ప్రయత్నం చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, సజయ, ఆశాలత, సుమిత్ర, కృష్ణకుమారి, ఫిర్యాదు దారుడు గోపీ శంకర్, ప్రత్యక్ష సాక్షి రాజు మాట్లాడుతూ... ఈ ఘటనలో నిందితుడు పలువురు చూస్తుండగానే బాధిత మహిళను అతి క్రూరంగా తల నరికి చంపేశాడని, అతను రక్తపు మడుగులో ఉండగానే స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారన్నారు. కొంతమంది నిందితుడి సమాచారం తీసుకుని బాధితురాలికి గతంలోనే రెండు వివాహాలు అయ్యాయని ప్రస్తుతం ఉన్నది మూడవ భర్త అని రకరకాలుగా ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను నరికి చంపారనే వార్తకన్నా, మూడవ భర్త అరు తప్పుడు ప్రచారం ఎక్కువ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా ప్రాధాన్యమివ్వాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్



పంజగుట్ట (హైదరాబాద్): గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి రాజకీయ నియంతృత్వ పోకడలకు పోకుండా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాజుల మాట్లాడుతూ... స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం నినాదంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వాటిని నెరవేర్చాలంటే అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమానవాటా కల్పించాలన్నారు. దళితుల్లో ఉన్న 56 ఉపకులాలతో సహా ప్రతి కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పక్కాగా అమలు చెయ్యాలని, వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ వరకు సమాన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దొరకాలంటే ముందు జనగణన జరగడం ముఖ్యమన్నారు. మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ... రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న మాదిగలకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు.

గురుకుల బోర్డు ఎదుట మహిళా అభ్యర్థుల ఆందోళన



బంజారాహిల్స్: గురుకుల పరీక్షలు రాసిన మహిళా అభ్యర్థులు శనివారం గురుకుల బోర్డు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గతేడాది ఆగస్టులో రాసిన పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన విధంగా వర్టికల్ ప్రకారమే పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

'ఎక్సలెన్స్' అవార్డుల ప్రదానం

బంజారాహిల్స్: నాలుగేళ్లుగా ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థలు, విశిష్టత కలిగిన అధ్యాపకులకు ఆంబిషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆంబిషన్స్ ఎడ్యుకేషన్ కెరీర్ కౌన్సిలర్స్ ఎక్సలెన్స్ సీ2024 అవార్డులను ప్రదానం చేశారు. బంజారాహిల్స్‌లోని రాడిషన్ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో టీచర్స్, లెక్చరర్లకు, విద్యా సంస్థలకు ఈ అవార్డులను అందజేశారు. ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అవినాష్ కాలేజీ చైర్మన్ అవినాష్ బ్రాంమదేరా, బెంగుళూరు హెచ్ఎస్‌బీ చైర్మన్ డాక్టర్ జయప్రకాష్, ఫౌండర్ ఆఫ్ ఆంబిషన్స్ కెరీర్ కౌన్సిలర్ ఫౌండర్ నగరం సాయిరాంలు అవార్డులను అందజేశారు.

జాతీయస్థాయిలో క్రీడలకు కొరవడిన ప్రోత్సాహం

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని

వెంగళరావునగర్: జాతీయ స్థాయిలో క్రీడలకు తగిన ప్రోత్సాహం లభించడం లేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శనివారం యునిక్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే కిలాడీస్ పేరుతో జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తలసాని కరాటే పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ... దేశంలో క్రికెట్ మాత్రమే క్రీడ అన్నట్టు కేంద్రం వ్యవహరిస్తున్నదని, ఇది బాధాకరమని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించే వారిని నిరంతరం పోత్రహిస్తానని అన్నారు. నిర్వాహకులు రాజేశ్వరి చౌహాన్ మాట్లాడుతూ... కరాటే పోటీలు రెండురోజుల పాటు కొనసాగుతాయని అన్నారు. పది రాష్ట్రాలకు చెందిన సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. నిర్వాహకులు నరేష్, సహదేవ్, రమేష్, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

గౌతంరావుకు అభినందన



వెంగళరావునగర్: భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన డాక్టర్ ఎస్.గౌతంరావును ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెంగళరావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అభినందించారు. శనివారం కిలారి మనోహర్, బోరబండ అధ్యక్షుడు కొత్త వెంకటేష్‌లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువాలు కప్పి, పూలబొకేలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు.

నిర్మాణ సామగ్రి డంప్ చేస్తే రూ. 50 వేల జరిమానా



బిల్డర్లతో సమావేశమైన సర్కిల్–18 డీసీ ప్రశాంతి

బంజారాహిల్స్: భవన నిర్మాణ వ్యర్థాలను, ఇతరత్రా వృథా సామగ్రిని తరలించాలనుకునే వారు 18002030033 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతి సూచించారు. శనివారం ఖైరతాబాద్‌లోని సర్కిల్ కార్యాలయంలో టిప్పర్ డ్రైవర్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, డీఈఈలు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, ఏఎంఓహెచ్‌లతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ... భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయవద్దని, ఎవరైనా వీటిని తొలగించాలనుకుంటే లొకేషన్‌తో పాటు 7330000203 వాట్సాప్ నెంబర్‌లో కూడా సమాచారం ఇవ్వవచ్చన్నారు. ఇంటికే వచ్చి వాళ్లు నిర్మాణ వ్యర్థాలను కలెక్ట్ చేసుకుని వెళ్తారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తే రూ. 50 వేలు జరిమానా విధించనున్నట్లు ఆమె హెచ్చరించారు. శనివారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలంటే ప్రజలు కూడా జీహెచ్ఎంసీకి సహకరించాలన్నారు.


అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి


ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణశర్మ

వెంగళరావునగర్: అర్హులందరూ ఓటు హక్కును కలిగి ఉండాలని రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ సూచించారు. ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఓటరు నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణశర్మ మాట్లాడుతూ... రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకుని కొత్త ఓటర్లు ఎవరైనా ఉంటే తక్షణమే తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కాలనీలోని పలువురు జాబితాలో తమ ఓటును పరిశీలించుకున్నారు. కార్యక్రమంలో బీఎల్ఓలు వీరగిరి, సుమన్, చైతన్య, శ్రీను, కమరున్నీసా తదితరులు పాల్గొన్నారు.



సోమవారం మధ్యాహ్నం 12.29 గంటలకు అభిజిత్ లగ్నంలో ప్రాణప్రతిష్ఠ



ప్రాణప్రతిష్ఠ జరగనున్న బాలరాముడి విగ్రహం

అయోధ్య భక్తజన సంద్రం

అయోధ్య..
ఆ పేరు వింటేనే ఆధ్యాత్మిక పరవశం.
అది శ్రీరాముడు జన్మించిన పుణ్యభూమి.

ఎన్నో వివాదాలు..
మరెన్నో ఆందోళనలు
అవన్నీ సమసిపోయాయి.
రాముడు పుట్టిందక్కడే అని బలంగా నమ్మే కోట్లాది భక్త హృదయాలు ఉప్పొంగేలా, భవ్యమైన దివ్యమైన మందిరంలోకి రామచంద్ర ప్రభువు వేం చేయబోతున్నాడు. ఆ దివ్యమంగళ రూపం కోసం పరితపిస్తున్న భక్తకోటి ఆర్తి తీరేలా బాలరాముడిగా రేపు తొలి దర్శనభాగ్యం కలిగించబోతున్నాడు. అయోధ్యలో దివ్యంగా రూపుదిద్దుకున్న భవ్య మందిరంలో భక్తవత్సలుడు కొలువు దీరబోతున్నాడు. కనులారా బాలరాముడిని వీక్షించే భాగ్యం భక్తులకు దక్కనుంది.



బాలరాముడిని ప్రతిష్ఠించే గర్భాలయం



1947 నుంచి పూజలందుకుంటున్న విగ్రహం

బాల రాముడి ప్రాణప్రతిష్ఠ రేపే

(అయోధ్య నుంచి 'సాక్షి' ప్రతినిధి గౌరీభట్ల నరసింహమూర్తి)

అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం సర్వాంగసుందరంగా సిద్ధమైంది. మరికొన్ని గంటల్లో బాలరాముడు భక్తజనానికి దర్శనం ఇవ్వనున్నాడు. రేపు సోమవారం బాలరామచంద్రుడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర రాజకీయ ప్రముఖులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక, ఇతర రంగాల ప్రముఖులు, ప్రపంచం నలు మూలల నుంచి తరలివస్తున్న భక్త జనం సాక్షిగా ఆగమ శాస్త్ర పద్ధతుల్లో ప్రతిష్ఠించనున్నారు. రూ.1300 కోట్లతో మూడో అతిపెద్ద హిందూ దేవాలయంగా రూపుదిద్దుకుంటున్న భారీ ప్రాజెక్టు కావటంతో ఆలయాన్ని మూడు విడతల్లో పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం దిగువ అంతస్తు మాత్రమే అందుబాటులోకి రానుంది. ఇప్పటికే సిద్ధం చేసిన బాల రాముడి విగ్రహానికి రేపు ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది.

★★★

మొదటి అంతస్తులో రామదర్బార్

రావణవధ అనంతరం తిరిగి వచ్చిన సీతారాములకు అయోధ్యలో అంగరంగవైభవంగా పట్టాభిషేకం జరిగింది. ఆ తర్వాత సోదర, ఆంజనేయ సమేతంగా అద్భుత పాలనతో సుభిక్ష రామ రాజ్యం విలసిల్లిందన్నది పురాణగాథ. బాలరాముడితో దర్శనం సమాప్తమైతే.. సీతారాములను కనులారా వీక్షించాలని ఉబలాటపడే భక్తుల్లో కొంత అసంతృప్తి ఉంటుందనే ఉద్దేశంతో మొదటి అంతస్తులో 'రామదర్బార్' రూపంలో అద్భుత దర్శన భాగ్యం కలిగించే ఏర్పాటు చేస్తున్నారు. శ్రీ సీతారామచంద్రులు లక్ష్మణ, భరత, శత్రఘ్న, ఆంజనేయ విగ్రహాలు సమేతంగా భక్తులకు మొదటి అంతస్తులో దర్శనమివ్వనున్నాయి. రామదర్బార్ విగ్రహాలను రాజస్థాన్ తెల్లరాతితో సిద్ధం చేయనున్నారు. వచ్చే సంవత్సరం ఆ విగ్రహాలు దర్శనమివ్వనున్నాయి.

ఆ దివ్య మందిరంపై నిర్మించే రెండో అంతస్తులో ఎలాంటి దర్శన ఏర్పాట్లు చేయాలన్న విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. వచ్చే సంవత్సరం డిసెంబరు నాటికి మొదటి రెండు అంతస్తులను పూర్తి చేసి రామ దర్బార్ దర్శనం కలిగించనున్నారు.

★★★

బాలరాముడి రూపునకు మూడు విగ్రహాల పరిశీలన

బాలరాముడి రూపు కోసం మూడు విగ్రహాలను పరిశీలించారు. రాజస్థాన్, కర్ణాటక ప్రాంతాలకు చెందిన శిల్పులు ఆరు నెలల క్రితమే వీటిని సిద్ధం చేసి పెట్టారు. విగ్రహాల తయారీకి కర్ణాటక నుంచి మూడు కృష్ణ శిలలు, ఓంకారేశ్వర్ పూజ్య అవధూత నర్మదానంద్‌జీ మహరాజ్ ప్రత్యేకంగా రాజస్థాన్ నుంచి పంపిన తెల్లరాయిని శిల్పులకు అప్పగించారు. ఇందులో నల్లరాయిని బాల రాముడి విగ్రహానికి కేటాయించారు. తయారైన మూడు బాల రాముడి విగ్రహాల్లో మైసూరుకు చెందిన అరుణ్ యోగిరాజ్ శిల్పి రూపొందించిన విగ్రహాన్ని ఇటీవల ట్రస్టు సభ్యులు ఓటింగ్ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ విగ్రహానికే రేపు ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది.

★★★

మూల విరాట్‌గా కొత్త విగ్రహం... ఉత్సవమూర్తిగా పాత విగ్రహం

దిగువ అంతస్తులో బాలరాముడు, మొదటి అంతస్తులో పట్టాభి రాముడు దర్శనం ఇవ్వడం ఒక విశేషమైతే, దిగువ అంతస్తులోనే బాలరాముడితో పాటు పురాతన విగ్రహ దర్శనభాగ్యం కూడా భక్తులకు కల్పించనున్నారు. రామజన్మభూమిలో 1947లో రాముడి విగ్రహం ఒకటి వెలుగు చూసింది. దాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోనే ఉంచి పూజలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ



ప్రాంగణంలోని తాత్కాలిక మందిరంలో ఆ విగ్రహమే పూజలందుకుంటోంది. కొత్త ఆలయంలో ప్రాణప్రతిష్ఠకు కొత్త విగ్రహాన్ని రూపొందించిన తరుణంలో, పాత విగ్రహాన్ని ఏం చేస్తారన్న ప్రశ్నలు ఉద్భవించాయి. ఇటీవలే ట్రస్టు ఆ సందేహాలను నివృత్తి చేసింది. దిగువ అంతస్తులో బాల రాముడి విగ్రహం ముందే ఆ పాత విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించనున్నారు. 30 అడుగుల దూరం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. పాత విగ్రహం చిన్నదిగా ఉన్నందున సరిగ్గా కనిపించదు. అందుకోసమే కొత్త విగ్రహాన్ని రూపొందించారు. ఇన్ని దశాబ్దాలుగా పూజలందుకుంటున్న పాత విగ్రహాన్ని కూడా గర్భాలయంలోనే ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. కొత్త విగ్రహాన్ని మూల విరాట్‌గానూ, పాత విగ్రహాన్ని ఉత్సవమూర్తిగా మారుస్తున్నారు. ప్రత్యేక పూజాదికాల కోసం ఉత్సవ విగ్రహం వివిధ ప్రాంతాలకు తరలుతుందని, మూల విరాట్ గర్భాలయంలోనే స్థిరంగా ఉంటుందని ట్రస్టు స్పష్టం చేసింది.

★★★

జటాయువు కంచు విగ్రహం కూడా...

15 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవుతో జటాయువు కంచు విగ్రహాన్ని కూడా రూపొందిస్తున్నారు. అక్కడి కుబేర్‌టీలాపై ప్రతిష్ఠించే ఈ విగ్రహం మూలమూర్తి వైపు ధ్యాన ముద్రలో చూస్తూ వినమ్రంగా ఉండేలా దీనిని ప్రఖ్యాత శిల్పి, పద్మభూషణ్‌రామ్ సుతార్ సిద్ధం చేస్తున్నారు.

★★★

దక్షిణ భారతశైలిలో గాలిగోపురం

దక్షిణాది దేవాలయాల మాదిరిగా ద్రవిడ శైలిలో ఉండే రాజగోపురాలు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి. అయోధ్య రామజన్మభూమి ప్రధాన ఆలయాన్ని ఉత్తర భారతీయ నాగర శైలిలో నిర్మిస్తున్నారు. అయితే నాగరశైలిలో గాలి గోపురాలకు చోటు లేదు. కానీ రామజన్మభూమి ఆలయ ప్రవేశం వద్ద మాత్రం భారీ గాలిగోపురం నిర్మించాలని నిర్ణయించారు. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

★★★

భక్తజన దర్శనానికి సిద్ధమవుతున్న అయోధ్య రామయ్య

దిగువ అంతస్తులో బాలరాముడు

ఆలయం మూడు అంతస్తులుగా ఉంటుంది. ప్రతి అంతస్తు 20 అడుగుల ఎత్తుతో ఉంటుంది. భూ ఉపరితలం నుంచి 20 అడుగుల ఎత్తుతో ప్రదక్షిణ పథ (పరిక్రమ్) నిర్మించారు. దాని మీద ప్రధాన ఆలయం దిగువ అంతస్తు ఉంటుంది. ఈ దిగువ అంతస్తులోనే బాల రాముడి విగ్రహం ఉంటుంది. రాముడు పుట్టినట్టుగా భావిస్తున్న చోటనే ఈ ఆలయం నిర్మిస్తున్నందున అక్కడే బాలరాముడు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ట్రస్టు నిర్ణయించింది. ఐదేళ్ల వయసులో ఉన్న రాముడి రూపం 51 అంగుళాల విగ్రహంగా భక్తజనానికి దర్శనమివ్వనుంది.

ఎన్నో ప్రత్యేకతలు

రాముడి సుగుణాలు అనేకం..ప్రతిఒక్కోటి విలక్షణమే. అలాంటి రాముడు పుట్టిన చోట నిర్మిస్తున్న మందిర నిర్మాణంలోనూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. అందుకే ఈ ఆలయాన్ని నభూతో న భవిష్యతిగా వర్ణిస్తున్నారు. ఆధునిక భారతావనిలో రాతితో నిర్మించిన అతి పెద్ద దేవాలయం కూడా ఇదే. సిమెంటు, స్టీలు, ఇతర అనుసంధాన రసాయనాలు లేకుండా పూర్తిగా రాతితోనే దీనిని నిర్మిస్తున్నారు. ఆలయం, పరిసరాలన్నీ కలుపుకొని 90 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో సుప్రీంకోర్టు ఆదేశం మేరకు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు సంక్రమించినది 72 ఎకరాలు. మిగతా భూమిని ప్రైవేట్‌సంస్థలు, వ్యక్తుల నుంచి ట్రస్టు కొనుగోలు చేసింది. ఇందులో 2.7 ఎకరాల్లో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం రూపుదిద్దుకుంటోంది.

2025 నాటికి మొత్తం ఆలయం సిద్ధం

ప్రస్తుతానికి గర్భాలయంగా ఉండే ప్రధాన ఆలయ నిర్మాణమే జరుగుతోంది. మూడంతస్తులుగా ఉండే ఈ ఆలయంతోపాటు ఆ ప్రాంగణంలో పర్‌కోట (ప్రాకారం) ఆవల మరో ఎనిమిది మందిరాలు కూడా ఉంటాయి. శ్రీరాముడి జీవితంతో అనుబంధం ఉన్న భిన్నవర్గాలకు చెందిన వారి ఆలయాలు నిర్మిస్తారు. వాల్మీకి, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, శబరి, అహల్య, గుహుడు..లాంటి వారితో కూడిన ఎనిమిది గుళ్లుంటాయి. మర్యాద పురుషోత్తముడి సామాజిక దృష్టి కోణానికి నిదర్శనంగా ఇప్పటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఈ ఆలోచన జరిగిందన్నది ట్రస్టు మాట. అయితే ప్రధాన ఆలయ ప్రాంగణాన్ని 2025 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ట్రస్టు లక్ష్యంగా పెట్టుకుంది.



అయోధ్యలో సరయూ నదికి హారతి



లేజర్ షో

ఆరంభమైన వేడుకలు

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈనెల 16 నుంచే మొదలయ్యాయి. హోమాలు, జపాలు, ఇతర ప్రధాన క్రతువులతోపాటు బాలరాముడి విగ్రహానికి శోభాయాత్ర నిర్వహిస్తారు. తెల్లవారుజామునే సరయూ నదిలో విగ్రహానికి స్నానం నిర్వహించి నేత్రపర్వంగా శోభాయాత్ర ద్వారా పట్టణానికి తరలిస్తారు. అక్కడ అతి పురాతన ఆలయాల సందర్శన తర్వాత గర్భాలయంలో ప్రాణప్రతిష్ఠకు తరలిస్తారు. అప్పటి వరకు విగ్రహ నేత్రాలను కప్పి ఉంచుతారు. బాలరాముడు అప్పట్లో అయోధ్యలో స్నానపానాదులు చేస్తూ సంచరించిన తరహాలో ఈ వేడుక నిర్వహించనున్నారు.



ఆలయ పునాదుల్లో నాలుగున్నర లక్షల ఇటుకలు

రామ మందిర నిర్మాణంతో తమ చేయూత ఉండాలన్న సంకల్పంతో దేశంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ఇటుకలు పంపారు. అలా నాలుగు లక్షల గ్రామాల నుంచి నాలుగున్నర లక్షల ఇటుకలు అయోధ్యకు చేరాయి. అయితే ఆలయాన్ని పూర్తి రాతి కట్టడంగా నిర్మిస్తున్నందున ఇటుకల వాడకం సాధ్యం కాదు. అలా అని మరోచోట ఈ ఇటుకలను వినియోగిస్తే.. భక్తులు అసంతృప్తికి లోనయ్యే అవకాశముంది. దీంతో వాటికి ప్రత్యేక స్థానం దక్కాల్సిందేని భావించిన ట్రస్టు, వాటిని ఆలయ పునాదుల్లో వినియోగించింది. ఇప్పుడు నాలుగున్నర లక్షల ఇటుకలు పునాది భాగంలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

రాముడు పుట్టిన చోటనే గర్భగుడి కట్టాలని అదనంగా స్థల సేకరణ

సుప్రీంకోర్టు తీర్పుతో 72 ఎకరాలు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అధీనంలోకి వచ్చాయి. అయితే రాముడు జన్మించినట్టుగా చెబుతున్న భాగంలోనే గర్భాలయం నిర్మించాలన్నది ప్రణాళిక. కానీ రాముడు పుట్టినట్టుగా పేర్కొంటున్న ఆ భూమి ఆగ్నేయ మూలలో ఉంది. అది గర్భాలయ నిర్మాణానికి అనుకూలంగా లేదు. దీంతో దాని వెనుకవైపు కొంత భూమిని ప్రైవేట్‌వ్యక్తుల నుంచి ట్రస్టు కొనుగోలు చేసి ఆ ప్రాంగణాన్ని ప్రస్తుతం నిర్మిస్తున్న ఆలయ నమూనాకు వీలుగా సిద్ధం చేసింది.

★★★

ఫొటోలు:
నోముల రాజేష్‌రెడ్డి







వాస్తుశిల్పి 'సోమ్‌పురా' సారథ్యంలో నిర్మాణ పనులు

దేవాలయ ఆర్కిటెక్ట్‌గా ప్రఖ్యాత 'సోమ్‌పురా' కుటుంబమే వ్యవహరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆ కుటుంబం వందకుపైగా ఆలయాలను రూపొందించింది. ప్రఖ్యాత సోమ్‌నాథ్ ఆలయానికి కూడా వాస్తు శిల్పిగా పనిచేసిన ఆ కుటుంబం 15 తరాలుగా ఇదే పనిలో ఉంది. అయోధ్య రామాలయం కోసం చంద్రకాంత్ సోమ్‌పురా చీఫ్ ఆర్కిటెక్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన విఖ్యాత అక్షర్‌ధామ్‌ను రూపొందించారు. ఆయన ఇద్దరు కుమారులు నిఖిల్ సోమ్‌పురా, ఆశిష్ సోమ్‌పురాలు ఆర్కిటెక్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు.

- ప్రధాన ఆలయం 235 అడుగుల వెడల్పు, 350 అడుగుల పొడవు, 161 అడుగుల ఎత్తులో ఉంటుంది. దీనిని ప్రపంచంలో మూడో అతిపెద్ద హిందూ దేవాలయంగా చెప్పవచ్చు.
- ఆలయ నిర్మాణం ఆగమశాస్త్రం నాగర విధాన గుర్జర చాళుక్య శైలిలో రూపుదిద్దుకుంటోంది.
- ప్రధాన ఆలయం మూడు అంతస్తుల్లో ఉంటుంది. ప్రతి అంతస్తు 20 అడుగుల ఎత్తుతో ఉంటుంది. ఒక్కో అంతస్తులో నృత్య, రంగ, కుడు, కీర్తన, ప్రార్థన పేర్లతో ఐదు మండపాలుంటాయి.
- ప్రధాన ఆలయంలో 366 స్తంభాలుంటాయి. ఒక్కో దానిపై 30 వరకు శిల్పాలు, ఇతర నగిషీలు ఉంటాయి.
- స్తంభాలపై శివుడు, వినాయకుడు, దశావతారాలు, యోగినులు, సరస్వతి ఇతర దేవతా రూపాలను చిత్రీకరించారు.
- గర్భాలయం అష్టభుజి ఆకృతిలో ఉంటుంది.
- దేవాలయాన్ని లేత గులాబీరంగు ఇసుక రాయితో నిర్మించారు. ఇందుకు రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా బన్సీపహాడ్‌పూర్ క్వారీ నుంచి 5 లక్షల ఘనపుటడుగుల లేత గులాబీ రంగు రాయి, గర్భాలయం కోసం ఇదే రాష్ట్రంలోని మక్రానా నుంచి లక్ష ఘనపుటడుగుల తెలుపురంగు చలవరాతిని తెప్పించారు.
- రామ జన్మభూమికి సంబంధించి 2019 నవంబరులో సుప్రీం కోర్టు తీర్పు రాగా, 2020 ఫిబ్రవరిలో దేవాలయ కమిటీ ఏర్పాటైంది. ఆలయానికి ప్రధాని మోదీ 2020 ఆగస్టు 5న భూమి పూజ చేశారు.
- ఆలయ పనులు మూడు షిఫ్టుల్లో రేయింబవళ్లు కొనసాగిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 3500 మంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.
- ఎల్ అండ్ టీ నిర్మాణ సంస్థ కాగా, పనుల పర్యవేక్షణ బాధ్యత టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చూస్తోంది.
- శిల్పాలను తీర్చిదిద్దేందుకు ఒడిషా నుంచి ఎక్కువ మంది శిల్పులు వచ్చారు. సిమెంట్ లాంటి బైండింగ్ మెటీరియల్ వినియోగిస్తున్నారు. ఇందులో రాళ్ల జోడించటం అనేది క్లిష్టమైన ప్రక్రియ, ఈ ప్రక్రియలో విశేష అనుభవం ఉన్న రాజస్థాన్ నిపుణులకు ఆ బాధ్యత అప్పగించారు. కాపర్ క్లిప్స్ మాత్రమే వాడి రాళ్లను అనుసంధానిస్తున్నారు.
- ఒడిషా, రాజస్థాన్, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది సిబ్బంది పనుల్లో పాల్గొంటున్నారు.

ఈ మందిరం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీక



"రాముడు జన్మించిన చోటే ఆయన దేవాలయం నిర్మితమవుతుందన్న విశ్వాసం పదేళ్ల క్రితం వరకు లేదు. కానీ అది సాధ్యమై ఇప్పుడు ఆ ఆదర్శ పురుషుడి దివ్య దర్శనానికి నోచుకోబోతున్నాం. అందుకే రామజన్మభూమి మందిరం నిర్మించాలన్న ఆకాంక్ష దైవ సంకల్పమని నేను నమ్ముతాను. అయోధ్యలో నిర్మిస్తున్న భవ్య మందిరం ఓ సాధారణ దేవాలయం కాదు, అది భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ప్రతీక. అందరూ ఆ అద్భుతాన్ని దర్శించుకోవాలి. దేవుడి ముందు అంతా సమానులే, అందరిపట్లా ఆ రాముడిది సమభావనే. అందుకే ఈ నిర్మాణం సామాజిక సామరస్యాన్ని ప్రతిబింబిస్తుంది. దేశ నలుమూలల ఆలయ నిర్మాణ సంప్రదాయాలను ప్రతిఫలిస్తుంది. దేశంలోని ప్రతి గ్రామ చొరవ అందులో కనిపిస్తుంది. దాదాపు రూ.2 వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ ఆలయ ఖర్చులో ప్రభుత్వాలది నయా పైసా లేదు. అంతా భక్తుల విరాళమే. అందుకే మన దేవుడు, మన మందిరం."

- నృపేంద్ర మిశ్రా,
శ్రీ రామజన్మభూమి దేవాలయ నిర్మాణ కమిటీ చైర్మన్.
ప్రధానమంత్రి కార్యాలయ మాజీ ముఖ్య కార్యదర్శి

అన్నీ ఉచితమే... అందరూ సమానమే!



రామ మందిరం దేశంలోనే ప్రముఖ దేవాలయాల జాబితాలో చేరబోతోంది. ఇలాంటి చోట దర్శనం, ప్రసాదాలకు రుసుము ఉండటం సహజం. కానీ, భక్తులు సమర్పించిన రూ.వేల కోట్ల విరాళాలతో రూపుదిద్దుకుంటున్న ఈ భవ్య మందిరంలో భక్తులపై దర్శన వేళ అదనంగా రుసుము భారం మోపొద్దని ట్రస్టు నిర్ణయించింది. ఎంతమంది భక్తులు వచ్చినా ఎలాంటి రుసుమూ లేకుండా దర్శనానికి అవకాశం కల్పించబోతున్నారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా అందరికీ ఒకే తరహాలో దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శన అనంతరం ఎంతో భక్తిశ్రద్ధలతో స్వీకరించే ప్రసాదం కూడా ఉచితంగా అందించాలని నిర్ణయించారు.

భారీ భూకంపాలను తట్టుకునేలా...

రామమందిర ప్రత్యేకతల్లో పునాది కూడా ఒకటి. 161 అడుగుల ఎత్తుతో నిర్మితమవుతున్న దివ్యభవ్య మందిరానికి 50 అడుగుల లోతుతో పునాది నిర్మించారు. అయోధ్య పట్టణ శివారు నుంచి సరయూ నది ప్రవహిస్తోంది. అయితే 400 ఏళ్ల క్రితం సరయూ ప్రస్తుతం ఆలయం నిర్మిస్తున్న ప్రాంతానికి అతి చేరువగా ప్రవహించేది. దీంతో ఆ ప్రాంత భూగర్భం ఇసుక మేటలతో నిండి ఉంది. భారీ నిర్మాణానికి పునాది పడాలంటే ఆ ఇసుకనంతా తొలగించాలి. ఇందుకోసం ఐఐటీ, ఎన్ఐటీ నిపుణులు, రిమోట్ సెన్సింగ్ సెంటర్ పరిశోధకులు కలిసి దీనికి ప్రత్యేక పునాది నిర్మాణానికి డిజైన్ చేశారు. 50 అడుగుల లోతు నుంచి ఇసుక, మట్టిని తొలగించి వాటికి రీయింజనీర్ ఇసుక, కొన్ని రసాయనాలు, 10 శాతం ఫైన్‌సిమెంట్ కలిపి పొరలు పొరలుగా వేసి వాటిని కాంపాక్ట్‌గా మార్చి 47 పొరలుగా పైవరకు నిర్మించారు. ఆ ఇసుక, మట్టి భాగం పూర్తిగా గట్టిబడి 50 అడుగుల ఏకశిలగా మారింది. దాని మీద రెండున్నర మీటర్ల మందంతో రాఫ్ట్ నిర్మించారు. ఆ పైన ఒకటిన్నర మీటరు మందంతో గ్రానైట్ రాతిని పరిచి దాని మీద ప్రధాన నిర్మాణం జరిపారు. ఇప్పుడు భూ ఉపరితలం నుంచి ప్రధాన నిర్మాణం 20 అడుగుల ఎత్తులో మొదలవుతుంది. అక్కడకు చేరాలంటే 32 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది.

వేయేళ్లు ఉండేలా...

అయోధ్య రామాలయం వేయి సంవత్సరాల వరకు పటిష్ఠంగా ఉండేలా నిర్మిస్తున్నారు. ఇది జరగాలంటే పెద్దపెద్ద భూకంపాలను కూడా తట్టుకుని నిలబడే నిర్మాణం అవసరం. ఇందుకోసం రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు నిర్మాణ డిజైన్‌లో పాలుపంచుకున్నారు. నేపాల్‌నుంచి అయోధ్య వరకు గతంలో సంభవించిన భూకంపాల తీవ్రతను పరిశీలించి వాటికి 50 రెట్లు పెద్ద భూకంపాలను కూడా తట్టుకునేలా డిజైన్‌చేశారు.

వరదలను తట్టుకునేలా...

అయోధ్య నగరం మీదుగా సరయూ నది ప్రవాహం గతంలో ఉండేది. ఇప్పుడు నగర శివారు గుండా ప్రవహిస్తోంది. ప్రతి వేయి సంవత్సరాల్లో నదీ ప్రవాహ గమనం మారడం సహజం. భవిష్యత్‌లో ఎప్పుడైనా ఇప్పుడు గుడి నిర్మిస్తున్న ప్రాంతం మీదుగా వరద పోటెత్తినా, పెద్దపెద్ద వరదలు సంభవించినా నిర్మాణానికి ఇబ్బంది లేకుండా ఉండేలా దాని పునాది పైన పీఠం ప్లాన్ చేశారు. ఇందుకు సీఎస్ఐఆర్ శాస్త్రవేత్తల సిఫారసులను అనుసరించారు.

60 కిలోల బంగారంతో తాపడం

ఆలయంలోని తలుపులకు బంగారంతో తాపడం చేయించనున్నారు. అన్ని తలుపులకు కలిపి 60 కిలోల బంగారాన్ని వినియోగిస్తున్నట్టు సమాచారం. దిగువ అంతస్తు బాలరాముడి ఆలయ తలుపులకు తాపడం పనులు ప్రారంభించారు. అనంతరం తాపడం కోసం సిద్ధం చేశారు. తలుపులపై ఉన్న నగిషీల తరహాలోనే బంగారు తాపడంపై కూడా సిద్ధం చేస్తున్నారు.



పునాది డిజైన్ మార్చింది తెలుగు ఇంజినీరింగ్ నిపుణుడే..!



మందిర పునాది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నిట్ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు

అయోధ్య మందిరానికి ప్రస్తుతం ఏర్పాటు చేసిన పునాదికి డిజైన్ చేసింది తెలంగాణకు చెందిన ఇంజినీరింగ్ నిపుణుడే కావటం విశేషం. తొలుత ఐఐటీ మద్రాస్ నిపుణులు పునాది కోసం సిమెంటు కాంక్రీట్ పైల్స్ డిజైన్ ఇచ్చారు. ఆలయ ట్రస్టు దానికి సమ్మతించి పనులకు శ్రీకారం చుట్టింది. ఒక్కోటి మీటర్ వ్యాసం, 40 మీటర్ల లోతుతో సిమెంట్‌కాంక్రీట్‌పైల్స్‌ను పునాదిలో నిర్మించాలని నిర్ణయించారు. ఇలా 1200 పైల్స్ ఏర్పాటు చేసి దాని మీద ప్రధాన నిర్మాణం చేపట్టాలన్నది వారి ఆలోచన. కానీ, సిమెంటు కాంక్రీట్‌పైల్స్ వయసు కేవలం వందేళ్ల లోపు మాత్రమే ఉంటుందని పేర్కొంటూ, వరంగల్ నిట్ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావు ప్రధాన మంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. దాని బదులు కాకతీయులు అనుసరించిన శాండ్‌బాక్స్ టెక్నాలజీని వినియోగిస్తే వెయ్యేళ్ల జీవిత కాలం ఉంటుందని రామప్ప, వేయి స్తంభాల దేవాలయాలపై నిర్వహించిన పరిశోధన పత్రాలను జత చేశారు. దీంతో ఆయనకు ట్రస్టు నుంచి పిలుపు వచ్చింది. విశ్వహిందూ పరిషత్ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పాండురంగారావు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ప్రతినిధులతో పునాది నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఒక నిపుణుల కమిటీని నియమించారు. నిర్మాణ ప్రాంతం గుండా వందల ఏళ్ల కింద సరయూ నది ప్రవహించటంతో భూమి పొరల్లో ఇసుక మేటలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆ కమిటీ కూడా నాటి పునాది డిజైన్‌ను తిరస్కరించింది. తర్వాత 50 అడుగుల మేర మట్టిని తొలగించి రీయింజనీర్డ్ ఇసుక, దానికి కొన్ని రసాయనాలు, స్వల్ప మొత్తంలో ఫైన్ సిమెంట్ కలిపి పొరలు పొరలుగా వేసి కంప్రెస్ చేయాలంటూ సిఫారసు చేసింది. అలా చేస్తేనే పునాది కనీసం వెయ్యేళ్ల పాటు ఉంటుందని పేర్కొంది. పాండురంగారావు సూచన మేరకే కొత్త పునాది ప్రణాళిక అమలు చేసి, వెయ్యేళ్లపాటు నిలిచే రీతిలో ఆలయ నిర్మాణాన్ని చేపట్టడం విశేషం.

25 వేల మంది సామర్థ్యంతో త్వరలో బస ఏర్పాట్లు...

ఆలయానికి చేరువలో భక్తులకు వసతి మందిరం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతానికి దీంట్లో 25 వేల మంది వరకూ ఉండొచ్చు. ఈ గదులను ఉచితంగా అందిస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటారు. లక్షమంది భక్తులకు వసతి ఉండేలా గదులు సిద్ధం చేయాలన్న ఆలోచనలో ట్రస్టు ఉంది. అయితే సొంతంగా ఏర్పాటు చేయాలా, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలా అన్న దానిపై ఆలోచన చేస్తున్నారు.

ప్రతి శ్రీరామనవమీ ప్రత్యేకమే!

- నవమి నాడు బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు
- ప్రధాని మోదీ కోరికకు తగ్గట్టుగా నిర్మాణం

అయోధ్య రామమందిరంలో ప్రతి శ్రీరామనవమి ప్రత్యేకంగా నిలవబోతోంది. ఆ రోజు సూర్యోదయ వేళ ఆలయ దిగువ అంతస్తు గర్భాలయంలోని బాల రాముడి విగ్రహ నుదుటిపై సూర్యకిరణాలు ప్రసరించనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఆకాంక్షను ట్రస్టు ముందర ఉంచారు. ఆ మేరకు నిర్మాణం జరుగుతోంది. కిరణాలు దిగువ అంతస్తులోని గర్భాలయంలోకి ప్రసరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా గర్భాలయం ద్వారం ఎత్తు, విగ్రహ ఎత్తును ఖరారు చేశారు. చాలా విశాలమైన దేవాలయం కావటంతో సహజసిద్ధంగా సూర్యకిరణాలు లోనికి వచ్చే వీలు ఉండదేమోనన్న ఉద్దేశంతో ప్రతిబింబం రూపంలో సూర్యకాంతి లోపలకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆ తలుపుల తయారీలో తెలుగువారు...





శరత్ బాబు చదలవాడ

ప్రధాన ఆలయానికి తలుపులు అమర్చే అవకాశం హైదరాబాద్‌కు చెందిన అనురాధా టింబర్ డిపోకు దక్కింది. డిపో నిర్వాహకుడు శరత్ బాబు చదలవాడ గతంలో యాదాద్రి మందిరానికి తలుపు చేయించారు. అయోధ్య రామ మందిరానికి తలుపుల నమూనా కావాలంటూ ట్రస్టు సభ్యుల నుంచి పిలుపు రావటంతో ఆయన టేకుతో దాన్ని సిద్ధం చేయించారు. ఆ పనితనానికి సంతృప్తి చెందిన కమిటీ ఆయనతో చర్చించి తలుపులు సిద్ధం చేసే బాధ్యత అప్పగించింది. మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి తెప్పించిన మేలిమి రకం టేకు చెక్కతో తలుపులు రూపొందిస్తున్నారు. అయోధ్యలోని కరసేవక్ పురంలోని కార్యశాలలో ఈ తలుపులను నిపుణులు సిద్ధం చేస్తున్నారు. అక్కడి ఇన్‌చార్జ్ ఆర్యన్‌మిశ్రా ఆధ్వర్యంలో తమిళనాడుకు చెందిన నిపుణులు వాటిని రూపొందిస్తున్నారు. మొత్తం 44 తలుపులకుగాను ప్రస్తుతానికి 18 సిద్ధమయ్యాయి. వీటిని దిగువ అంతస్తులో వినియోగిస్తారు. బాలరాముడు ఉండే గర్భాలయానికి సంబంధించి రెండు జతలు పూర్తి చేసి ఆలయానికి చేర్చారు. 9 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పుతో ఇవి రూపొందాయి. నెమలి పురి విప్పుకున్నట్టు వీటిపై నగిషీలద్దారు. ఇక అంతస్తులోని ఇతర ప్రాంతాల్లో వాడే తలుపులకు ఏనుగు అర్చిస్తున్నట్టుగా.. పద్మాలు విచ్చుకున్నట్టుగా... ఇలా పలు చెక్కడాలతో అద్భుతంగా రూపొందించారు. వెయ్యేళ్లపాటు వర్ధిల్లే దేవాలయానికి తలుపులు సిద్ధం చేసే అవకాశం రావటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్టు చదలవాడ శరత్‌బాబు 'సాక్షి'తో చెప్పారు.



అయోధ్య సర్వం రామమయం...
హైవేపై రాముడి రూపం ...

అయోధ్య రాముడి విరాళాలు రూ.3500 కోట్ల పైమాటే...

ఆలయ నిర్మాణానికి అటు కేంద్రం నుంచి ఇటు రాష్ట్రప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోవటం లేదని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇప్పటికే ప్రకటించింది. పూర్తిగా భక్తులు సమర్పించిన విరాళాలతోనే పనులు చేస్తున్నట్టు వెల్లడించింది. ఇప్పటి వరకు ఆలయానికి ప్రపంచవ్యాప్తంగా రామభక్తుల నుంచి రూ.3500 కోట్లకు పైగానే విరాళాలు అందినట్టు సమాచారం. వాటి ద్వారా వస్తున్న వడ్డీ మొత్తంతోనే ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు. భక్తులు ఇప్పటికీ విరాళాలు సమర్పిస్తూనే ఉన్నారు. అయోధ్య ఆలయ సమీపంలో ఉన్న కౌంటర్లు, తాత్కాలిక మందిరం వద్ద ఉన్న కౌంటర్లతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా భక్తులు విరాళాలు సమర్పిస్తూనే ఉన్నారు. ప్రతినెలా రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు అవి సమకూరుతున్నట్టు సమాచారం.

అప్పట్లో రోజుకు 2 వేల మంది.. ఇప్పుడు 50 వేల మంది.. రేపు లక్ష?



అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి కాకముందే భక్తుల తాకిడి పెరిగింది. ఇక్కడ ఆలయ నిర్మాణం ప్రారంభం కాకమునుపు రోజుకు సగటున 1500 నుంచి 2000 మంది వరకు వచ్చేవారు. ఆలయ పనులు మొదలయ్యాక ఆ సంఖ్య ఒక్కసారిగా పది వేలకు పెరిగింది. ఇప్పుడు నిత్యం 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు అయోధ్యకు వస్తున్నారు. జనవరి 22 ప్రాణ ప్రతిష్ఠ తర్వాత ఆ సంఖ్య లక్షకు చేరువవుతుందని అంచనా వేస్తున్నారు.

స్పోర్ట్స్



2028 వరకు ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌గా 'టాటా గ్రూప్'

ప్రపంచ వ్యాప్త క్రికెట్ అభిమానుల్ని చూరగొన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను భారత దిగ్గజ సంస్థ 'టాటా' గ్రూప్ పొడిగించుకుంది. ఐదేళ్ల కాలానికి రూ.2500 కోట్ల భారీ మొత్తంతో కొత్తగా ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఈ సీజన్ నుంచి 2028 వరకు మళ్లీ టాటా ఐపీఎల్‌గా అలరించనుంది. టాటా సంస్థ గత రెండేళ్లుగా ఐపీఎల్‌తో కొనసాగుతోంది. 2022, 2023 సీజన్లలో టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. తాజా ఒప్పందం విలువ ఐపీఎల్ టైటిల్ హక్కుల చరిత్రలోనే అత్యధిక మొత్తమని బీసీసీఐ తెలిపింది.

భారత్, ఇంగ్లండ్ టెస్టుకు ఏర్పాట్లు పూర్తి...



హైదరాబాద్‌లో ఈనెల 25 నుంచి జరగనున్న భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఇప్పటికే 26 వేల టికెట్లు అమ్ముడుపోయాయని ఆయన తెలిపారు. మొత్తం 25 వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. భారత జట్టు శనివారమే నగరానికి చేరుకోగా, ఇంగ్లండ్ నేడు అడుగు పెడుతుంది.

యువ భారత్ బోణీ

- తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 84 పరుగులతో విజయం
- ఆదర్శ్, ఉదయ్ అర్ధ సెంచరీలు



బ్లూమ్‌ఫోంటెన్ (దక్షిణాఫ్రికా): డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. మాజీ విజేత బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 84 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆదర్శ్ సింగ్ (76; 6 ఫోర్లు), కెప్టెన్ ఉదయ్ (64; 4 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. హైదరాబాద్ క్రికెటర్ అరవెల్లి అవినాశ్ రావు (17 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. బంగ్లాదేశ్ బౌలర్ మారుఫ్ 43 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. 252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 45.5 ఓవర్లలో 167 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. భారత బౌలర్లలో సౌమీ పాండే (4/24), ముషీర్ ఖాన్ (2/35) రాణించారు. గురువారం జరిగే తదుపరి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ తలపడుతుంది. శనివారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ ఏడు వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై, పాకిస్తాన్ 181 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో శ్రీలంకతో జింబాబ్వే; నేపాల్‌తో న్యూజిలాండ్ ఆడతాయి.

విడిపోయిన సానియా–షోయబ్

- చాలా రోజులుగా దూరం దూరం
- షోయబ్ మూడో పెళ్లితో బహిర్గతమైన విషయం




కరాచీ/న్యూఢిల్లీ: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్‌ల 14 ఏళ్ల వివాహ బంధానికి విడాకుల కార్డు పడింది. ఇది జరిగి చాన్నాళ్లే అయినా... సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొడుతున్నా... ఇరు వర్గాల నుంచి అధికారికంగా 'అవును... కాదు' అనే మాట రాలేదు! ఎలాంటి స్పష్టత లేదు. కానీ షోయబ్ ముచ్చటగా మూడోసారి ఓ ఇంటి వాడు కావడంతోనే ఇద్దరి వైవాహిక బంధం ముక్కలైనట్లు అధికారికంగా... ఆలస్యంగా తెలిసింది. పాకిస్తాన్ నటి సనా జావేద్‌ను పెళ్లి చేసుకున్న షోయబ్ తన 'ఎక్స్' (ట్విటర్) ఖాతాలో ఫొటోల్ని పంచుకున్నాడు. 41 ఏళ్ల ఈ పాక్ క్రికెటర్‌కు ఇది మూడో పెళ్లి. హైదరాబాదీ అమ్మాయి అయేషా సిద్ధిఖికు తలాక్ ఇచ్చాకే సానియా మీర్జాను 2010 ఏప్రిల్ 12న హైదరాబాద్ వేదికగా షోయబ్ మాలిక్ రెండో వివాహం చేసుకున్నాడు. నటి సనా జావేద్‌కేమో ఇది రెండో పెళ్లి. ఆమె 2020లో పాకిస్తాన్ సినీ గాయకుడు, రచయిత ఉమైర్ జైస్వాల్‌ను వివాహమాడింది. అయితే వీరిద్దరి బంధం 2023లో ముగిసింది. తాజాగా సోషల్ మీడియా 'ఎక్స్'లో షోయబ్ మాలిక్–సనా జావేద్‌ల పెళ్లి ఫోటోలు వైరల్ కావడంతోనే బయటి ప్రపంచానికి సానియా–షోయబ్‌ల పెళ్లి పెటాకులైనట్లు తెలిసింది. అంతవరకు గుసగుసలే వినిపించేవి! ఇక ఈ విషయాన్ని టెన్నిస్ స్టార్ కుటుంబ వర్గాలు ధ్రువీకరించక తప్పలేదు. 'అవును... వాళ్లిద్దరు విడిపోయారు. ఇది 'తలాక్' కాదు... 'ఖులా' ప్రకారం వారి బంధం రద్దయింది. ఇంతకుమించి చెప్పడానికి మా దగ్గరేమీ లేదు' అని కుటుంబ వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబర్‌లో తనయుడు ఇజ్‌హాన్ ఐదో పుట్టిన రోజు వేడుకలకు షోయబ్ హాజరయ్యాడు. అయితే ఈ వేడుకల ఫొటోలను షోయబ్, సానియా వేర్వేరుగా తమ సోషల్ మీడియా అకౌంట్లలో పంచుకున్నారు.

అప్పుడు నిశ్చితార్థం... ఇప్పుడు వివాహం!

37 ఏళ్ల సానియాకు తన ప్రొఫెషనల్ కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదురైనట్లే వ్యక్తిగత జీవితంలోనూ ఎదురయ్యాయి. ముందుగా కుటుంబ మిత్రులైన సొహ్రాబ్‌తో సానియాకు నిశ్చితార్థం కూడా ఘనంగానే జరిగింది. కానీ కొన్ని నెలల వ్యవధిలోనే పెళ్లిదాకా రాకుండానే ఆ బంధం ముగిసింది. అనంతరం పాకిస్తానీ మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్‌ను వివాహమాడింది. వీరికి ఐదేళ్ల కుమారుడు ఇజ్‌హాన్ ఉన్నాడు. ప్రస్తుతం తల్లి సానియా దగ్గరే ఇజ్‌హాన్ పెరుగుతున్నాడు. తన 20 ఏళ్ల అంతర్జాతీయ టెన్నిస్ కెరీర్‌లో సానియా మొత్తం 43 డబుల్స్ టైటిళ్లు సాధించింది. ఇందులో మూడు మహిళల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్, మూడు మిక్స్‌డ్ డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ ఉన్నాయి.

ఇది తలాక్ కాదు... ఖులా!

సరిగ్గా 14 ఏళ్ల క్రితం 2010 ఏప్రిల్ 12న టెన్నిస్ స్టార్ సానియా, పాకిస్తాన్ క్రికెట్ స్టార్ షోయబ్ మాలిక్ వివాహం అంగరంగ వైభవంగా హైదరాబాద్‌లోని ఓ స్టార్ హోటల్‌లో జరిగింది. ఈ బంధం 12 ఏళ్ల పాటు 2022 వరకు సజావుగానే సాగింది. ఇరువురు తమ కెరీర్‌ను కొనసాగిస్తూనే దుబాయ్‌లో కాపురం పెట్టారు. అన్యోన్యంగా సాగిన వీరి కాపురం రెండేళ్ల క్రితం బీటలు వారింది. కెరీర్‌కు రిటైర్మెంట్ పలికి వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయిస్తున్న సమయంలో పొరపొచ్చాలు రావడంతో సానియా మీర్జా నుంచే విడాకుల ప్రతిపాదన వచ్చింది. ఇస్లాం చట్ట ప్రకారం దీన్ని 'ఖులా' అంటారు. వివాహ బంధం నుంచి భార్య ఏకపక్షంగా విడిపోవాలనుకుంటే 'ఖులా'తో రద్దు చేసుకోవచ్చు. దీనికి భర్త నుంచి భరణం, ఇతరత్రా లాంఛనాలు పూర్తి చేయాల్సిన అవసరం ఉండదు. తలాక్ అనేది భర్త రద్దు చేసుకునే విడాకుల ప్రక్రియ. కొంతకాలంగా ఇద్దరు ఎడమొహం పెడమొహంగా ఉండటంతో 2022లోనే వివాహరద్దు తంతు వివాదాస్పదం కాకుండా జరిగిపోయిందని సమాచారం.

భారత షూటర్లకు మరో రెండు ఒలింపిక్ బెర్త్‌లు


రైజా


అనంత్

కువైట్ సిటీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత షూటర్ల సంఖ్య 19కు చేరుకుంది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షాట్‌గన్ టోర్నమెంట్‌లో మహిళల స్కీట్ విభాగంలో రైజా ధిల్లాన్... పురుషుల స్కీట్ విభాగంలో అనంత్ జీత్ సింగ్ నరూకా రజత పతకాలు సాధించారు. తద్వారా ఈ రెండు కేటగిరీల్లో భారత్‌కు రెండు ఒలింపిక్ బెర్త్‌లను ఖరారు చేశారు. ఫైనల్స్‌లో 19 ఏళ్ల రైజా 52 పాయింట్లు స్కోరు చేయగా... అనంత్ 56 పాయింట్లు సాధించాడు. ఈ రెండు బెర్త్‌లతో ఈసారి భారత షూటర్లు ఒలింపిక్స్‌లో అన్ని మెడల్ ఈవెంట్స్‌కు అర్హత సాధించడం జరిగింది.

స్వియాటెక్‌కు షాక్

- మూడో రౌండ్‌లోనే ఓడిన ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్
- చెక్ రిపబ్లిక్ టీనేజర్ నొస్కోవా సంచలన విజయం


స్వియాటెక్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో శనివారం పెను సంచలనం నమోదైంది. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల లిండా నొస్కోవా తన కెరీర్‌లోనే గొప్ప ప్రదర్శన చేసి నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత స్వియాటెక్‌ను బోల్తా కొట్టించింది. 2 గంటల 20 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 50వ ర్యాంకర్ నొస్కోవా 3–6, 6–3, 6–4తో స్వియాటెక్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మాజీ చాంపియన్ అజరెంకా (బెలారస్), 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా), 19వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు.

ఎట్టకేలకు టైటాన్స్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు రెండో విజయాన్ని సాధించి సొంత ప్రేక్షకుల్ని మురిపించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 49–32 స్కోరుతో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ (16 పాయింట్లు), ఓంకార్ (10) రాణించారు. అంతకుముందు జరిగిన తొలిపోరులో దబంగ్ ఢిల్లీ 39–33తో యు ముంబాపై నెగ్గింది.

ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ



న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి వరుసగా రెండో టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. గతవారం మలేసియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్–చిరాగ్ ద్వయం... తాజాగా ఇండియా ఓపెన్‌లోనూ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–18, 21–14తో ఆరోన్ చియా–సో వు యిక్ (మలేసియా) జోడీని ఓడించింది. ఆరోన్–సో వు యిక్‌లతో ఇప్పటి వరకు 11 సార్లు ఆడిన సాత్విక్–చిరాగ్ మూడోసారి మాత్రమే గెలిచారు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రణయ్ 15–21, 5–21తో షి యు కీ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

హైదరాబాద్ ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో భాగంగా సిక్కిం జట్టుతో రెండు రోజుల్లోనే ముగిసిన మూడో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 198 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆట రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 381/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 78.1 ఓవర్లలో 4 వికెట్లకు 463 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ ఠాకూర్ తిలక్ వర్మ (111 బంతుల్లో 103 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. 384 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సిక్కిం జట్టు 48.3 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. హైదరాబాద్ బౌలర్లు సీవీ మిలింద్ (3/14), తనయ్ (3/75), పొలకోడేటి సాకేత్ సాయిరామ్ (2/52), కార్తికేయ (2/10) సిక్కిం జట్టును దెబ్బతీశారు.

సినిమా

రంజాన్‌కు పెద్దోడు.. చిన్నోడు...


● టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్

రంజాన్‌కు థియేటర్స్‌కు వస్తున్నారు 'బడే మియా చోటే మియా' (పెద్దోడు.. చిన్నోడు). అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'బడే మియా చోటే మియా'. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, సోనాక్షీ సిన్హా, మానుషీ చిల్లర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హిందీలో 'సుల్తాన్', 'టైగర్ జిందా హై' వంటి హిట్ సినిమాలను తీసిన దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. స్కాట్లాండ్, యూఎస్, ఇండియా, లండన్ వంటి లొకేషన్స్‌లో కొంత భాగం చిత్రీకరణ జరిగింది. కాగా ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 24న విడుదల చేయనున్నట్లు, ఈ ఏడాది రంజాన్ సందర్భంగా సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'ప్రపంచం అంతం అవుతుందన్నప్పుడు మా హీరోలు మాత్రం రైజ్ అవుతుంటారు' అనే క్యాప్షన్‌ని ఈ పోస్టర్‌కు జత చేశారు.

విజయ్‌కి జోడీ ఎవరు?

రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' చిత్రంలోని జోయా పాత్రతో తెలుగు ప్రేక్షకులకూ దగ్గరయ్యారు హీరోయిన్ త్రిప్తి దిమ్రి. ఇప్పుడు ఈ బ్యూటీ టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ స్పై థ్రిల్లర్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ముందు శ్రీలీలను తీసుకున్నారు. కొన్ని కారణాలతో శ్రీలీల ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, ఈ స్థానంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపించింది. తాజాగా త్రిప్తి దిమ్రి, రుక్మిణీ వసంత్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. మరి.. ఈ ఇద్దర్లో ఎవరు విజయ్ దేవరకొండతో జోడీ కడతారు? లేక మరో హీరోయిన్ ఎవరైనా ఈ అవకాశాన్ని దక్కించుకుంటారా? అనేది చూడాలి. ఈ సినిమా షూటింగ్‌ను మార్చిలో ప్రారంభించాలనుకుంటున్నారు. సో.. రెండు నెలల్లో కథానాయిక విషయంలో క్లారిటీ వచ్చేస్తుంది.


● రుక్మిణి వసంత్
● త్రిప్తి దిమ్రి


బ్లాక్ మేజిక్

కథ బొగ్గు గనుల్లో జరుగుతోంది.. అక్కడ పనిచేసేవాళ్లు ఎలా కనిపిస్తారు? ఫుల్ డార్క్‌గా.. కథ బంగారు గనుల్లో జరుగుతోంది.. కానీ తవ్వేవాళ్లు బంగారంలా మెరిసిపోరు.. కమలిపోయిన చర్మంతో ఉంటారు. ఇక మత్స్యకారులో... వాళ్లూ అంతే.. స్కిన్ ట్యాన్ అయిపోతుంది. ఇప్పుడు కొందరు హీరోలు ఇలా ఫుల్ బ్లాక్‌గా, ట్యాన్ అయిన స్కిన్‌తో కనిపిస్తున్నారు. పాత్రలకు తగ్గట్టు బ్లాక్ మేకప్ వేసుకుని, సిల్వర్ స్క్రీన్‌పై మేజిక్ చేయడానికి రెడీ అయ్యారు. ఆ హీరోలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.


● ప్రభాస్

ట్యాన్... ట్యాన్


- 'కటౌట్ చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి డూడ్' అంటూ 'మిర్చి' సినిమాలో ప్రభాస్ ఓ డైలాగ్ చెబుతారు. నిజమే.. ఆయన కటౌట్ చూస్తే అలానే అనిపిస్తుంది. 'బాహుబలి' సినిమా నుంచి వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తూ అభిమానులను అలరిస్తున్నారాయన. ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'సలార్: పార్ట్ 1– సీజ్‌ఫైర్' డిసెంబరు 22న విడుదలై హిట్‌గా నిలిచింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో బొగ్గు గనుల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా బ్యాక్‌డ్రాప్ అంతా బ్లాక్‌గా ఉంటుంది. బొగ్గు గనుల్లో మెకానిక్ దేవ పాత్రలో ప్రభాస్ లుక్ కూడా బ్లాక్ షేడ్‌లో ఉంటుంది. రెండో భాగంలోనూ ప్రభాస్ ట్యాన్ లుక్‌లో కనిపిస్తారని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు..
- హ్యాండ్‌సమ్‌గా, పక్కింటి కుర్రాడిలా కనిపించే నాగచైతన్య 'తండేల్' సినిమా కోసం పక్కా మాస్ అవతారంలోకి మారిపోయారు. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. శ్రీకాకుళం మత్స్యకారుల జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో మత్స్యకారుని పాత్రలో నటిస్తున్నారు నాగచైతన్య. 2018లో జరిగిన వాస్తవ ఘటనలతో తెరకెక్కుతోంది.
- ప్రయోగాలు చేసే హీరోల్లో సూర్య ఒకరు. కమల్‌హాసన్ గత బ్లాక్ బస్టర్ మూవీ 'విక్రమ్' (2022)లో రోలెక్స్ పాత్రలో ట్యాన్ లుక్‌లో కనిపించారు సూర్య. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా క్లైమాక్స్‌లో ఈ పాత్ర వస్తుంది. రెండో భాగంలోనూ ఉంటుంది. సెకండ్ పార్ట్ చిత్రీకరణ ఇంకా ఆరంభం కాలేదు. అలాగే విడుదలకు సిద్ధమవుతున్న 'కంగువా' చిత్రంలో కొన్ని సన్నివేశాల్లో హీరో సూర్య ట్యాన్ లుక్‌లో కనిపిస్తారు.


● నాగచైతన్య


● సూర్య


31లో కొత్తగా...

హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌ల క్రేజీ కాంబినేషన్‌లో 'ఎన్టీఆర్ 31' (వర్కింగ్ టైటిల్) సినిమా ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. ఈ కాంబినేషన్‌లో సినిమా అనగానే ఎలా ఉంటుందో? అనే ఆసక్తి ఇటు చిత్ర వర్గాల్లో అటు సినిమా లవర్స్‌లో నెలకొంది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌లో ఎన్టీఆర్ పూర్తి నలుపు రంగు మేకప్‌లో కనిపించారు. ప్రశాంత్ నీల్ గత చిత్రాలు 'కేజీఎఫ్, కేజీఎఫ్ 2, సలార్'ల తరహాలో ఎన్టీఆర్ 31 బ్లాక్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని టాక్. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమా మొదటి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది. ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఎన్టీఆర్ 31' షూటింగ్ ఈ ఏడాదిలోనే ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, నందమూరి తారక రామారావు ఆర్ట్స్ పతాకాలపై ఈ సినిమా రూపొందనుంది. ''ఎన్టీఆర్ ఇప్పటి వరకు చేయని పాత్ర, కథతో 'ఎన్టీఆర్ 31' సినిమా చేయబోతున్నాను. ఇందులో మునుపెన్నడూ చూడని విధంగా ఎన్టీఆర్ కనిపిస్తారు'' అంటూ ప్రశాంత్ నీల్ ఆ మధ్య చెప్పిన సంగతి తెలిసిందే.


● ఎన్టీఆర్


గోల్డ్ ఫీల్డ్స్‌లో తంగలాన్

పాత్ర ఏదైనా అందులో పరకాయ ప్రవేశం చేస్తుంటారు విక్రమ్. దర్శకుడి విజన్ 100 శాతం అయితే విక్రమ్ 200 శాతం న్యాయం చేస్తారనడం అతిశయోక్తి కాదు. ఇప్పటికే ఎన్నో ప్రయోగాత్మక పాత్రల్లో నటించిన విక్రమ్ 'తంగలాన్' కోసం గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 19వ శతాబ్దం బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ డ్రామాగా రూపొందింది. బ్రిటిష్ పరిపాలన కాలంలో కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ వద్ద ఆక్రమణదారులకు ఎదురెళ్లి పోరాడిన ఓ ఆదివాసి తెగ నేపథ్యంలో ఈ చిత్రకథ ఉంటుందట. ఇందులో విక్రమ్ ఆ తెగ నాయకుడిగా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన విక్రమ్ ఫస్ట్ లుక్ పూర్తి స్థాయి నలుపులో ఎంతో వైవిధ్యంగా ఉంది. మాళవికా మోహనన్, పార్వతి తిరువోతు, పశుపతి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ సినిమాని తొలుత సంక్రాంతికి, ఆ తర్వాత రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఏప్రిల్‌లో రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల పేర్కొన్నారు.


● విక్రమ్


భ్రమయుగంలో...

దాదాపు 50 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించారు మమ్ముట్టి. అయితే ఇప్పటివరకూ పోషించనటువంటి సరికొత్త పాత్రని 'భ్రమయుగం' సినిమాలో పోషిస్తున్నారాయన. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'భ్రమయుగం'. హారర్ థ్రిల్లర్ జోనర్‌లో కేరళలోని కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి వాస్తవ ఘటనలతో ఈ చిత్రం రూపొందుతోంది. అక్కడి చీకటి యుగాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో మమ్ముట్టి పాత్ర పూర్తి నలుపు రంగులో ఉంటుంది. ఇటీవల విడుదలైన 'భ్రమయుగం' మలయాళ టీజర్ పూర్తిగా బ్లాక్ అండ్ వైట్‌లో ఉంది. ఆద్యంతం ఉత్కంఠతో సాగిన టీజర్‌లో సరికొత్త లుక్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు మమ్ముట్టి. రామచంద్ర చక్రవర్తి నిర్మిస్తున్న ఈ సినిమా మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.


● మమ్ముట్టి

గొర్రెల కాపరి

పృథ్వీరాజ్ సుకుమారన్ హ్యాండ్‌సమ్‌గా ఉంటారు. తన నటనతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన తొలిసారి 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా కోసం పూర్తి స్థాయిలో నల్లటి మనిషిగా మారిపోయారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' అనే నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు డైరెక్టర్ బ్లెస్సీ. హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలా పాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి సౌదీ అరేబియాకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథ ఆధారంగా వాస్తవ ఘటనలతో ఈ సినిమా రూపొందుతోంది. గొర్రెల కాపరి నజీబ్ పాత్రలో నటిస్తున్నారు పృథ్వీరాజ్. గుబురు గడ్డం, పొడవైన జుట్టుతో నలుపు రంగులో ఉన్న పృథ్వీరాజ్ లుక్ ఇటీవల విడుదలైంది. ఈ పాత్ర కోసం ఆయన బరువు తగ్గారు. పూర్తి స్థాయిలో ఎడారిలో రూపొందుతున్న తొలి భారతీయ సినిమా మాదేనంటూ చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏప్రిల్ 10న విడుదల కానుంది.


● పృథ్వీరాజ్

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



గౌడ/B.Tech/Govt.ఆఫీసర్/రెవెన్యూ Dept /80,000/-PM / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14949]

SC హిందూ మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ M.Tech/C.Govt. / ఇన్‌స్పెక్టర్ / కస్టమ్స్ Dept/ 80,000/-PM/6' ఎత్తు/ 29 సం॥ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-14949]

SC హిందూ మాల/కట్న ప్రసక్తి లేదు/ M.Tech/Govt.A.E / ట్రాన్స్‌కో /2 Lakhs. PM /5'11" ఎత్తు/ 29 సం॥ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-14949]

క్రిస్టియన్/ కట్నప్రసక్తిలేదు / 28 / 5'8"/ B.Tech/ C.Govt. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్/ 80,000/- / అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14950]

వడ్డెర/కట్నప్రసక్తిలేదు / B.Tech / Govt. బ్యాంక్ మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 80,000/- / 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14950]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech (సివిల్)/ C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 10 Lakhs PA/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 9676995093, 9703978131 [HA-14950]

SC మాల & క్రిస్టియన్/B.Tech (EEE), C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 85,000/- pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-14950]

SC మాదిగ/కట్నప్రసక్తిలేదు/28/5'10"/ B.Tech (IIT), ISRO, (C. Govt.) Scientific Officer, 20 Lakhs P/A వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9014591903 [HA-14950]

కుల పట్టింపులేదు/55 సం॥రాలు, C. Govt. Job, సొంత ఇల్లు ఏ బాధర బంధీలేని వారికి సాంప్రదాయ కుటుంబం పిల్లలు లేని లేట్, 2వ వివో వధువు కావలెను. Ph: 9499947658 [HA-14950]

గంగపుత్ర (బెస్త)/29/5'9"/ B.Tech/ MBA/Govt. Job/15L P/A/వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [HA-13015]

ఆర్యవైశ్య/30/5'9"/ B.Tech/ IIT/SWE/ Job/20L P/A/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8897091964 [HA-13015]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/ Rich Industrialist *B.Tech/ B.Tech/1990/6'/1000Cr *1989/5'11"/ 500Cr *1995/5'9"/ 500Cr * Cont: K.C. Reddy-Hyd-Ph:9347807015

Reddy/BIG Business *B.Tech/ MBA/ 1997/6'/150Cr *1995/6'/100Cr * 1994/ 5'11"/250Cr *1997/6'/400 Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Good Business B.Tech / 1997/ 5'11"/100Cr *1996/6'/100Cr *1997/6'/200Cr *1994/5'10"/ 100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/V.Good Business/ 1990/ 5'10"/25Cr/30L/M income *1993/ 5'7"/ 50Cr *1991/6'/100Cr *1994/5'11"/150Cr. *Cont : K.C. Reddy -Ph: 9347807015

Reddy/MBBS/PG-doc *1995/ 5'10"/ 400Cr *1996/6'/50Cr *1994/5'10"/50Cr *1993/5'10"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/MBBS/USA Doc *1995/5'8"/ 10Cr *1990/6'/50Cr *1991/5'10" *1989 / 5'9" *1998/5'8" *1992/5'11" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1 USA *1991/5'11"/ 200Cr *1997/6'/400Cr *1993/6'/100Cr * 1997/5'9"/60Cr *1995/5'9"/50Cr * Cont : K.C. Reddy-Hyd- Ph:9849321309

Reddy/IIT/B.Tech/IIM(MBA)/1994/5'9"/ 1Cr/yr/30Cr *1994/5'11"/70L/yr/25Cr * 1990/85L/yr *1996/5'7"/50L/yr/20Cr * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/India *B.Tech/ MBA/ 1981/5'8"/50L/M/500Cr *1979/ 5'9"/ 300Cr *1986/5'5"/1000Cr. *Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/Abroad *1986/ 5'11" /350 K/40Cr *USA-Doc/1982/ 5'8"/ 20 Cr *1977/5'6"/USA-Citizen. * Cont: K.C.Reddy-Hyd- Ph:9347807015

వరుడు కావలెను

Reddy/BIG Business/Family/B.Tech/ 1993/5'3"/ 500Cr *1997/5'4" / 150Cr * 1998/5'5"/100Cr * Cont: K.C. Reddy-Hyd Ph: 9347807015/9849321309

Reddy/ MBBS/PG *1999/5'4"/200Cr *1994/5'6"/DM/100Cr *1995/5'5"/100Cr *1998/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/USA/H1/MS *1998/5'4"/10Cr *1997/5'5"/10Cr *1996/5'8"/15Cr *1990/ 5'8"/30Cr *1996/5'5"/15Cr. * Cont:K.C. Reddy- Ph: 9347807015/9849321309

Reddy/IIT/BITS/USA /1994 / 5'4"/10Cr *1996/5'7" *1997/5'4"/200K *1995/ 5'6"/ 150K. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ IIT/BITS / India *1996 / 5'6" *1998 / 5'3 1/2"/70L/yr *1999 / 5'4"/ 32L/yr *2001/5'5". *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/Catholic *B.Tech / 1993/5'3"/ 100Cr *2000/5'4"/100Cr *Canada/PR 1996/5'6" * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/Rich Family *BA/1988/5'3"/200 Cr *MBA/1998/5'5"/100Cr *1994/ 5'3"/M.Sc / 200Cr *MBBS/5'6"/500Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Political Family *M.Sc / 1995/ 5'8"/ 100Cr *1997/5'5"/B.Tech/25Cr *B.Com/ 1997/5'5"/20Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Divorcee * B.Tech/1993 / 5'4"/ 10Cr *1985/5'5"/400Cr *1993/ 5'6"/50Cr *MBBS/MD/1994/ 5'5"/100Cr * Cont: K.C. Reddy. Ph: 9347807015

Reddy/(Divorcee)USA *MD / 1992/ 5'5"/8Cr *CA/1989/5'5"/25Cr * MD/1993/ 5'8"/40Cr *1987/5'8" *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

[D-635]

మాదిగ/30/5'8" / B.Tech / MBA / Job Govt/ 15L P/A (DRDO)/బాగా స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 6281925716 [HA-13015]

క్రిస్టియన్ SC/30 / 5'9" / B.Tech/ MBA/ SWE 24L P/A /వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9966260233 [HA-13015]

రెడ్డి/40/FAIR/5.6' B.Tech Software Employee any 1st and 2nd FAIR అందమైన అమ్మాయి తోడుకు కావలెను. Direct Contact: 73375 86682. [L-606329]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి USA Citizen, BS, 27, 6' 1", Engineering, 100 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, Residency Doctor, 32, 6' 1", 30 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, BE, MS, 30, 5' 10", Qualcomm, 300 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, Seattle, BS, 29, 6', Sr SWE, 200 K, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి USA, Citizen, BS, 24, 5' 10", Data Analyst, 25 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, BE, MS, 26, 5'6", SWE, 200 K, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి San Francisco, BE, MS, 26, 5' 3", SWE, 25 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA (IIM), 28, 5' 7", 30 L P/A, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి California, BE, MS, 28, 5' 11", Engineer, H1, 200 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 30, 6', Software Developer, 140 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Texas, BE, MS, 29, 5'8", Engineer, 160 K, 30 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5' 10", USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, 27, 5' 5", SWE, 120 K, H1, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Seattle, BE, MS, 27, 5' 7", 129 K, 4 Crores, H1, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, BE, MS, 26, 5' 5", Sr SWE, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Dallas, BE, MS, 32, 5' 5", SWE, 100 K, H1, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

గూగుల్‌లో పనిచేయుచున్న 27 ఏండ్ల ఫెయిర్, 5 ఫీట్ 8 అంగుళాల క్రైస్తవునికి భక్తి కలిగిన వధువు కావలెను. సంప్రదించండి. సెల్ : 8332921163 [HA-95934]

మాల/48/5'2"/1st మ్యారేజ్ (తెల్ల మచ్చల పూత)/ TS Govt/ 70K PM/సొంత ఇల్లు ఉన్న వరునికి ఇంటర్ చదివిన, మధ్యతరగతి వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788246]

మాల/కట్న ప్రసక్తి లేదు/49/5'1st మ్యారేజ్/ ప్రైవేట్ టీచర్/1.10L PM/ సొంత ఇల్లు ఉన్న వరునికి డిగ్రీ/పీజీ చదివిన 45 సం॥ 1st మ్యారేజ్ వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్. 9505094217, 9347086440 [H-788245]

రెడ్డి/లేట్ మ్యారేజ్ / 34y / నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి టీచ్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-601458]

బిసి /కుల పట్టింపు లేదు / విడోయర్/ వయస్సు 60 సం॥లు/పెన్షనర్ వరునకు OC/BC వధువు కావలెను. డైరెక్ట్ (నో బ్రోకర్స్) సంప్ర: 8309158580 [HA-14958]

అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35, M.Sc., M.Ed., D.Ed ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, ఆస్తి 40 లక్షలు నల్లగొండ. సెల్ : 9121325068 [Y-798309]

★★

శెట్టిబలిజ/36/5'11"B.Tech/ I1 40/USA/32/ 5'5"/B.Tech MS/H1B/USA *38/5'8"/ B.Tech/ Sr. Manager/NTPC *34/5'5"/ B.Tech MS/ H1B/ USA అబ్బాయిలకు తగిన శెట్టిబలిజ అమ్మాయిలు కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, HYD, S. రాములు గౌడ్ 8790690309 [H-601513]

డైరెక్ట్/40/ M.Com, B.Ed/ 5.5/ Own Shop ఉన్న వరుడికి కుల, వయసు ప్రసక్తి లేని వధువు పెళ్లి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయినా Ok. డైరెక్ట్-Ph: 85199 34926. [L-606333]

వరుడు కావలెను



2వ పెళ్లి/36yrs/ డైవర్సీ / Govt. ఎంప్లాయ్/ 2,00,000/-(PM)/ కుల పట్టింపు లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి తగిన వరుడు కావలెను (పిల్లలు ఉన్నా) సంప్ర: 8332006483 [H-787964]

కాపు/35yrs/కుల పట్టింపులేదు / 1st మ్యాచ్/Govt. ఎంప్లాయ్/70K (PM)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 9492081545 [H-787964]

రెడ్డి/విడో / 27y / M.Tech /2L PM/ కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-787778]

కుల ప్రసక్తి లేదు/విడో / 48y NPPA (Dept)/ 1 L PM/Own House/ 27 ఎ॥ తోటలు/ కోట్ల ఆస్తులు కలిగిన ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8121779241 [H-787778]

రెడ్డి/29y/డైవర్సీ / BE/1.2L P/M / 6 ఎ॥ ఫార్మ్‌ల్యాండ్/Own House గల పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9640667754 [H-787778]

రెడ్డి/విడో/55y/Fair/Hydలో Own House (Rents)/ Own Business (1) పాప USAలో సెటిల్డ్ గల Well Settled ఏ భాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. (సపోర్ట్ ఉండును). Ph: 7997175138 [H-787778]

కాపు/ 25y / M.Com & MBA/1 L PM/Own Plots in Hydకోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985746131 [H-787778]

క్రిస్టియన్ మాల /ఏకైక కుమార్తె / MBBS/ MD/డాక్టర్/5'5"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు Any Govt/SWE/Any PG వరుడు కావలెను. Ph: 8297439565 [HA-14949]

క్రిస్టియన్ మాదిగ/ 50 లక్షల ఆస్తి / B.Tech / C.Govt.Asst.మేనేజర్/కెనరా బ్యాంక్/10 Lakhs. PA/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14949]

రెడ్డి/30yr/5'4"/కుల పట్టింపులేదు/ ఫెయిర్/MA, B.Ed Govt.ఎంప్లాయ్/60K (PM)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం, 1st & 2nd మ్యాచ్ OK) సంప్ర : 8008474869 [H-787964]

రెడ్డి/విడో/53Y/Nelloreలో సొంత ఫ్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-787964]

రెడ్డి/(కుల పట్టింపు లేదు)/30y/5'3"ఎత్తు/పెద్ద ప్రాపర్టీ కలిగి తండ్రి లేని వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను (ఆస్తి పట్టింపు లేదు) Photos, Whatsapp send me. 9885492498 [H-787964]

రెడ్డి/విడో/60y/రిటైర్డ్ పెన్షనర్ / సొంత ఇల్లు & రెంట్స్/పొలాలు/ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు Ph: 8125290259 [H-601514]

బ్రాహ్మిణ్/విడో / 59y / సెంట్రల్ Govt. ఎంప్లాయ్/3 ఎకరాల పంట పొలం/సొంత ఇల్లు కలిగిన ఒంటరి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9381991912 [H-601514]

కమ్మ/విడో/58y/V.Fair/ప్రభుత్వ పెన్షనర్ /సొంత ఇల్లు గల వెల్ సెటిల్డ్ వధువుకు స్నేహ స్వభావం గల వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 9030993696 [H-601514]

కమ్మ/విడో/59y/5'5"/V.Fair / ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు & రెంట్స్/బిజినెస్/20 ఎకరాల పొలం/ 3L/PM/ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-601514]

రెడ్డి/45yr/2nd మ్యాచ్/కుల పట్టింపు లేదు/Govt. ఎంప్లాయ్/90K (PM)/వెల్ సెటిల్డ్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 8374802603 [H-601514]

రజక/ B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్/ SBI / 45,000/- pm / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14950]

క్రిస్టియన్ మాల/25/5'4" / B.Tech/ C.Govt. బ్యాంక్ Asst. మేనేజర్ / కెనరా బ్యాంక్/60,000/- pm/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14950]

రెడ్డి విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తిలేదు/ Age: 29, Qly: డిగ్రీ/ సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికము Ok). Ph: 8143011223 [HA-14950]

కమ్మ/కుల, పట్టింపులేదు / 55yrs / 2nd మ్యాచ్ అయినా Ok / 5'4"/ ఫెయిర్/ Govt. జాబ్ 95K (pm)/ No Children/ ఒంటరి/ ఇల్లరికం కావలెను. Ph: 9581120134 [HA-14950]

CNB/డైవర్సీ/II Match / 45 / 5'4"/ B.Tech/ MBA/SWE/Job 15-L/PA/వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 7702195227 [HA-13015]

37Yrs/Govt.Emp/2వ పెళ్లి/3,00,000/-PM/ Any Profession / కుల ప్రసక్తి లేదు/బాగా స్థిరపడిన అమ్మాయికి, అబ్బాయి కావలెను. పిల్లలు ఉన్నా ఇబ్బంది లేదు, ఇల్లరికం. 9381696641 [H-788196]

★★

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29, Qly: డిగ్రీ/Own Business/ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9573774689 [HA-14953]

వేదికలు



ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 7702955854 [H-793580]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14951]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14951]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14951]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14951]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14951]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! వ్యక్తిగతంగా పెళ్లి సంబంధాలు చూడాలా!! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, ఆబ్రాడ్,VIP అన్ని కులాలకు Fast Settelment పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1985]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-1-2024వ తేదీ ఉ॥ 9 గం॥లకు 64వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ 2॥లకు 19వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలోజరుగును. ✆ 99895 00130 [B-1234]

150ంॢ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 [B-610]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 97046 56103, 9533608887 (Whatsapp) [HA-950]



టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ దంపతులు శనివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో ఉన్న సమతామూర్తి కేంద్రాన్ని దర్శించుకుని చినజీయర్‌స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సమతాకుంభ్- 2024 ఆహ్వానపత్రికను చినజీయర్ స్వామి అందించారు.

– శంషాబాద్ రూరల్

రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు

- కారు నడిపిన 18ఏళ్ల సాజిద్
- ముగ్గురు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో ఘటన



వేగం ధాటికి నుజ్జునుజ్జయిన కారు

పహాడీషరీఫ్ (హైదరాబాద్): అతివేగంతో ప్రయాణిస్తూ.. ఓ కారు రోడ్డు మలుపు వద్ద ఎదురుగా ఉన్న రెయిలింగ్ ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడి కక్కడే మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ ఫతేదర్వాజాకు చెందిన రాజ్‌మహ్మద్ కుమారుడు మహ్మద్ సాజిద్ (18) కారులో తన స్నేహితులైన (ప్రైవేటు ఉద్యోగులు).. హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్ (22), నయీముద్దీన్(21), లంగర్ హౌజ్‌కు చెందిన నాజియా బేగం(23), టోలిచౌకికి చెందిన ముస్కాన్ మెహరాజ్ (21)లతో కలిసి శుక్రవారం రాత్రి సరదాగా బయటకు వచ్చారు. చాంద్రాయణగుట్ట నుంచి పహాడీషరీఫ్ మీదుగా జల్‌పల్లి కార్గో రోడ్డు వైపు వెళ్లాలని భావించి మామిడిపల్లి గుట్టలపై నిర్మించిన నూతన రోడ్డు వైపు మళ్లారు. మలుపులుగా ఉన్న రహదారిపై అవగాహన లేకపోవడంతో అతివేగంతో వెళ్లి రోడ్డు చివర్లో ఉన్న రెయిలింగ్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న సాజిద్‌తో పాటు వెనక సీట్లో కుడివైపు కూర్చున్న అక్బర్, నాజియాబేగం అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న నయీముద్దీన్, ఆ వెనక సీట్లోనే కూర్చున్న ముస్కాన్ మెహరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. 100 కిలోమీటర్ల వేగంతో గుద్దుకోవడంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జయి రెయిలింగ్‌లో ఇరుక్కుపోయింది. పోలీసులు వెంటనే క్షతగాత్రులను మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సాజిద్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కారులో మద్యం ఆనవాళ్లు కనిపించలేదని, డ్రగ్స్‌లాంటివేమైనా తీసుకున్నారా అనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో తేలుతాయని పోలీసులు వెల్లడించారు.

అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్‌వీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసన సభ సమావేశాల్లో అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించే విధంగా పీఓటీ చట్టం–1977కు సవరణ చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'అసైన్డ్ భూ ములకు శాశ్వత హక్కుల సాధన సమితి'ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, సామాజిక వేత్తలు మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూము లు ఉన్నాయని, ఈ భూముల్లో పట్టాలు పొందిన పేద రైతులకు హక్కులు కల్పిస్తే దాదాపు 15 లక్షల కుటుంబాలకు చెందిన 60 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని వారు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని అసైన్డ్ భూములపై హక్కుల అంశాన్ని అమలు చేసి పేద రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్దేశించిన కాలపరి మితి తర్వాత అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తున్నారని వారు గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో అసైన్డ్‌భూముల పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని వారు పేర్కొన్నారు. రైతులకు కేటా యించిన అసైన్డ్‌భూముల్లో సగానికి పైగా కబ్జాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్డ్ భూములపై దృష్టి సారించి పేద రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి మన్నె నర్సింహారెడ్డి అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్, నాయకుడు బక్కజడ్సన్, టీజేఎస్ నాయకుడు అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


'ఆయిల్‌పామ్'ను అందుబాటులో ఉంచాలి

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని, మొక్కలు లేవన్న విషయం ఎక్కడా ప్రస్తావనకు రావొద్దని అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఎండీ సురేందర్, అధికారులు సుధాకర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు శనివారం సచివాలయంలో డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. భట్టి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఆయిల్‌పామ్ మొక్కలను దిగుమతి చేసుకొని రైతులకు అందించాలని, ఆయిల్‌పామ్ పంటకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పంటమార్పిడిలో భాగంగా ఆయిల్‌పామ్‌ను రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని సూచించారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి సంస్థను లాభాల బాటలో నడిపించాలని, రైతులకు మేలు చేయాలన్నారు.

'యశోద'లో ఎక్మోపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, పలువురు డాక్టర్లు

మాదాపూర్: భారతదేశంలో కోవిడ్ మహమ్మారి తర్వాత ఎక్మో అవసరం ఎక్కువగా పెరిగిందని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి తెలిపారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్ లో శనివారం అంతర్జాతీయ ఎక్మో కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్‌ను రెండవరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్మో (ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్) అనేది తీవ్రంగా దెబ్బతిన్న ఊపిరితిత్తులు, గుండెకు అత్యంత అధునాతనమైన లైఫ్ సేవింగ్ సపోర్ట్ సిస్టమ్‌లలో ఒకటి అని తెలిపారు. 13వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్‌లో 20 మందికిపైగా ప్రపంచంలోని అత్యుత్తమ అంతర్జాతీయ అధ్యాపకులు, 100 మందికిపైగా ప్రసిద్ధ జాతీయ అధ్యాపకులు, భారతదేశం నుంచి వేయి మందికి పైగా ఎక్మో వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఎక్కువ మంది రోగులను ఎక్మో సహాయంతో కాపాడిన ఆసుపత్రులలో యశోద హాస్పిటల్ ఒకటి అని తెలిపారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సీనియర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ వెంకట్‌రామన్ కోలా తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై ఫిర్యాదు

ఫోన్ చేసి దుర్భాషలాడారన్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఫిర్యాదు చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంజారాహిల్స్(హైదరాబాద్): తన మనుషులను ఎలా కలుస్తావంటూ చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఫోన్ చేసి దుర్భాషలాడారని మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడురోజుల క్రితం రంజిత్‌రెడ్డి తనకు ఫోన్ చేసి ఇష్టానుసారంగా మాట్లాడారని, ఆయనపై కఠినచర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రంజిత్‌రెడ్డి దిగజారిపోయిన వ్యక్తి అని, సంస్కారంలేని భాష మాట్లాడారని ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను ఫిర్యాదు చేయదలచుకోలేదని, అయితే ఆ దుర్భాషపై తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలని కొందరు పెద్దలు చెప్పడంతో పోలీసుస్టేషన్‌కు వచ్చానన్నారు.

బిర్యానీ కోసం వెళ్లి.. ముగ్గురు మృతి

- అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- గాల్లో ఎగిరి 100 మీటర్ల దూరం వరకు పల్టీలు
- గద్వాల జిల్లా జమ్మిచేడ్‌లో ఘటన



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ఆంజనేయులు



పవన్



నరేశ్ (ఫైల్)

గద్వాల క్రైం: ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడి కుమార్తె జన్మదిన వేడుకలను సిబ్బంది సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. అనంతరం సిబ్బంది బిర్యానీ తినేందుకు వైద్యుడి కారులో హోటల్‌కు వెళ్లారు. అయితే డ్రైవర్ అత్యుత్సాహంతో అతి వేగంగా కారును నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన జోగుళాంబ గద్వాల మండలం జమ్మిచేడ్ వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గద్వాల సీఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు.. గద్వాలలోని అనంత ఆస్పత్రిలో స్థానిక చింతల్‌పేటకు చెందిన ఆంజనేయులు (50) సెక్యూరిటీగా పనిచేస్తుండగా, వనపర్తిజిల్లా పెబ్బేరుకు చెందిన పవన్ (28), మల్దకల్ మండలానికి చెందిన నరేశ్ (23), పాల్వాయి గ్రామానికి చెందిన నవీన్, కేటీదొడ్డి మండలం మైలగడ్డకు చెందిన గోవర్ధన్ ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వైద్యుడు వెంకటేశ్ కూతురు పుట్టినరోజు ఉండటంతో శుక్ర వారం అర్ధరాత్రి సిబ్బంది సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఆ తర్వాత ఆరుగురు సిబ్బంది బిర్యానీ తింటామని చెప్పడంతో వెంకటేశ్ వారికి రూ.5వేలు ఇచ్చారు. డ్రైవర్ మహబూబ్‌తో కలిసి ఆరుగురు అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎర్రవల్లి వైపు బయలుదేరారు. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా కారు నడిపి జమ్మిచేడ్ శివారులో కల్వర్టు వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు గాల్లోఎగిరి 100 మీ టర్ల వరకు పల్టీలు కొట్టింది. ఈ క్రమంలోనే కారు పైభాగం (సన్‌రూఫ్) తెరుచుకోవడంతో ఆంజనేయులు, పవన్, నరేశ్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన డ్రైవర్ మహబూబ్, నవీన్, గోవర్ధన్‌లను అనంత ఆస్పత్రికి తరలించారు. విషమంగా ఉన్న నవీన్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. మృతుడు ఆంజనేయులు కుమారుడు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సృజనశీలత లక్ష్యంగా సాహిత్య అకాడమీ పనిచేయాలి

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి • 'పునాస'సాహిత్య పత్రిక ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలుగు సాహిత్యంలో సృజన శీలతను ప్రతిబింబించే లక్ష్యంతో తెలంగాణ సాహి త్య అకాడమీ పనిచేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో 'పునాస' త్రైమాసిక సాహిత్య పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్య అకాడమీ సాహితీవేత్తలు కోసం 'పునాస'అనే పత్రికను ప్రచురించడం శుభపరిణామం అని కొనియాడారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ ఎండీ రమేశ్ నాయుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డీసీఏకు ఇంటర్‌పోల్ అభినందనలు



సాక్షి, హైదరాబాద్ : వరుస సోదాలతో నకిలీ మందుల ముఠాల వెన్నులో వణుకు పుట్టిస్తున్న తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ)ను ఇంటర్‌పోల్ అధికారులు అభినందించారు. ఈ మేరకు ఇంటర్‌పోల్ అధికారులు డీసీఏను అభినందిస్తూ లేఖ రాసినట్లు డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 డిసెంబర్ 29న చేపట్టిన సోదాల్లో ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్ నుంచి నగరానికి సరఫరా అయిన రూ.26 లక్షల విలువైన నకిలీ యాంటీ బయోటిక్స్ ఔషధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 3న ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్‌లో జరిపిన సోదాల్లో ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్ నుంచి సరఫరా అయిన రూ.22.95 లక్షల విలువైన నకిలీ యాంటీ బయోటిక్స్ మందులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

నకిలీ డ్రగ్ లైసెన్స్‌లపై డీసీఏ కొరడా

ఐశ్వర్య సంతాన సాఫల్య కేంద్రం ఫార్మసీలో సోదాలు

సాక్షి, హైదరాబాద్ : నకిలీ అనుమతితో నడుపుతున్న ఫార్మసీలపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. మలక్‌పేట్‌లోని ఐశ్వర్య సంతాన సాఫల్య కేంద్రంలోని ఐశ్వర్య ఫర్టిలిటీ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్ ఫార్మసీ ఫేక్ డ్రగ్ లైసెన్స్‌తో నడుస్తున్నట్లు డీసీఏ అధికారులు గుర్తించారు. సోదాల సమయంలో ఐశ్వర్య ఫర్టిలిటీ సెంటర్ హెడ్ అడ్మినిస్ట్రేషన్ బోడసు అనిల్ నకిలీ డ్రగ్ లైసెన్స్‌ను అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. అనుమతిలేకుండా సెక్స్ హార్మోన్లు, ఇతర మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.10 లక్షల విలువైన మందులను ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ డి.సరిత, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు జి.అనిల్, బి.గోవింద్ సింగ్, బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నకిలీ మందుల దుకాణాలపై టోల్‌ఫ్రీ నంబర్ 18005996969 కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

22న మధ్యాహ్నం నుంచి పాస్‌పోర్టు కార్యకలాపాలు

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22న హాఫ్‌డే సెలవు ప్రకటించినందున మధ్యాహ్నం నుంచి పాస్‌పోర్టు కార్యకలాపాలు కొనసాగుతాయని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి జె.స్నేహజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో 22వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.15 వరకు స్లాట్లు బుక్ చేసికున్నవారి అపాయింట్‌మెంట్లు అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత స్లాట్లు బుక్ చేసుకున్న వారి అపాయింట్‌మెంట్లు యథావిధి సమయానికే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఐదు ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో అపాయింట్‌మెంటు పొందిన వారందరికీ అదే సమయం వర్తిస్తుందని తెలిపారు.

22న ఎస్వీబీసీలో 'అయోధ్య' ప్రత్యక్ష ప్రసారం

తిరుమల: అయోధ్యలోని శ్రీరామమందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్టాపన కార్యక్రమం ఈ నెల 22వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ తెలుగు, తమిళం, కన్నడ, హిందీ చానళ్లలో, ఎస్వీబీసీ తెలుగు యూట్యూబ్ ద్వారా అయోధ్యలో జరిగే వైదిక, ఆధ్యాత్మిక క్రతువులను నిరంతరాయంగా ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. కాగా, లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం 6వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరుగనుంది. అలాగే తిరుమలలోని ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు జరుగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న మఠాలు, పీఠాలకు చెందిన స్వామీజీలు, భావసారూప్యం గల సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు విచ్చేయనున్నారు.

22న సెలవు ప్రకటించాలి: వీహెచ్‌పీ

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో రామమందిర ప్రారంభం... బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా ఈ నెల 22న సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కార్యాలయంలో ఉన్న ఓఎస్డీకి వీహెచ్‌పీ నేతలు పండరినాథ్, జగదీశ్వర్, భానుప్రసాద్, వెంకటేశ్వరరాజు, పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 22 హిందువులకు సరికొత్త పండుగ దినమైనందున దేవాలయాలు, మఠాలు, పీఠాలు ఈ వేడుకలకు ముస్తాబైనట్లు నాయకులు తెలిపారు. అందులో భాగంగానే అందరూ పండుగ వాతావరణంలో గడిపేందుకు 22న సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.




పదండి.. డైనోసార్లను వేటాడుదాం!

ఒకప్పుడు అడవుల్లో వేట కామన్. నాడు రాజులు సరదాకి చేస్తే.. ఆదివాసీలు ఇప్పటికీ ఆహారం కోసం వేటాడుతుంటారు. ఏ జింకలో, అడవి పందులో అయితే సరే. మరీ పులిని వేటాడాలంటే కష్టం. అది నిషేధం కూడా. మరి ఏకంగా డైనోసార్‌నే వేటాడాలనుకుంటే.. అందుకు అఫీషియల్‌గా లైసెన్స్ కూడా ఇస్తే.. ఆశ్చర్యంగా అనిపిస్తోందా.. ఆ సంగతులేమిటో తెలుసుకుందామా..

అది డైనోసార్ ల్యాండ్..

ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల డైనోసార్ల అవశేషాలు బయటపడినా.. అమెరికా మాత్రం స్పెషల్. ఒకప్పుడు భారీ సంఖ్యలో డైనోసార్లు తిరుగాడిన నేల అది. అందులోనూ ఉటా రాష్ట్రంలోని వెర్నల్ ప్రాంతంలో వేలకొద్దీ డైనోసార్ల శిలాజాలను గుర్తించారు. మనం డైనోసార్లను వేటాడటానికి అధికారికంగా లైసెన్సులు ఇచ్చేది కూడా ఇక్కడే. దానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. పర్యాటకులు అక్కడికి వెళ్లినప్పుడు దరఖాస్తు చేసుకుంటే లైసెన్స్ ఇచ్చేస్తారు. కానీ వేటాడటానికి డైనోసార్లు దొరుకుతాయా అని మాత్రం అడగొద్దు సుమా.



పర్యాటకం కోసం.. శిలాజాల గుర్తింపు కోసం..

ఉటా ప్రాంతంలో పర్యాటకాన్ని పెంచేందుకు, డైనోసార్ల శిలాజాల వెలికితీతకు ఊపునిచ్చేందుకు 1951లో 'డైనోసార్ హంటింగ్ లైసెన్స్'లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ ప్రాంతానికి 'డైనోసార్ కంట్రోల్ ఏరియా ఆఫ్ యూంటా కౌంటీ' అని పేరు పెట్టారు. ఈ వినూత్న ఆలోచనతో పర్యాటకులు కూడా పెరిగారు. ఏటా 60 వేల మందికే లైసెన్స్‌లు ఇస్తారు. అంతేకాదు చాలా రూల్స్ కూడా పాటించాల్సి ఉంటుంది.

- → లైసెన్స్ పొందినవారు టీ-రెక్స్ డైనోసార్లలో కేవలం ఒక పెద్ద మగదానిని మాత్రమే వేటాడాలి.
- → ఒక డిప్లోడాకస్ గిగాంటికస్ (అతిభారీ శాఖాహార డైనోసార్)ను వేటాడొచ్చు. అయితే దాని బరువు 5 వేల పౌండ్లు (2,268 కేజీలు)కన్నా ఎక్కువగా ఉండాలి.
- → ఏవైనా రెండు మగ స్టెగోసార్ (వీపుపై ముళ్లలా ఉండేవి) డైనోసార్లను వేటాడొచ్చు.
- → టెరోడాక్టిల్ (పక్షుల్లా ఎగిరేవి) డైనోసార్లను అయితే నాలుగింటిని వేటాడొచ్చు. అయితే ఇందులో పిల్ల డైనోసార్లు ఉండొద్దు.


కుప్పలు కుప్పలుగా డైనోసార్ల ఎముకలు

ఉటా స్టేట్‌లోని వెర్నల్ ప్రాంతంలో సుమారు రెండు లక్షల ఎకరాల ప్రాంతంలో 'డైనోసార్ నేషనల్ మాన్యుమెంట్' ఉంది. దీన్నే డైనోసార్ ల్యాండ్ అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతమంతా సుమారు 15 కోట్ల ఏళ్ల కిందటి డైనోసార్ల శిలాజాలు ఉన్నాయి. కొన్నిచోట్ల పదుల కొద్దీ డైనోసార్ల శిలాజాలు కుప్పల్లా ఉండటంతో.. 'డైనోసార్ ఎముకల క్వారీ'లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. పర్యాటకులు ఈ ప్రాంతంలో కలియదిరగవచ్చు. కొన్ని డైనోసార్లను ముట్టుకోవచ్చు కూడా.

..మరి పదండి.. డైనోసార్లను వేటాడుదాం..

- సాక్షి సెంట్రల్ డెస్క్

మళ్లీ టెక్ 'లేఆఫ్'



ఏడాది మొదటినెలలోనే వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికిన ఐటీ కంపెనీలు

జాబితాలో గూగుల్, అమెజాన్, ఇతర దిగ్గజ సంస్థలు

'జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై కంపెనీల పెట్టుబడులే కారణమంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్ : టెక్ 'లేఆఫ్స్'మళ్లీ మొదలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు భారత్ ఐటీ పరిశ్రమపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 జనవరి తొలి రెండువారాల్లోనే 58 టెక్ కంపెనీలు 7,785 మంది ఉద్యోగులను తొలగించినట్టు లేఆఫ్-ట్రాకింగ్ వెబ్‌సైట్ లేఆఫ్స్.ఎఫ్‌వైఐ తాజాగా స్పష్టం చేసింది. టెక్ ప్రపంచంలో చోటు చేసుకుంటున్న ఈ లేఆఫ్స్ ట్రెండ్‌ను పరిశీలిస్తే..రాబోయే రోజులు కూడా భారత ఐటీ వృత్తినిపుణులు, టెకీలకు అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారు. నూతన సంవత్సరంలోకి అడుగిడి ఇంకా మూడు వారాలు కూడా దాటకుండానే వేలాది మంది టెక్ స్టార్టప్ ఉద్యోగులు లేఆఫ్స్‌కు గురికాగా, రాబోయే రోజుల్లో ఇంకా కొందరికి ప్రమాదం పొంచి ఉందనే అభిప్రాయపడుతున్నారు. 'జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై పెద్ద కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం కూడా దీనికి పరోక్షంగా కారణమని వారంటున్నారు.

దిగ్గజ కంపెనీల్లో తొలగింపులు ఇలా....

- గూగుల్... డిజిటల్ అసిస్టెంట్, హార్డ్‌వేర్ అండ్ ఇంజినీరింగ్ టీమ్‌లలో వందలాదిమంది
- అమెజాన్ సంస్థలోని అమెజాన్ ఆడిబుల్ తమ వర్క్‌ఫోర్స్‌లో ఐదు శాతం
- అమెజాన్ ప్రైమ్ వీడియోలో వందలాదిమంది ఉద్యోగులు
- అమెజాన్ ట్విచ్ తన వర్క్‌ఫోర్స్‌లో 35 శాతం అంటే 500 మంది
- సోషల్ చాట్, మెసేజింగ్ స్టార్టప్ డిస్కార్డ్ 17 శాతం ఉద్యోగులను అంటే 170 మంది
- వీడియోగేమ్ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ యూనిటీ సాఫ్ట్‌వేర్ తన ఉద్యోగుల్లో 25 శాతం అంటే 1,800 మంది
- ఐటీ కంపెనీ జిరాక్స్ తన వర్క్‌ఫోర్స్‌ను 15 శాతం అంటే 3000మంది
- యూఎస్‌కు చెందిన ప్రాప్‌టెక్ కంపెనీ ఫ్రంట్‌డెస్క్ గూగుల్ మీట్‌లో రెండు నిమిషాల్లోనే తన 200 మంది ఉద్యోగులను తొలగించింది.

ఏడాదంతా ఇదే పరిస్థితి ఉండొచ్చు



భారతీయ ఐటీ కంపెనీలకు కొత్త ప్రాజెక్టులు రాకపోవడం/వాయిదా పడడంతో ఆ ప్రభావం ఇక్కడి ఐటీ పరిశ్రమపై పడింది. యూఎస్ వడ్డీరేట్ల పెరుగుదల, పరిశ్రమపై చాట్ జీపీటీ వంటి కృత్రిమమేథ ప్రభావాలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనా-ఇజ్రాయిల్ వ్యవహారం, ఎర్రసముద్రంలో హైతీ తీవ్రవాదుల దాడులు వంటివి కూడా తోడు కావడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఈ పరిణామాలన్నీ అమెరికా డాలర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఇండియాకు రావాల్సిన నూతన ప్రాజెక్టులు ఆగిపోయాయి. కరోనా కాలంలో భారీగా ప్రాజెక్టులు వస్తాయని కంపెనీలు ఊహించి పెద్ద ఎత్తున ఉద్యోగులను రిక్రూట్ చేశాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో కంపెనీలన్నీ కూడా ఉద్యోగుల బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ పేరిట పెద్ద సంఖ్యలో లేఆఫ్ చేయడం మొదలుపెట్టాయి. దీంతో కొత్తగా ఉద్యోగాలు రాకపోగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. 2020-21 నుంచే యూఎస్ ప్రభుత్వం వడ్డీరేట్లు పెంచడం మొదలుపెట్టింది. ఈ విధంగా చేయడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించొచ్చునని భావించింది. అయితే మూడేళ్లగా ద్రవ్యోల్బణం అదుపునకు ఆర్థిక వ్యవస్థ నెమ్మదించేలా ఇలాంటి చర్యలే కొనసాగాయి. 2024లో అమెరికా అధ్యక్ష ఎన్నికలున్నందున ఈ ఏడాదంతా కూడా ప్రస్తుత పరిస్థితులే కొనసాగే అవకాశాలున్నాయి.

- ఎస్.లావణ్యకుమార్, స్మార్ట్‌స్టెప్స్ సంస్థ సహవ్యవస్థాపకుడు

లేఆఫ్ సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి




ఐటీ దిగ్గజ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా లేఆఫ్స్‌కు దిగడం ఆందోళన కలిగించే పరిణామమే. ఈ ప్రకంపనలు భారత్ టెక్, ఐటీ ఇండస్ట్రీపై కూడా పడడంతో ఇది ఎటువైపు దారితీస్తుంది..ఎలాంటి చిక్కులు, అడ్డంకులు సృష్టిస్తుందనేది చూడాలి. ఆర్థికంగా ఎదురయ్యే పరిస్థితులు, మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులు తదితరాలతో మనదేశంలోనూ పెద్ద కంపెనీ లేఆఫ్స్‌కు దిగడం మొదలుపెట్టాయి. గ్లోబల్ ఐటీ వర్క్‌ఫోర్స్‌కు భారత్ అందిస్తున్న భాగస్వామ్యం ముఖ్యమైనది కావడంతో లేఆఫ్స్‌తో ఎదురయ్యే సవాళ్లు ఎదుర్కోవడానికి సిద్ధం కావాల్సిందే. ఐటీరంగమనేది ఆర్థిక పురోగతికి దోహదం చేస్తున్న కారణంగా ప్రస్తుత లేఆఫ్స్ వంటి పరిణామాలతో భారత జాబ్ మార్కెట్ కూడా ఒడిదుడుకులకు గురవుతోంది. ఈ ప్రభావాలు, పరిణామాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ దిగ్గజాలు, వృత్తినిపుణులు కలిసి సంయుక్తంగా ముందుకు సాగితే లేఆఫ్స్ అనంతర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

- కార్తీక్ దాలే, డేటాస్కిల్స్ సంస్థ ఫౌండర్



స్వచ్ఛత అభియాన్‌లో గవర్నర్ తమిళిసై

బంజారాహిల్స్: అయోధ్య రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆమె ఖైరతాబాద్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.



శ్మశానం ఎదుట టెంట్ కింద రాజేందర్ మృతదేహాన్ని ఉంచిన బంధువులు



గూడు లేక.. శ్మశానమే నీడాయే

- అనారోగ్యంతో టీకొట్టు యజమాని మృతి
- సొంతిల్లు లేక శ్మశానం ఎదుటే మృతదేహాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు.. చందాలతో అంత్యక్రియలు
- హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఘటన

కమలాపూర్: ప్రాణాలు పోయిన ఇంటి పెద్దను కాసేపైనా చూసుకునేందుకు సొంతిల్లు లేని ఆ కుటుంబానికి శ్మశానమే నీడైంది. శ్మశానవాటిక ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో టెంట్ కింద మృతదేహాన్ని ఉంచి బంధువులు, కులస్తుల చందాలతో అంత్యక్రియలు నిర్వహించిన వైనమిది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో శనివారం ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం సోమదేవరపల్లి (మానింగంపల్లె)కు చెందిన గాజుల రాజేందర్ (50) సుమారు 30 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం కమలాపూర్‌కు వచ్చాడు. అద్దె ఇంట్లో ఉంటూ స్థానికంగా టీ కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజేందర్‌ను ఇటీవల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. కాగా, అద్దె ఇంటి యజమాని.. రాజేందర్ మృతదేహాన్ని తీసుకురావద్దని, అంత్యక్రియల అనంతరం తదుపరి కార్యక్రమాలన్నీ ఇక్కడే చేసుకోవచ్చని చెప్పాడు. దీంతో ఆ కుటుంబం విధిలేని పరిస్థితుల్లో శ్మశానవాటిక ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో టెంట్ వేయించుకుని మృతదేహాన్ని అక్కడికే తరలించారు. అంత్యక్రియలు చేయడానికి కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులు, బంధువులు తలా కొంత మొత్తం చందాలు వేసుకుని అంత్యక్రియలు ముగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకు లేకపోవడంతో రాజేందర్ భార్య సుజాత భర్తకు తలకొరివి పెట్టింది. స్థానిక పద్మశాలి సంఘం నాయకులు రూ.11 వేల ఆర్థికసాయం అందించారు.

'ఇన్‌కమ్ ట్యాక్స్' మెసేజ్‌లతో జాగ్రత్త!

అనుమానిత లింకులను ఓపెన్ చేయవద్దని సూచిస్తున్న సైబర్ నిపుణులు



సాక్షి, హైదరాబాద్: 'ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్ పేరిట సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్ పంపుతున్నారు. మెసేజ్‌లోని లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలని కోరుతున్నారు. ఇలాంటివి నమ్మి మోసపోవద్దు' అని పోలీసులు సూచిస్తున్నారు. వాస్తవానికి ఆదాయ పన్నుశాఖ వ్యక్తిగత వివరాలు కోరుతూ ఎప్పుడూ ఈ-మెయిల్ పంపదని గుర్తించాలని వారు చెబుతున్నారు. ఐటీ రిటర్న్స్ పేరిట వచ్చే ఈ-మెయిల్ లింక్‌లపై క్లిక్ చేస్తే మన మొబైల్ డివైజ్‌లలోకి వైరస్ వచ్చేలా సైతం సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. అలాగే ఎవరికీ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దని, మొబైల్, ల్యాప్‌టాప్‌లలో యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అనుమానాస్పద ఈ-మెయిల్స్‌పై, వెబ్‌సైట్ యూఆర్ఎల్స్‌ను webmanager@incometax.gov.in. లేదా incident@certain.org.inకి ఫార్వర్డ్ చేయాలని చెబుతున్నారు.

అయోధ్య సీతారాములకు పోచంపల్లి పట్టువస్త్రాలు



భూదాన్‌పోచంపల్లి/సనత్‌నగర్: అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీరాముడు, సీతాదేవికి పోచంపల్లి పట్టువస్త్రాలను బహూకరించనున్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సనత్‌నగర్‌లోని హనుమాన్ మందిరంలో పోచంపల్లి మద్దెలమ్మదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేనేత కళాకారులు మగ్గంపై పట్టువస్త్రాలను నేయడం ప్రారంభించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శాస్త్రోక్తంగా ఈ పనిని ప్రారంభించారు. సికింద్రాబాద్ గణపతి దేవాలయం ట్రస్టీ ఎస్ఎస్ జయరాజ్, బొమ్మెర సతీశ్, గంజి కేదార్ సహకారంతో హనుమాన్ దేవాలయంలో మగ్గాన్ని ఏర్పాటు చేసి శ్రీరామచంద్రుడికి పట్టుపంచె, సీతాదేవికి పోచంపల్లి ఇక్కత్ చీర తయారు చేస్తున్నారు. మూడురోజుల్లో వీటి తయారీ పూర్తి అవుతుందని, 29న అయోధ్యకు తీసుకువెళ్లి సమర్పిస్తామని దేవాలయ కమిటీ అధ్యక్షుడు రుద్ర చెన్నకేశవులు చెప్పారు.

కొమురవెల్లిలో కొత్తగా రైల్వే స్టేషన్

- స్టేషన్‌లో రైళ్ల హాల్టుకు రైల్వే శాఖ ఆదేశాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో స్పందించిన రైల్వే మంత్రి
- త్వరలో పనులు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: కొమురవెల్లి మల్లన్న భక్తుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మనోహరాబాద్-కొత్తపల్లి మార్గంలో కొమురవెల్లిలో కొత్తగా రైల్వే స్టేషన్ నిర్మించడంతో పాటు భక్తుల కోసం అక్కడ రైళ్లు ఆపేలా చర్యలు చేపట్టారు. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ అవసరం, మలన్న భక్తులకు కలిగే సౌకర్యాన్ని వివరిస్తూ కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పలుమార్లు రైల్వే శాఖ మంత్రికి లేఖలు రాశారు. అలాగే ప్రత్యేకంగా మంత్రిని కలిసి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. దీని సాధ్యాసాధ్యాలపై చర్చించిన రైల్వేశాఖ.. రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి అంగీకారం తెలిపింది. లక్డారం - దుద్దెడ స్టేషన్ల మధ్యన కొమురవెల్లిలో కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి సానుకూలంగా స్పందిస్తూ రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది. రైల్వే అధికారుల నిర్ణయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కొమురవెల్లి మల్లన్న భక్తులకు మోదీ ప్రభుత్వం అందించిన కానుకగా ఈ రైల్వేస్టేషన్ ఏర్పడనుందని ఆయన పేర్కొన్నారు. స్టేషన్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. మల్లన్న భక్తుల తరఫున ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

పంచకుండా పడేశారు

- చెత్త ట్రాక్టర్‌లో ఆధార్, ఏటీఎం, పాన్, పోస్ట్ కార్డులు
- వికారాబాద్ జిల్లాలో ఓ పోస్ట్‌మ్యాన్ నిర్వాకం
- ప్రజలకు అందించకుండా ఇంట్లోనే ఉంచుకున్న వైనం



చెత్తట్రాక్టర్‌లో ఉన్న ఆధార్ కార్డులు



కుప్పలా ఆధార్‌కార్డులు

కుల్కచర్ల (వికారాబాద్): పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రజలకు అందివ్వాల్సిన ఆధార్, ఏటీఎం, పాన్, పోస్టు కార్డుల్ని ఓ పోస్ట్‌మ్యాన్ వారికివ్వకుండా ఏళ్ల తరబడి ఇంట్లోనే ఉంచేసుకున్నాడు. చివరికి వాటిని మూటకట్టి గ్రామానికి చెందిన ఓ చెత్త ట్రాక్టర్‌లో పడేశాడు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆ పోస్ట్‌మ్యాన్ నర్సింలు నిర్వాకం గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా బయటకు వచ్చింది. వికారాబాద్ జిల్లాలో శనివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

వెలుగు చూసిందిలా...: జిల్లాలోని చౌడాపూర్ మండల కేంద్రంలోని చౌడాపూర్ గ్రామానికి చెందిన చెత్త ట్రాక్టర్ శనివారం చెత్తను సేకరిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన పోస్ట్‌మ్యాన్ నర్సింలు ఇంటివద్ద ఆగింది. ఆ సమయంలో నర్సింలు కుటుంబసభ్యులు ఓ పెద్ద సంచిని తీసుకొచ్చి ట్రాక్టర్‌లో పడేశారు. కొద్ది దూరం వెళ్లాక ఈ సంచిని గమనించిన పంచాయతీ సిబ్బంది మూట విప్పి చూడగా..అందులో 2 వేలకు పైగా ఆధార్ కార్డులు, వందకు పైగా పాన్, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, మరికొన్ని ఉత్తరాలు కన్పించాయి. వీటిలో 2011 ఏడాదికి చెందినవి కూడా ఉన్నాయి. దీంతో పంచాయతీ కార్యాలయం వద్ద సంచిని దించారు. ఈ విషయాన్ని కొంతమంది వీడియోతీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయగా వీడియోను చూసిన చౌడాపూర్, మక్తవెంకటాపూర్, మందిపల్ గ్రామస్తులు అక్కడకు చేరుకుని వారికి రావాల్సిన కార్డుల్ని తీసుకున్నారు. మిగిలిన ఆధార్, ఏటీఎం, క్రెడిట్ కార్డులను చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు వద్ద భద్రపరిచారు.

పోస్ట్‌మ్యాన్ నిర్లక్ష్యంపై ఆందోళన...: నర్సింలు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నాడంటూ కొంతమంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇటీవలే ఆందోళన కూడా చేశారు. తాజా ఘటనతో అతడిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మహబూబ్‌నగర్ జిల్లా పోస్టల్ అధికారులకు సిఫార్సు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

చెక్కు దొరకలేదు.



డిసెంబర్‌లో ఓ బీమా కంపెనీ నుంచి రూ.33 వేల చెక్కు రావాల్సి ఉంది. ఈ విషయమై కొద్ది రోజులుగా పోస్ట్‌మ్యాన్‌ను అడుగుతూనే ఉన్నాను. ఆయన మాత్రం ఎలాంటి చెక్కు రాలేదని చెబుతున్నాడు. ఈ విషయమై సబ్ పోస్టాఫీస్‌కు వెళ్లి ఆరా తీయగా డిసెంబర్ 9వ తేదీనే గ్రామానికి పంపించామని చెప్పారు. వీడియో చూసి పంచాయతీకి వెళ్లి సంచిలో వెదికినా నాకు రావాల్సిన చెక్కు మాత్రం దొరకలేదు.

–కావలి రాములు, చౌడాపూర్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.